పెన్షన్ ప్రయోజనాల్లో కాంట్రాక్టు సర్వీసునూ లెక్కించాల్సిందే

- తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు

7

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 293 | విజయవాడ, మంగళవారం 27 మే 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 27 May 2025 | Rs

జస్టిస్ ఎన్‌వి అంజరియా జస్టిస్ విజయ్ బిష్ణోయి జస్టిస్ ఎఎస్.చందూర్కర్

సుప్రీం కోర్టుకు ముగ్గురు కొత్త జడ్జీలు

7

రుతుపవనాలు వచ్చేశాయి!

శుభపరిణామం : సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. రాయలసీమ ప్రాంతంలోకి రుతుపవనాలు ప్రవేశించినట్లు భారత వాతావరణ శాఖ సోమవారం తెలిపింది. వీటి ప్రభావంతో రాయలసీమలో కడపతో పాలు పలు ఇతర జిల్లాల్లో వర్షాలు పడుతున్నాయి. మరోవైపు ఉపరితల ద్రోణి ప్రభావంతో బాపట్ల జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. గత ఏడాది జూన్ రెండవ తేదిన రుతుపవనాలు రాష్ట్రంలోకి రాగా, ఈ ఏడాది ముందుగానే నైరుతి పలకరించడం శుభ పరిణామమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన పోస్టు చేశారు. రానున్న రోజుల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ అంచనాలు నిజం కావాలని, రైతులకు రాష్ట్రానికి మేలు జరగాలని కోరుకుంటున్నట్లు అందులో పేర్కొన్నారు. వ్యవసాయాధారిత రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిస్తేనే రైతన్న బాగుంటాడని, అన్నదాత సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నారు. రానున్న 24 గంటల్లో పశ్చిమ మధ్య బంగాళాఖాతం, ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణశాఖ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ తెలిపారు.

దీని ప్రభావంతో రానున్న మూడురోజుల్లో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు.నైరుతి రుతుపవనాల ప్రభావంతో సోమవారం అల్లూరి జిల్లా రాచపనుకులో 56 మిల్లీమీటర్లు, విజయనగరంలో 42.7, మారేడుమిల్లిలో 41.5, గంపరైలో 34, నెల్లిమర్లలో 33, అన్నమయ్య జిల్లా ఎంగిలిబండ, కర్నూలు జిల్లా కామవరంలో 31.5 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైందని వివరించారు.

ముంబయిలో కుండపోత

- 1818 రికార్డును చెరిపేసిన భారీ వర్షాలు
- దేశంలోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించిన నైరుతి

7

మదురో ఘన విజయం

వెనిజులా ఎన్నికల్లో పాలక పక్షానికి 82శాతం ఓట్లు

కారకస్ : వెనిజులా ఎన్నికల్లో అధ్యక్షుడు నికొలస్ మదురో నేతృత్వంలోని యునైటెడ్ సోషలిస్టు పార్టీ ఆఫ్ వెనిజులా (పిఎస్‌యువి) ఘనవిజయం సాధించింది. నేషనల్ ఎలక్టోరల్ కౌన్సిల్ (సిఎన్ఇ) సోమవారం ప్రాథమిక ఫలితాలను విడుదల చేయగా, పాలక యునైటెడ్ సోషలిస్టు పార్టీ ఆఫ్ వెనిజులా (పిఎస్‌యువి), దాని మిత్రపక్షాలు 82.68శాతం ఓట్లను సాధించాయి. ఈ ఫలితాలతో అటార్నీ జనరల్ కార్యాలయంతో సహా దేశంలోని కీలకమైన అధికార స్థానాలపై నియంత్రణ పాలక పార్టీకే కొనసాగనుంది. మొత్తంగా దేశంలోని 24 రాష్ట్రాలకు గవర్నర్లను, పార్లమెంట్‌కు 285 మంది డిప్యూటీలను, 24 శాసన మండళ్లను ఎన్నుకోవడానికి ఈ ఎన్నికలు జరిగాయి. తాజా ఫలితాల్లో 24 రాష్ట్ర గవర్నర్ల స్థానాలకు గానూ 23 స్థానాలను అధికార పక్షమే గెలుచుకుంది. ఇది ప్రతిపక్షానికి తీవ్రమైన ఎదురు దెబ్బే. ఈ ఎన్నికల ఫలితాలతో ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన పటిష్టమైన మెజారిటీని మదురో ప్రభుత్వం సంపాదించుకున్నట్లైంది.

మహత్తర విజయం : మదురో

ఎన్ని రాజకీయ ఉద్రిక్తతలు వున్నా, అంతర్జాతీయ ఒత్తిళ్లు ఎదురైనా ప్రజాస్వామ్యానికి లభించిన మహత్తర విజయమిదని వెనిజులా అధ్యక్షుడు మదురో వ్యాఖ్యానించారు.

ఆదివారం జరిగిన పార్లమెంట్, ప్రాంతీయ ఎన్నికలను ప్రతిపక్షం బహిష్కరించింది. గతంలో నాలుగు రాష్ట్రాలపై ప్రతిపక్షాలకు పట్టు వుండేది. గతేడాది జులైలో జరిగిన అధ్యక్ష ఎన్నికలపై నిరసన వ్యక్తం చేస్తూ ఎన్నికలను బహిష్కరించాలని ప్రధాన ప్రతిపక్ష నేతలు ఓటర్లను కోరారు. ప్రతిపక్షాల బహిష్కరణను మదురో తోసిపుచ్చారు. ఎన్నికల బరి నుండి ప్రత్యర్థి వైదొలగినప్పుడు ముందుకు చొచ్చుకుపోతామని వ్యాఖ్యానించారు. ఆదివారం నాటి పోలింగ్‌లో ఉద్రిక్తతలు సృష్టించేందుకు చేసిన ప్రయత్నాలను పోలీసులు అడ్డుకున్నారు. 70మందికి పైగా ఆందోళనకారులను అరెస్టు చేశారు. ఓటింగ్‌ను అడ్డుకోవడానికి ఉగ్రవాద నెట్‌వర్క్‌తో విధ్వంసం సృష్టించడానికి ప్రతిపక్ష సభ్యుడు జువాన్ పాబ్లో గుయానిపా ప్రయత్నించడంతో అదుపులోకి తీసుకున్నారు. విదేశాలతో కలిసి వెనిజులాలో కుట్రలు పన్నేందుకు ప్రతిపక్షం ప్రయత్నిస్తోందంటూ ప్రభుత్వం హెచ్చరిస్తూనే వస్తోంది. డజన్ల సంఖ్యలో కిరాయి మూకలు కొలంబియా నుండి దేశంలోకి ప్రవేశించాయని పేర్కొంది.

ప్రశాంతంగా ఎన్నికలు

ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించామని సిఎన్ఇ అధ్యక్షుడు ఎల్విస్ అమోరోస్ చెప్పారు. 285మంది డిప్యూటీలను, 260మంది ప్రాంతీయ లెజిస్లేటర్లను, 24మంది గవర్నర్లను ఎన్నుకోవడానికి 54 రాజకీయ పార్టీలకు చెందిన 6,600మందికి పైగా అభ్యర్థులు ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. వీరిలో మొదటిసారిగా గుయానా ఎసెక్విబా రాష్ట్రం నుండి ఎన్నికైన ప్రతినిధులు కూడా వున్నారు.

55లక్షలకు పైగా ఓట్లు లెక్కించగా, జిపిపికి 45,53,484 ఓట్లు లభించాయి. అంటే 50సీట్లకు గానూ 40సీట్లు గెలుచుకుని కొత్త పార్లమెంట్‌లో తన బలాన్ని సంఘటితం చేసుకుంది. సైమన్ బొలీవర్ గ్రేట్ పేట్రియాటిక్ పోల్ (జిపిపిఎస్‌బి) దేశంలోని కీలకమైన గవర్నర్ల పదవులను గెలుచుకుందని నేషనల్ ఎలక్టోరల్ కౌన్సిల్ (సిఎన్ఇ) ప్రకటించింది. ఇందులో వివాదాస్పదమైన గుయానా ఎసెక్విబా రీజియన్ కూడా వుంది. వెనిజులా ఎన్నికల వ్యవస్థ బహుళత్వాన్ని పునరుద్ధాటించేలా ఈ ఎన్నికలు జరిగాయి.

గోదావరిలో 8 మంది గల్లంతు

- అంతా 20 ఏళ్లలోపు వారే
- ముమ్మరంగా కొనసాగుతున్న గాలింపు

ప్రజాశక్తి- ముమ్మిడివరంచ అమరావతి బ్యూరో

స్నానానికి గోదావరిలో దిగిన ఎనిమిది మంది గల్లంతయ్యారు. వీరంతా 20 ఏళ్లలోపు వారే. వారి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కమిని లంకలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం శేరుల్లంకలో ఓ శుభకార్యానికి రామచంద్రపురం, కాకినాడ, మండపేట, ఐ.పోలవరం మండలాలకు చెందిన పలువురు యువకులు వచ్చారు. వీరిలో 11 మంది కమినిలంక గోదావరిలో స్నానానికి దిగారు. వీరిలో ముగ్గురికి మాత్రమే ఈతలో అనుభవం ఉంది. మిగిలిన వారు ఈతరాకుండానే నదిలో దిగారు. ఆ ప్రాంతంలో లోతు ఎక్కువగా ఉండడంతో ఎనిమిది మంది గల్లంతయ్యారు. ఈతొచ్చిన ముగ్గురూ సురక్షితంగా ఒడ్డుకు చేశారు. గల్లంతైన వారిలో కాకినాడకు చెందిన క్రాంతి (20), పాల్ (18), సాయి (18), సతీష్ (19), ఐ.పోలవరం మండలం ఎర్రగరువుకు చెందిన మహేష్ (13), రాజేష్ (13) మండపేటకు చెందిన రోహిత్ (18), శేరుల్లంకకు చెందిన మహేష్ (17) ఉన్నారు. గ్రామస్తులు, గజ ఈతగాళ్లతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనా ప్రాంతానికి జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎస్‌పి కృష్ణారావు చేరుకుని గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఈ ఘటనకు కారణాలను అక్కడి వారిని అడిగి తెలుసుకున్నారు.

చంద్రబాబు ఆరా

ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గల్లంతైన వారిని రక్షించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని ఆదేశించారు. గల్లంతైనవారి కుటుంబాలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని కలెక్టర్‌కు సిఎం సూచించారు.

సిపిఎం దిగ్భ్రాంతి

గోదావరిలో ఎనిమిది మంది గల్లంతుపై సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. స్థానిక జాలర్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టాలని కోరింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు.

ఘటనపై అడిగి తెలుసుకుంటున్న ఎస్‌పి కృష్ణారావు

పథకం ప్రకారమే..

- ఉక్కు కార్మికుల తొలగింపుపై బివి రాఘవులు
- సమ్మెను విరమించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి
- రాష్ట్ర ప్రయోజనాలు పక్కనపెట్టి బిజెపి సేవ చేయడం సబబుకాదు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పథకం ప్రకారమే విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులను తొలగిస్తోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. విశాఖలోని సిఐటియు కార్యాలయంలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడుతో కలిసి సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ ఇద్దరూ మోడీ సేవ ఆపి కాంట్రాక్టు కార్మికుల సమ్మె పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను పక్కనబెట్టి బిజెపికి సేవచేయడం సబబు కాదన్నారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్నారని, దీన్ని పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని చెప్పారు. కాంట్రాక్టు కార్మికులు జీతాల కోసమో, రెగ్యులరైజేషన్ కోసమో సమ్మె చేయడం లేదని, మూడు వేల మందిని తొలగించడం తో మరో మార్గంలేక సమ్మెకు దిగారని అన్నారు. ఈ చర్య సంస్థ అస్థిత్వాన్ని కూడా దెబ్బ తీస్తోందని చెప్పారు. తొలగించిన వారికి ఎటువంటి నష్ట పరిహారమూ చెల్లించలేదని చెప్పారు. కాంట్రాక్టు కార్మికులకు ఇది జీవన్మరణ పోరాటమని, అందుకే అన్ని కార్మిక సంఘాలూ ఐక్యంగా సమ్మె చేస్తున్నాయని తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల్లో ఎక్కువ శాతం మంది నిర్వాసితులేనని చెప్పారు.

ఇక్కడ నాశనం చేసి... పక్క జిల్లాలో హబ్బా?

విశాఖపట్నం పక్కన ఉన్న జిల్లాను స్టీల్ హబ్‌గా తయారు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెబుతున్నారని, ఇక్కడ ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను నాశనం చేస్తూ పక్క జిల్లాను స్టీల్‌హబ్‌గా తయారు చేయటం ఏమిటని రాఘవులు ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోడీ భారతదేశాన్ని ఐదు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ దేశంగా అభివృద్ధి చేస్తానని చెబుతున్న తరుణంలో స్టీల్, సిమెంట్, మౌలిక వసతులు పెరగకుండా ఎలా సాధ్యమని ప్రశ్నించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించడమే కాకుండా దీన్ని మరింత విస్తరించి మరిన్ని ఉద్యోగాలు కల్పించే స్థాయికి వస్తేనే వారు చెబుతున్న స్థాయికి దేశం వచ్చే అవకాశం ఉందన్నారు.

తెలుగు ప్రజలు ప్రతిఘటించాలి

ఈ ఏడాది ఆగస్టు లోపల అసెట్ మానిటైజేషన్ చేయాలని కేంద్రం ప్రకటించిందని, అంటే ప్రభుత్వ ఆస్తులు అమ్మేసి డబ్బులు చేసుకోవాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తాపత్రయ పడుతోందని అన్నారు. ప్రభుత్వరంగ వ్యవస్థలన్నింటినీ ప్రయివేటుకు కారు చౌకగా అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం ఈ రకమైన చర్యలు చేపడుతోందని వివరించారు. ఇందులో స్టీల్ ప్లాంట్ భూములు కూడా ఉండే అవకాశం ఉందని, తెలుగు ప్రజలంతా ముందుకొచ్చి ప్రతిఘటించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమ్మెను విరమింపచేసే చర్యలు చేపట్టాలని, తొలగించిన మూడు వేల మంది కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, వారి ఇతర సమస్యలను పరిష్కరించాలని, ఇక్కడి ప్రభుత్వ ప్రతినిధులు స్టీల్‌ప్లాంట్‌ను కాపాడేందుకు కావలసిన చర్యలు చేపట్టేందుకు, గనుల కేటాయింపు తదితర సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని కోరారు.

స్టీల్ ప్లాంట్‌పై సిఎం, డిప్యూటీ సిఎంలు వైఖరి చెప్పాలి

ఎన్‌డిఎ కూటమిలో భాగమైన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఈ నెల 25న జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో స్టీల్‌ప్లాంట్ గురించి మాట్లాడినట్టు ఎక్కడా కనిపించలేదని, స్టీల్‌ప్లాంట్‌ను వదిలించుకునే కుట్రలో వారు కూడా భాగస్వాములైనట్లు తెలుస్తోందని అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై వారి వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. నీతి ఆయోగ్ సమావేశంలో ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు మొత్తం దేశానికి సంబంధించిన సమస్యలతోపాటు వారి రాష్ట్రాల సమస్యలను మాట్లాడారని, కొన్ని బిజెపి రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా వారి రాష్ట్రాల సమస్యలు ప్రస్తావించారని, మన రాష్ట్రానికి చెందిన ఇద్దరు నాయకులు మాత్రం ఉపదేశాలు చేసి వెనక్కి వచ్చారని అన్నారు.

ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలుపుదల చేయాలి

ఆపరేషన్ కగార్ ఆపేశామని కేంద్రం చెబుతున్నా కిందిస్థాయి బలగాలతో మావోయిస్టులను ఎరివేసే ప్రక్రియ కొనసాగుతోందని రాఘవులు తెలిపారు మావోయిస్టులు చర్చలకు సిద్ధమైనప్పటికీ ఇటువంటి చర్య చేపట్టడం సరికాదని చెప్పారు. పారా మిలటరీ బలగాల కదలికలను వెంటనే నిలిపివేసి చర్చలు ప్రారంభించాలని తాము ముందు నుంచీ చెబుతున్నామని తెలిపారు.

మాట్లాడుతున్న బివి.రాఘవులు

దేశంలో వెయ్యి దాటిన కరోనా యాక్టివ్ కేసులు

- ఏడు రోజుల్లో 752
- ఏడుగురు మృతి

న్యూఢిల్లీ : దేశంలో కరోనా యాక్టివ్ కేసులు 1009కి చేరుకున్నాయి. ఈ నెల 19న కేసుల సంఖ్య 257గా ఉండటం గమనార్హం. కేంద్ర ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వ శాఖ సమాచారం ప్రకారం.. దేశవ్యాప్తంగా మొత్తం 1009 యాక్టివ్ కేసులు నమోదయ్యాయి. ఇందులో కేరళ నుంచి అత్యధికంగా 430 కేసులు నమోదైనా, మరణాలేవీ సంభవించలేదు. గతవారం నుంచి ఇక్కడ 335 కేసులు పెరిగాయి. మహారాష్ట్ర (209 కేసులు) రెండో స్థానంలో ఉంది. ఇక్కడ వారం వ్యవధిలో 153 కేసులు పెరిగాయి. ఈ రాష్ట్రంలో నాలుగు మరణాలు నమోదయ్యాయి. ఢిల్లీలో 99 కేసులు పెరిగి ఆ సంఖ్య 104కు చేరింది. గుజరాత్ (83), తమిళనాడు (69), కర్ణాటక (47), ఉత్తరప్రదేశ్ (15), రాజస్తాన్ (13), పశ్చిమ బెంగాల్ (12), పుదుచ్చేరి (09), హర్యానా (09), ఆంధ్రప్రదేశ్ (04), మధ్యప్రదేశ్ (02), తెలంగాణ, గోవా, ఛత్తీస్‌గఢ్‌లలో ఒక్కటి చొప్పున కేసులు నమోదయ్యాయి. ఎన్‌బి.1.8.1, ఐ.ఎఫ్.7 కోవిడ్ వేరియంట్లను దేశంలో గుర్తించినట్టు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వివరించింది. భయపడాల్సిందేమీ లేదనీ, దీర్ఘ కాలిక వ్యాధులు ఉన్నవారు జాగ్రత్తలు తీసుకోవాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ రాజీవ్ బహల్ సూచించారు.

సర్వం సిద్ధం

- నేటి నుంచి 'మహానాడు'

కడపలో మహానాడు కోసం ముస్తాబైన వేదిక

ప్రజాశక్తి-ప్రత్యేక ప్రతినిధి (మహానాడు ప్రాంగణం కడప)

టిడిపి మహానాడుకు సర్వం సిద్ధమైంది. మూడు రోజులపాటు కడప జిల్లాలోని పబ్బాపురం వద్ద ఈ కార్యక్రమం జరగనుంది. మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రతినిధుల నమోదుతో కార్యక్రమం ప్రారంభం కానుంది. మొత్తం 150 ఎకరాల్లో ప్రాంగణం ఉంది. మొత్తం 450 మంది ప్రతినిధులు కూర్చునేలా వేదికను సిద్ధం చేశారు. 24 తీర్మానాలను సభలో ప్రవేశపెట్టనున్నారు. వీటిల్లో రాష్ట్రానికి చెందిన 14, తెలంగాణకు చెందిన అంశాలు 5, ఉమ్మడి తీర్మానాలు 4 చొప్పున ఉన్నాయి. ముఖ్యంగా కూటమి పాలనకు సంబంధించిన అంశాలపైనే తీర్మానాలు ప్రముఖంగా ఉన్నాయి.

తొలిరోజు పార్టీ సంస్థాగత నిర్మాణం, సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణపై నేతలు దిశానిర్దేశం చేయనున్నారు. అదేరోజు అధ్యక్షుడి ఎన్నికకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. రెండోరోజు పార్టీ అధ్యక్షుడి ఎన్నిక ఉంటుంది. మూడో రోజు భారీ బహిరంగ సభ జరగనుంది. టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌తో పాటు పార్టీ ముఖ్య నేతలు సోమవారం ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. మహానాడులో చర్చించాల్సిన అంశాలు, తీర్మానాలపై చంద్రబాబు మహానాడు ప్రాంగణం వద్దే పార్టీ ముఖ్య నాయకులతో చర్చించారు.

వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేష్?

టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను ఎన్నుకునే అవకాశం ఉంది. ఇప్పటికే లోకేష్‌కు పార్టీ పగ్గాలు అప్పగించాలని పార్టీలో ఎప్పటి నుంచో చర్చ నడుస్తుంది. ఈ మహానాడు వేదికగా లోకేష్‌కు పార్టీ పగ్గాలు అప్పగించే అవకాశాలు ఉన్నాయని నేతలు చెబుతున్నారు. అధినాయకుడి ఎన్నిక రోజే వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేష్‌ను ప్రకటించే అవకాశం ఉంది.

ఆటంకం కలిగించిన వర్షం

మహానాడు ఏర్పాట్లకు వర్షం ఆటంకంగా నిలిచింది. కొన్నిచోట్ల ఏర్పాట్లకు ఆటంకం కలిగింది. సోమవారం ఉదయం నుంచి వర్షం ఉండటంతో మహానాడు ప్రాంగణం బురదగా మారింది. ఈదారుగాలులు రావడంతో ఫ్లెక్సీలు కూడా కొన్నిచోట్ల కూలిపోయాయి. దీంతో మరలా వాటిని ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

శాస్త్రీయ విద్యా విధానం కోసం పోరాడాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విస్తృత సమావేశంలో వై వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

శాస్త్రీయ విద్యా విధానం కోసం విద్యార్థులు పోరాటాలు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ అఖిల భారత మాజీ అధ్యక్షులు వై వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ నినాదం అధ్యయనం - పోరాటంతో విద్యార్థులను ఐక్యం చేయాలని, విద్యా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు అర్థం చేసుకుంటూ పోరాటాలకు సన్నద్ధం కావాలని అన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని విశ్వం కళాశాలలో జరిగిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విస్తృత సమావేశం సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం విద్యలో కార్పొరేటీకరణ, కేంద్రీకరణ, కాషాయీకరణ దిశగా అడుగులు వేస్తూ, పాఠ్యాంశాలలో వాస్తవ చరిత్రను కాలరాస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలు నేటికీ అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో కార్పొరేట్ విద్యా సంస్థలను నియంత్రించాల్సిన ప్రభుత్వం వారికి రెడ్ కార్పెట్ పరుస్తోందని విమర్శించారు. విద్యార్థులకు బట్టి చదువులు కాకుండా శాస్త్రీయమైన విద్యే ఉండాలని సూచించారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ అఖిల భారత మాజీ అధ్యక్షులు వై.వెంకటేశ్వరరావు

రాష్ట్ర నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా రామ్మోహన్, ప్రసన్నకుమార్

పి.రామ్మోహన్

రాష్ట్ర ప్లీనరీ సమావేశాల సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నూతన అధ్యక్షులుగా పి రామ్మోహన్, కార్యదర్శిగా కె ప్రసన్న కుమార్‌ను ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు పావని, రాష్ట్ర ఉపాధ్యక్షులు పరమేష్, వెంకటేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, రమణ రాష్ట్ర నలుమూల నుండి వచ్చిన 26 జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కె.ప్రసన్న కుమార్

'కాకాణి'కి 14 రోజులు రిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి తిరుపతి జిల్లా వెంకటగిరి మున్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టు జడ్జి ఎస్. విష్ణువర్మ 14 రోజులు రిమాండ్ విధించారు. ఆదివారం మధ్యాహ్నం కర్ణాటక రాష్ట్రంలోని చింతామణి వెంకటాపురం ఫామ్ హౌస్‌లో ఉండగా అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీసులు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

సోమవారం ఉదయం పోలీసు బందోబస్తు నడుమ తిరుపతి జిల్లా వెంకటగిరి మున్సిపల్ కోర్టుకు ఆయనను తరలించారు. వాదనల తర్వాత జూన్ తొమ్మిది వరకు న్యాయమూర్తి రిమాండ్ విధించారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి లాయర్లు వాదనలు మేరకు నెల్లూరు సెంట్రల్ జైల్లో ప్రత్యేక గది, మంచం, వారానికి మూడుసార్లు లాయర్లు కలవడానికి కాకాణికి అవకాశం కల్పించినట్లు తెలి సింది. సోమవారం సాయంత్రం నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. కేసు నేపథ్యంలో వెంకటగిరి, కోర్టు వద్ద 144 సెక్షన్ విధించారు. కోర్టుకు వచ్చినప్పుడు ముదావంగా ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి జైలుకు వెళ్లే సమయంలో ఉత్సాహంగా కనిపించారు.

రెగ్యులర్ డిజిపిగా హరీష్‌కుమార్ గుప్తా

- జిఓ ఆర్‌టి నెంబరు 1025 విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
రాష్ట్ర డిజిపిగా హరీష్‌కుమార్ గుప్తా నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జి డిజిపిగా ఉన్న గుప్తా ఇప్పటి నుంచి రెండేళ్లపాటు రెగ్యులర్ డిజిపిగా కొనసాగనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం జిఓ ఆర్‌టి నెంబరు 1025ను విడుదల చేసింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ప్యానెల్ లిస్టులోని హరీష్‌కుమార్ గుప్తాను సిఎం చంద్రబాబు ఎంపిక చేశారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇక నుంచి వైఎస్ఆర్ కడప జిల్లా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
వైఎస్ఆర్ జిల్లా పేరును వైఎస్ఆర్ కడప జిల్లాగా ప్రభుత్వం పేరు మార్చింది. ఈ మేరకు సోమవారం జిఓ ఎంఎస్ నెంబరు 170ను విడుదల చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో కడప జిల్లాగా పేరు ఉండగా, ముఖ్యమంత్రిగా ఉంటూ మరణించడంతో అప్పటి సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరును కడప జిల్లాకు అదనంగా చేర్చారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కాగానే వైఎస్ఆర్ కడప జిల్లాను వైఎస్ఆర్ జిల్లాగా మార్చిన సంగతి తెలిసిందే. ప్రజల అభిప్రాయం, చారిత్రక ప్రాధాన్యత దృష్ట్యా వైఎస్ఆర్ కడప జిల్లాగా పేరును తాజాగా కూటమి ప్రభుత్వం మార్చింది.

హత్య కేసులో సాక్షుల సాక్ష్యాల నమోదుకు హడావుడి ఎందుకు?

- ఐదుగురు దళితుల హత్య కేసులో ప్రత్యేక కోర్టు విచారణ నిలిపివేత : హైకోర్టు ఉత్తర్వులు

ప్రజాశక్తి-అమరావతి
హత్య కేసులో సాక్షులకు సాక్ష్యం చెప్పేందుకు తగిన అవకాశం కల్పించకపోవడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాకుళం జిల్లా, వంగర మండలం, లక్ష్మీపేట గ్రామంలో దళితుల హత్య కేసులో సాక్షుల విచారణను ప్రత్యేక కోర్టు హడావుడిగా ముగింపు పలకడాన్ని ఆక్షేపించింది. జూన్ 16వ తేదీ వరకు ప్రత్యేక కోర్టులో విచారణను నిలిపేసింది. మరో కేసుతో కలిపి దళితుల హత్య కేసును కూడా విచారించాలన్న తమ ఉత్తర్వులను ప్రత్యేక కోర్టు పట్టించుకోలేదని జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు తప్పుపట్టారు. 2012 జూన్లో భూమి సాగు విషయంలో వివాదం రావడంతో జరిగిన ఘర్షణలో ఐదుగురు దళితులు హత్యకు గురయ్యారు. దీని విచారణకు ప్రభుత్వం లక్ష్మీపేటలో ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసింది. సాక్ష్యాలను మూసివేస్తూ ఈ ఏడాది మే 19న ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ సిహెచ్ గంగయ్య సహా ఆరుగురు హైకోర్టును ఆశ్రయించారు. సాక్ష్యం ఇచ్చేందుకు పిటిషనర్లకు అవకాశం కల్పించాలని న్యాయవాది జివి శివాజీ కోరారు. స్పెషల్ కోర్టు 17 రోజుల్లో 87 మంది సాక్షులను హడావుడిగా విచారించిందన్నారు. ప్రధాన సాక్షులకు సాక్ష్యం చెప్పేందుకు ఆస్కారం ఇవ్వలేదన్నారు. వాదనల తర్వాత హైకోర్టు. ప్రత్యేక కోర్టు విచారణను జూన్ 16వ తేదీ వరకు నిలిపివేసింది. విచారణను వాయిదా వేసింది.

కొట్టుకుపోయిన మారిక రోడ్డు

- అడుగడుగునా నాణ్యతాలోపం
- రూ.అర కోటి వరకు బిల్లు
- నిద్రావస్థలో పిఆర్ క్వాలిటీ కంట్రోల్ వ్యవస్థ

నాణ్యత లేకపోవడంతో వర్షాలకు కొట్టుకుపోయిన రహదారి

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి
విజయనగరం జిల్లా వేపాడ మండలం మారిక గిరిజన గ్రామాలకు నిర్మించిన తారు రోడ్డు వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో, కొండపైగల మారికతోపాటు పలు ఆదివాసీ గ్రామాల వారికి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. గతంలో మాదిరిగా నిత్యావసర సరుకులు తీసుకెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఈ మండలంలోని కరకవలస గ్రామ పంచాయతీ పరిధిలోని పాతమారిక, కొత్తమారిక, దిగువ మారిక పేర్లతో మూడు ఆదివాసీ గ్రామాలున్నాయి. వీటితోపాటు ఆ కొండమీద ఉండే మరికొన్ని ఆదివాసీ గ్రామాలకు కూడా ఈ రహదారే ఆధారం. సుమారు పది కిలోమీటర్ల మేర మూడు నుంచి నాలుగు కొండలు ఎక్కాల్సి ఉంటుంది. కాగా, మారిక గిరిజన గ్రామాన్ని, ఆ గ్రామంలోని సూదికొండను అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌కు ప్రభుత్వం కట్టబెట్టాలని చూస్తోంది. దీనిపై ఆ ప్రాంత గిరిజనులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

రోడ్డు నిర్మాణం కోసం కొన్ని దశాబ్దాలుగా అక్కడి గిరిజనులు పోరాడారు. ఎట్టకేలకు రెండేళ్ల క్రితం కొండదిగువన ఉన్న కరకవలస పంచాయతీ కేంద్రం నుంచి 2.6 కిలోమీటర్ల మేర తారు రోడ్డు వేసేందుకు ప్రధాన మంత్రి గ్రామీణ యోజన (పిఎస్‌జివై) పథకం కింద గత ప్రభుత్వం రూ.3.50 కోట్లు మంజూరు చేసింది. ఈ పనుల బాధ్యత పంచాయతీరాజ్ శాఖకు జిల్లా కలెక్టర్ అప్పగించారు. మరో ఆరు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి ఎన్ఆర్ఇజిఎస్ మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రూ.7 కోట్లు మంజూరు చేశారు. పని చేపట్టడంలోనూ జాప్యం జరగడంతో మరోసారి గిరిజనులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. పంచాయతీరాజ్ నుంచి కాంట్రాక్టు దక్కించుకున్న పృథ్వి కనస్ట్రక్షన్స్ ఎట్టకేలకు గత ఆర్థిక సంవత్సరంలో పనులు ప్రారంభించింది. ఇప్పటికి రెండు కిలోమీటర్ల పని పూర్తి చేసినట్టు చెబుతున్నారు. రూ.అర కోటి వరకు బిల్లులు చెల్లించినట్టు సమాచారం. రెండు కిలోమీటర్ల రహదారి నిర్మాణంలో సంబంధిత నిర్మాణ సంస్థ నాణ్యతా ప్రమాణాలు పాటించలేదు. ఇసుక, సిమెంట్, రాయి తగినపాళ్లలో లేవనే విమర్శలు పనులు మొదలుపెట్టిన నుంచీ ఉన్నాయి. అయినా, అధికారులుగానీ, నిర్మాణ సంస్థగానీ, స్థానిక ప్రజాప్రతినిధులుగానీ పట్టించుకోలేదు. ఆదివారం సాయంత్రం నుంచీ కురిసిన వర్షానికి ఈ రహదారి చాలాచోట్ల దెబ్బతింది. ఆరు నెలలు కాకముందే రోడ్డు అడ్డంగా పాయలుగా వీడిపోయి, ఇసుక మేటలు వేయడం నాణ్యతకు పాతర వేశారనడానికి నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తోంది. పంచాయతీరాజ్ క్వాలిటీ విభాగం అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడలేదని ఈ ప్రాంతంలో వినిపిస్తోంది. మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో చేపట్టిన రహదారి నిర్మాణం ఇంకా మట్టితో చదును చేసే దశలోనే ఉంది. భారీ వర్షాలకు మట్టి కిందికి జారిపోవడంతో రహదారి అస్తవ్యస్తంగా మారింది. ఇటీవల కాలం వరకూ మోటార్ సైకిళ్లు ఈ రోడ్డుపై తిరిగేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి కూడా లేదు. ప్రమాదకరంగా మారడంతో ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనాలను నడిపేందుకు ఎవరూ సాహసించడం లేదు.

కల్వర్టుల అప్రోచ్ వద్దే మాత్రమే కొట్టుకుపోయాయి

కల్వర్టుల అప్రోచ్ కోసం నిర్మాణాలు నిలిపేసిన చోట్ల మాత్రమే భారీ వర్షాలకు రోడ్డు కొట్టుకుపోయింది. వీటి పునర్నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకుంటాం.

-ఐశ్వర్య, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కొత్తవలస, విజయనగరం జిల్లా

మహానాడుతో కరోనా వ్యాప్తికి అవకాశం

- నిబంధన పాటించేలా చూడాలని ముఖ్యమంత్రికి ప్రజారోగ్య వేదిక వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
దేశ వ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో, కడపలో జరగనున్న మహానాడు సభ వల్ల కరోనా వ్యాప్తి మరింత పెరిగే ప్రమాదం ఉందని ప్రజారోగ్య వేదిక ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, వేదిక రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎంవి రమణయ్య, టి కామేశ్వరరావు సోమవారం లేఖ రాశారు. తాజా నివేదికల ప్రకారం గత 24 గంటల్లో 1,009 కొత్త కేసులు నమోదైనట్లు, అందులో 430 కేరళలో, 209 మహారాష్ట్రలో, 104 ఢిల్లీలో, 83 గుజరాత్‌లో నమోదైనట్లు పేర్కొంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరికలు జారీ చేయడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని నిబంధనలను రూపొందించి ఉత్తర్వులు జారీ చేశాయని వెల్లడించారు. అందులో ప్రార్థనా సమావేశాలు, పార్టీ సభలు, సామాజిక కార్యక్రమాలు పెద్దయెత్తున నిర్వహించరాదని, పెద్దలు, పిల్లలు మరింత జాగ్రత్తగా ఉండాలని స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు. ఇలాంటి ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వాధినేతలే మే 27 నుంచి 29 వరకూ కడపలో భారీ ఎత్తున మహానాడు సభ నిర్వహిస్తున్నారని, ఈ సభకు ఐదు లక్షల మందిని సమీకరించాలని సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. కరోనా నిబంధనలను నిర్వాహకులు ఎలా పాటిస్తారో ఎక్కడా స్పష్టత ఇవ్వలేదన్నారు. దీనివల్ల రాష్ట్ర ప్రజలకు ఎంతటి ప్రమాదం ఉందో మహానాడు నిర్వాహకులు ఆలోచించడం లేదన్నారు. ప్రభుత్వాధినేతలే ఇలా వ్యవహరిస్తే సాధారణ ప్రజలకు ఎలాంటి సందేశం అందుతుందో ప్రభుత్వం గుర్తించాలని కోరారు. దీని అవకాశంగా తీసుకుని ఇతర పార్టీలు, సంస్థలు కూడా ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తే ఏం జరుగుతుందో ప్రభుత్వం అంచనా వేసుకోవాలన్నారు. మహానాడు నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పకుండా పాటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహానాడుకు కరోనా నిబంధనలు వర్తింపజేయాలని, ప్రజల ఆరోగ్య భద్రతను తమ ప్రథమ బాధ్యతగా గుర్తించాలని కోరారు. ఈ సందర్భంగా కరోనా వ్యాప్తి చెందకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమానికి హాజరయ్యే డెలిగేట్స్ సామాజిక దూరం పాటించేలా హాజరయ్యే వారి సంఖ్యను పరిమితం చేయాలని, వ్యక్తుల మధ్య కనీసం 6 అడుగుల దూరం ఉండేలా చూడాలన్నారు. గుంపులు ఏర్పడకుండా కూర్చునే స్థలాలను ప్రవేశ, నిష్క్రమణ సమయాలను నిర్వహించాలని, సభలో అందరూ తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, సభా ప్రాంగణంలో శానిటైజేషన్ స్టేషన్‌లను ఏర్పాటు చేయడం, డెలిగేట్స్ తాకే ఉపరితలాలను శానిటైజర్లతో శుభ్రం చేయాలని కోరారు. సిఎం చంద్రబాబు నాయకత్వంపై పూర్తి నమ్మకముందని, ఈ విషయంలో వెంటనే తగిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

ఉపాధి బకాయి వేతనాలు విడుదల చేయాలి

- ఎపి వ్యకాస రాష్ట్ర మహిళా కన్వీనర్ నాగరాణి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి
ఉపాధి కార్మికులకు ఆరు వారాలుగా ఇవ్వాల్సిన బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ నాగరాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలంలోని దాట్లవారిగూడెం, వంకవారిగూడెం గ్రామాల్లో ఉపాధి పని ప్రదేశాల్లో కార్మికులతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ.. గత ఆరు వారాలుగా కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా టిడిపి కూటమి ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు పెడుతోందని విమర్శించారు. ఇప్పటి వరకు బకాయి ఉన్న వేతనాలను తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని, పే స్లిప్‌లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి కారం నాగదుర్గ, నేతలు వెంకట్రావు, సిరిబత్తుల సీతారామయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వంశీ బెయిల్ పిటిషన్ తిరస్కృతి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్
నకిలీ ఇళ్ల పట్టాల కేసులో గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ బెయిల్ పిటిషన్‌ను నూజివీడు సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్టుక్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు సోమవారం తిరస్కరించింది. ఇప్పటికే ఈ కేసులో రెండుసార్లు వంశీ నూజివీడు కోర్టులో హాజరైన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఈ నెల 29 వరకు కోర్టు రిమాండ్ విధించింది. పలు అంశాలు ఇంకా విచారణలో ఉన్నందున బెయిల్ మంజూరు చేయొద్దని పోలీసులు కోరడంతో బెయిల్ పిటిషన్‌ను మేజిస్ట్రేట్ తిరస్కరించారు.

చిన్నారులపై లైంగిక దాడికి యత్నం

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్
వైఎస్ఆర్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలో నాలుగురోజుల కిందట ఎ.కంబాలదిన్నెలో చిన్నారిపై హత్యాచార సంఘటన మరువక ముందే జమ్మలమడుగులోని శివారెడ్డి కాలనీలో మరో దారుణం జరిగింది. ఆదివారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఇద్దరు బాలికలపై ఓ కామాంధుడు అఘాయిత్యానికి యత్నించాడు. పిల్లలిద్దరూ కేకలు వేయడంతో వారి తల్లిదండ్రులు చూసి కామాంధుడిని పట్టుకుని పోలీసులకు అప్పజెప్పారు. పిల్లల తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు సయ్యద్‌బాషా (23)గా పోలీసులు గుర్తించారు.

ఇంటి పన్నుల పెంపు సర్వే నిలిపివేయకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం

- రూ.1500 కోట్ల మేర ఆస్తి పన్ను బాదుడుకు సిద్ధం
- అక్రమ నిర్మాణాల పేరుతో వంద శాతం ఫెనాల్టీలు : బాబూరావు

ప్రజాశక్తి-విజయవాడ
ఇంటి పన్నుల పెంపు కోసం రాష్ట్రంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్వేను తక్షణమే నిలుపుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా పౌర సంఘాలు, ఆయా అసోసియేషన్లను కలుపుకుని ఉద్యమం చేపడతామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు హెచ్చరించారు. విజయవాడ గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పన్నుల పెంపు కోసం రాష్ట్రంలోని 123 కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో నిర్వహించే సర్వేను, చట్టవిరుద్ధమైన ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ఏప్రిల్ నుంచి పెంచాలనుకున్న 15 శాతం పన్ను తగ్గించాలని, అనధికార కట్టడాల పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లపై 25 శాతం నుంచి వంద శాతం వరకు పెనాల్టీ విధింపు నిబంధనలను ఆపాలని కోరారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఈ ఏడాది కాలంలో రాష్ట్ర ప్రజలపై రూ. 15,485 కోట్ల విద్యుత్తు బాదుడుతో పాటు పెంచబోయే రూ. 1500 కోట్ల ఆస్తి పన్నుల భారాలపై ఈ నెల 27 నుంచి జరుగుతున్న మహానాడులో ప్రజలపై భారాలు పడకుండా రద్దు చేస్తూ తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోడీ ఒత్తిడి మేరకు గత వైసిపి ప్రభుత్వ దారిలోనే టిడిపి కూటమి ప్రభుత్వం ప్రయాణిస్తూ అటు విద్యుత్తు ఛార్జీలతో పాటు ఇటు ఇంటి పన్నుల బాదుడుకు పూనుకుందని విమర్శించారు. వచ్చే జూన్ నాటికి పన్నులు పెంచి వసూలు చేయకపోతే కమిషనర్లదే బాధ్యత అంటూ మునిసిపల్ శాఖా మంత్రి ఇప్పటికే హుకుం జారీ చేశారని అన్నారు. పన్నుల భారాలకు వ్యతిరేకంగా ప్రజలను కలుపుకొని ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తీసుకొచ్చి, ఆందోళనను ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాద్, విజయవాడ పశ్చిమ, సెంట్రల్, తూర్పు సిటీ కమిటీల కార్యదర్శులు బోయి సత్యబాబు, భూపతి రమణారావు, పి కృష్ణ పాల్గొన్నారు.

జనసేన కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్న హోంగార్డులు

మా గోడు ఎవరికి చెప్పుకోవాలి

- మెయిన్స్ ఎగ్జామ్ రాసేందుకు అవకాశం కల్పించండి..!
- కానిస్టేబుల్ ఉద్యోగోన్నతికై ఎదురు చూస్తున్న హోంగార్డుల ఆవేదన..!

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)
ఫిజికల్ టెస్ట్‌క్వాలిఫై అయిన తమకు మెయిన్స్ ఎగ్జామ్ రాసేందుకు అవకాశం ఇవ్వకపోతే తమ గోడు ఎవరికి చెప్పుకోవాలని హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కానిస్టేబుల్ ప్రమోషన్ కోసం ఎదురు చూస్తున్న సుమారు 650 మంది హోంగార్డులు సోమవారం గుంటూరు జిల్లా మంగళగిరి వద్ద ఆత్మకూరులోని డిజిపి కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఎపిఎస్-ఎల్‌పిఆర్‌బి రిక్రూట్మెంట్ బోర్డ్ చైర్మన్ ఆర్‌కె మీనాను కలిసి వారి సమస్యలను విన్నవించారు. అనంతరం మధ్యాహ్నం జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వద్దకు చేరుకున్నారు. కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో కొద్దిసేపు రోడ్డు బయటే నిరీక్షించి తర్వాత వెనుదిరిగారు. ఈ సందర్భంగా హోంగార్డులు వి శ్రీనివాస్, ప్రవీణ్, సంతోష్,. పద్మ మీడియాతో మాట్లాడుతూ 2022 నవంబర్ ఎపి ఎస్ఎల్‌పిఆర్‌బి రిక్రూట్మెంట్ బోర్డు నిర్వహించిన ప్రిలిమ్స్ ఎగ్జామ్‌లో డిస్‌క్వాలిఫై అయ్యామని తెలిపారు. అయితే మెరిట్ లిస్ట్ ప్రకారం ఫిజికల్ టెస్ట్ నిర్వహించాలని న్యాయస్థానం పేర్కొందని, ఆ ప్రకారం నిర్వహించిన ఫిజికల్ టెస్ట్‌లో తాము క్వాలిఫై అయ్యామని చెప్పారు. జూన్ 1వ తేదీన జరిగే మెయిన్స్ ఎగ్జామ్‌కు తాము హాజరయ్యేందుకు హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవాలని ముందుగా సూచించారని, కానీ ఆన్‌లైన్‌లో తమ హాల్ టికెట్లను ఉంచలేదని తెలిపారు. హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకునే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తాము నిస్సహాయులుగా భావించి తమ సమస్యను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము చిన్న ఉద్యోగులమని ప్రభుత్వం స్పందించి మెయిన్స్ ఎగ్జామ్ రాసేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

రమణారావు స్ఫూర్తితో ముందుకు సాగాలి

- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

రమణారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బివి.రాఘవులు తదితరులు

ప్రజాశక్తి -గాజువాక (విశాఖపట్నం)
సిపిఎం సీనియర్ నాయకులు, ప్రజానాట్యమండలి నాయకులు పివైవి రమణారావు స్ఫూర్తితో ముందుకు సాగాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు పిలుపునిచ్చారు. రమణారావు సంస్మరణ సభను గాజువాక క్లబ్‌లో సోమవారం నిర్వహించారు. తొలుత రమణారావు చిత్రపటానికి నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో బివి.రాఘవులు మాట్లాడుతూ.. తాను విశాఖలో సుదీర్ఘకాలం పనిచేశానని, ఆ సమయంలో రమణారావుతో అనుబంధం ఏర్పడిందని, అందరితోనూ కలిసి ఉండేవారని, ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించేవారని గుర్తు చేసుకున్నారు.. నమ్మిన ఆశయం కోసమే పని చేశారన్నారు. ఆయన మృతి విషయం తెలిసిన వెంటనే జీర్ణించుకోలేక బాధపడ్డామని చెప్పారు. బిహెచ్‌పివి ఫ్యాక్టరీలోను, బయట, స్థానిక సమస్యలపైనా, సిపిఎం, ప్రజాశక్తి అభివృద్ధికి పనిచేశారని కొనియాడారు. అభ్యుదయ సమాజ స్థాపన కోసం రమణారావు కృషి చేశారని తెలిపారు. ఆయన మృతి తీరని లోటని, పొలిట్‌బ్యూరో తరపున ఆ కుటుంబానికి సంతాపం తెలియజేస్తున్నానన్నారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ.. రమణారావు మృతిని జీర్ణించుకోలేక పోతున్నామన్నారు.

ఆయనతో 40 సంవత్సరాలు కలిసి ఉన్నామని తెలిపారు. ప్రజాశక్తి చీఫ్ జనరల్ మేనేజర్ వై.అచ్యుతరావు మాట్లాడుతూ.. ప్రజలతో మమేకమై ప్రజల కోసం, నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేశారని, ప్రజాశక్తి పత్రికను పాఠకుల దరిచేర్చడంలో ముఖ్యపాత్ర నిర్వహించారని తెలిపారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ... ప్రజా ఉద్యమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ముఖ్యమని చెబుతూ వాటిపై పనిచేశారని వివరించారు. బతికినంత వరకు ప్రజల కోసం పనిచేశారన్నారు. సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, పి.శేషారత్నం, జంపాల శ్రీమన్నారాయణ, సిపిఐ కార్పొరేటర్ స్టాలిన్, రమణారావు కుమార్తె చైతన్య, తమ్ముడు ప్రసాదరావు మాట్లాడారు. ఈ సభలో సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, రమణారావు భార్య సుభద్రాదేవి, అల్లుడు కెపి.నాయుడు, ఆయన కుటుంబ సభ్యులు, ప్రజానాట్యమండలి కళాకారులు చంటి, స్టాలిన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు. సభకు ముందు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ప్రజానాట్యమండలి కళాకారులు పలుగేయాలను ఆలపించారు.

ప్రజాశక్తి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

రమణారావు సంతాప సభ సందర్భంగా ప్రజాశక్తి ముద్రించిన ప్రత్యేక సంచికను బివి.రాఘవులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్ పాల్గొన్నారు.

ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా ఆలపాటి సురేష్

- జిఓ ఆర్‌టి నెంబరు 1021 విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో /ఏలూరు
ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా ఆలపాటి సురేష్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సోమవారం జిఓ ఆర్‌టి నెంబరు 1021ని విడుదల చేసింది. ఆలపాటి చైర్మన్ హోదాలో రెండేళ్లపాటు కొనసాగనున్నారు. రాష్ట్ర విభజనానంతరం ప్రెస్ అకాడమీకి చైర్మన్లను ప్రభుత్వం నియమిస్తున్నప్పటికీ డైరెక్టర్లను నియమించలేదు. ఈ దఫానైనా నియమిస్తారో లేదోననే అభిప్రాయం జర్నలిస్టుల్లో నెలకొంది.

మంత్రి పార్థసారథి అభినందన

ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా నియమితులైన ఆలపాటి సురేష్‌ను గృహనిర్మాణశాఖ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అభినందించారు. సురేష్ నాయకత్వంలో జర్నలిస్టులకు ఎంతగానో మేలు జరుగుతుందని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి ప్రభుత్వం ద్వారా పరిష్కారం అయ్యేలా కృషి చేశారని పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులతో అధికారుల చర్చలు విఫలం

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)
విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల తొలగింపు అంశంపై స్టీల్‌ప్లాంట్ యాజమాన్యానికి, కార్మికులకు మధ్య రీజినల్ లేబర్ కమిషనర్ వద్ద జరిగిన చర్చలు విఫలమయ్యాయి. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కిందిస్థాయి అధికారులను చర్చల కోసం పంపించి కార్మిక సంఘాలను అవమానపరిచిందని కార్మిక సంఘాల ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులను పంపించకుండా అసిస్టెంట్ స్థాయి వ్యక్తులను పంపించి, చర్చలు ముందుకు కొనసాగకుండా చేసిందని తెలిపారు. యాజమాన్య ప్రతినిధులు ఏమీ మాట్లాడలేకపోవడంతో కార్మికులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ నెల 30కు చర్చలు వాయిదా పడటంతో సమ్మె కొనసాగిస్తున్నట్లుగా కార్మిక సంఘాల ప్రతినిధులు వెల్లడించారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తరపున సీనియర్ మేనేజర్ ఎస్.అప్పారావు, హెచ్ఆర్ మేనేజర్ వై.శంకర్ హాజరయ్యారు. కార్మిక సంఘాల తరపున సిఐటియు నుంచి కెఎం.శ్రీనివాసరావు, నమ్మి రమణ, ఎఐటియుసి నాయకులు మంత్రి రవి, ఐఎన్‌టియుసి నాయకులు వంశీ, పి.భాస్కరరావు, యు.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తొలగింపులను నిరసిస్తూ విశాఖ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం నాటికి 7వ రోజుకు చేరుకుంది. విధులు బహిష్కరించి కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరానికి చేరుకొని నిరసన తెలిపారు.

పోలీసుల బరితెగింపు

- నిందితులపై అమానుష దాడి
- వెలుగులోకి వచ్చిన వీడియో

నిందితుడి కాళ్లపై నిలబడిన రాముల నాయక్, దాడి చేస్తున్న సీఐ రమేష్ బాబు

ప్రజాశక్తి తెనాలి (గుంటూరు జిల్లా)
ఖాకీ డ్రస్ వేసుకుని, చేతిలో లాఠీ పట్టుకుంటే ఏం చేసినా చెల్లుతుందనుకు న్నారేమో తెనాలిలోని పోలీస్ అధికారులు బరితెగించారు. ఒక కేసులో నిందితులుగా ఉన్న ముగ్గురు వ్యక్తులపై నడిరోడ్డుపై అమానుష దాడికి దిగిన వీడియో సోమవారం వెలుగులోకి వచ్చింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ వీడియోలో రోడ్డు మీద పోతున్న ప్రజలు ఎక్కడి వారు అక్కడ ఆగిపోయి పోలీసు దాడికి ప్రేక్షకులుగా మిగలడం కనిపిస్తుంది. అంతమంది చూస్తున్నారన్న వెరపు ఏ మాత్రం లేకుండా నిందితుల మోకాళ్ళ మీద బూటుకాలుతో ఒకరు ఎక్కి నిలబడితే మరొకరు లాఠీతో పాదాలను చితకబాదిన దృశ్యాలు వీడియోలో కనిపిస్తాయి. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసే కన్నా చిరంజీవిపై జరిగిన దాడి ఘటనలో జాన్ విక్టర్, రాకేష్, బాబూలాల్ అనే ముగ్గురిని గత నెల 27న పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిపై వివిధ కేసులు, రౌడీషీట్లు ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు. తాజాగా ఆ నిందితులు ముగ్గురిని టూ టౌన్ సిఐ రాముల నాయక్, త్రీ టౌన్ సిఐ ఎస్ రమేష్ బాబు నడిరోడ్డుమీద అరికాళ్లపై లాఠీలతో అమానుషంగా కొట్టిన వీడియో సోషల్‌మీడియాలో ప్రత్యక్షమైంది. ఓ నిందితుడు దెబ్బల తీవ్రతను తట్టుకోలేక కాళ్లు ముడుచుకోగా, సిఐ రాముల నాయక్ బూటు కాళ్లతో తొక్కి పట్టడం కాఠిన్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది. దాడి సమయంలో యువకులు భోరున విలపిస్తూ ఆర్తనాదాలు పెట్టినా పోలీసులు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. నిందితుల్లో ఇరువురు ఎస్‌సి సామాజిక తరగతికి, మరొకరు మైనార్టీలకు చెందిన వారు కావడం గమనార్హం. నిందితులను అదుపులోకి తీసుకొని కోర్టు ముందు హాజరు పరిచి కఠిన శిక్షలు అమలయ్యేలా చూడాల్సిన పోలీసులు ఇలా బరితెగించి దాడికి దిగడం ఏమిటన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. పైగా కానిస్టేబుల్‌పై దాడి ఘటనను మూడ్రోజులు పోలీసులు గోప్యంగా ఉంచడం, జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్ పట్టణానికి వచ్చి దీనిపై రహస్యంగా విచారణ చేసిన అనంతరమే విషయం బయటకు రావడం, ఇప్పుడు నిందింతులపై ఇలా విరుచుకుపడటం చర్చనీయాంశంగా మారింది.

తక్షణమే చర్యలు : సిపిఎం డిమాండ్

రౌడీ షీటర్ల పేరుతో దళిత, మైనార్టీ యువకులను బహిరంగంగా, అమానుషంగా అరికాళ్లపై కొట్టి హింసించిన పోలీసులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు.

శాఖపరమైన చర్యలు తీసుకోండి : కెవిపిఎస్

నిందితులపై విచక్షణా రహితంగా విరుచుకుపడిన పోలీసులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘ ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి ఒక ప్రకటన విడుదల చేశారు. డిజిపి ఈ సంఘటనను సూమోటోగా తీసుకుని విచారణ జరపాలని ఆయన కోరారు.

గుండెపోటుతో ఉపాధి కార్మికుడు మృతి

ప్రజాశక్తి-రామాపురం (అన్నమయ్య జిల్లా) : ఉపాధి కార్మికుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన అన్నమయ్య జిల్లా రామాపురం మండలంలోని రాచపల్లి పంచయతీ ఎగువ ఉప్పరపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... ఎగువ ఉప్పరపల్లికి చెందిన టేకూరి రెడ్డయ్య (65) రోజువారీగా సోమవారం ఉపాధి పనికి వెళ్లారు. పని ముగించుకొని ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో ఛాతిలోనే నొప్పిగా ఉందని కుప్పకూలిపోయారు. తోటి కార్మికులు ఏంజరిగిందని చూసేసరికి రెడ్డయ్య మృతి చెందారు. తోటి కార్మికులు, ఉపాధి సిబ్బంది ఈ సమాచారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రెడ్డెయ్య కుటుంబానికి ప్రభుత్వం నుండి ఆర్థిక సాయం అందేలా చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలి

విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక

విజయవాడ ధర్నా చౌక్ వద్ద ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - యంత్రాంగం, అమరావతి బ్యూరో :
విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని, తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ ఐక్య వేదిక డిమాండ్ చేసింది. విజయవాడ ధర్నా చౌక్‌లో విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక ఆద్వర్యంలో వివిధ కార్మిక సంఘాలు , ప్రజాసంఘాలు సోమవారం ధర్నా నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.దుర్గారావు, ఎఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి సాంబశివరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు వివిఎల్ నరసింహులు, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు ఎన్ వెంకట సుబ్బయ్య, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కె.పోలారి తదితరులు మాట్లాడుతూ కేంద్రలోని బిజెపి ప్రభుత్వం పథకం ప్రకారం కార్మికులను తొలగించే ప్రయత్నాలు చేపట్టిందని, రాష్ట్రంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఇకనైనా మోడీకి సేవ చేయడం ఆపి కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న సమ్మె పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఆదివారం జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో స్టీల్‌ప్లాంట్ గురించి సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ మాట్లాడినట్లు ఎక్కడా కనిపించడం లేదని, స్టీల్ ప్లాంట్‌ను వదిలించుకునే కుట్రలో భాగమయ్యారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌పై టిడిపి, జనసేన వైఖరిని స్పష్టం చేయాలని వారు డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్నారని, ఈ సమ్మెను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు, ఉద్యోగులు వారి జీతాలకోసం, రెగ్యులరైజేషన్ కోసం కాకుండా తమను ఉద్యోగాల నుంచి తొలగించేందుకు ప్రభుత్వమే ప్రయత్నిస్తుండటంతో వారు సమ్మెకు దిగారన్నారు.

కార్మిక, రైతు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ల వద్ద ధర్నా

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వమే నిర్వహించాలని, సొంత గనులు కేటాయించాలని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో కార్మిక, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ల వద్ద సోమవారం నిరసనలు తెలిపారు. అనంతరం వారికి వినతిపత్రం అందజేశారు. విజయనగరంలో ధర్నానుద్దేశించి సిఐటియు నాయకులు టివి రమణ మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిశ్రమలో పనిచేస్తున్న సుమారు నాలుగువేల మంది కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. శ్రీకాకుళం, ఒంగోలు, ఏలూరు, పశ్చిమగోదావరి కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు తెలిపారు. కర్నూలు కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. 32 మంది బలిదానాలతో విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అనే ఉద్యమంతో ఏర్పాటయిన విశాఖ ఉక్కును ప్రయివేటీకరణ చేయరాదని, ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

సినీ మనుగడకు ప్రభుత్వ సహకారం అవసరం

- పరిశ్రమను అస్థిరపరిచే చర్యలు సహించబోము
- మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్
సినీ పరిశ్రమ మనుగడకు ప్రభుత్వం సహకారం అవసరమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం రూరల్ హుకుంపేట నిర్వహించిన మీడియా సమావేశంలో సినీ రంగంలో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలపై మాట్లాడారు. ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలు అందరూ ఐక్యంగా వస్తే న్యాయం చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. సినిమాకు సంబంధించిన అనుమతులు, టికెట్ రేట్ల విషయంలో మద్దతు ఇస్తున్నామన్నారు. చిత్రపరిశ్రమ అభివృద్ధికి నూతన ఫిల్మ్ పాలసీ రూపొందించడంపై ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జూన్ ఒకటి నుంచి థియేటర్లు మూసివేయాలన్న నిర్ణయంపై హోం శాఖ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో విచారణ జరుగుతోందన్నారు. విచారణ అనంతరం వాస్తవాలను వెల్లడిస్తామని తెలిపారు. జూన్ 12న విడుదల కానున్న 'హరిహర వీరమల్లు" చిత్రం విషయంలో ఈ తరహా సంక్షోభాలు ఎందుకు వస్తున్నాయో వాస్తవాలు వెలికితీస్తామని చెప్పారు. సినీ పరిశ్రమను అస్థిరపరిచే చర్యలను సహించబోమన్నారు. తమ సమస్యలు తామే పరిష్కరించుకుంటామని కొందరు అహంభావంతో మాట్లాడుతున్నారని, ఇది సరికాదన్నారు. సినిమా రంగానికి ప్రభుత్వంతో సంబంధం లేనప్పుడు గత ప్రభుత్వాన్ని సినీ ప్రముఖులు ఎందుకు కలిశారు అని ప్రశ్నించారు. నిర్ణయాలు ఎందుకు చేశారని నిలదీశారు. ఇకనైనా సరైన రీతిలో వ్యవహరించాలని హెచ్చరించారు. వేలాది మంది ఈ పరిశ్రమపై ఆధారపడి ఉన్నారని, సినిమా టికెట్‌పై రూపాయి పెంచితే ప్రభుత్వానికి 25 పైసల జిఎస్‌టి వస్తుందని చెప్పారు. సినిమా విషయాలపై వైసిపి మాజీ మంత్రి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. సినిమారంగంపై ఎలాంటి కక్ష సాధింపు చర్యలూ ఉండవని స్పష్టం చేశారు. తమకు ఎవరితోనూ ఏ అవసరం లేదని ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ దామోదరప్రసాద్ అనడం ఎంతవరకు సరైందో ఆలోచించుకోవాలన్నారు.

ప్రభుత్వం చెప్పిన ధర అమలు కావడం లేదు

- ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్
కోకో గింజలకు ప్రభుత్వం చెప్పిన ధర కిలోకు రూ.500 అమలు కావడం లేదని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన ధర అమలుపై సోమవారం స్థానిక అన్నే భవనంలో సంఘం ముఖ్య నాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కిలోకు రూ.500 ఇచ్చి కోకో గింజలు కొనుగోలు చేయాలని కంపెనీలను, ట్రేడర్లను ఈ నెల 23న ఏలూరు కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో నిర్ణయించి, ఆదేశించినా క్షేత్రస్థాయిలో ఆ ధర అమలు కావడం లేదన్నారు. కంపెనీలు, ట్రేడర్లు కిలో కోకో గింజలకు రూ.450 మాత్రమే ఇస్తామని చెప్పగా ప్రభుత్వం నుంచి రూ.50 చెల్లిస్తామని, కిలో కోకో గింజలను రూ.500కు కొనుగోలు చేయాలని రాష్ట్ర మంత్రులు చెప్పినా ఈ ధర ఎందుకు అమలు కావడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కంపెనీలకు తగు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో తీసుకున్న నిర్ణయాలను కూడా కంపెనీలు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు.

ELURU URBAN DEVELOPMENT AUTHORITY
E-PROCUREMENT TENDER NOTICE
Roc. No.545/ELUDA/Engg/2024 Dated.26-05-2025

Sl. No.	Name of the Work	Name of the Grant	Estimate Value (Rs.in Lakhs)	Bid Downloading Start Date	Last Date for Receipt of Bids
1	Civil Work - 01	General Funds	99.80	27-05-2025	10-06-2025
2	Street Lighting Work - 01	General Funds	48.90	27-05-2025	10-06-2025

Full details can be had from the ELUDA Engineering Department during working hours or visit web site http://tender.apeprocurement.gov.in
EXECUTIVE ENGINEER
ELURU URBAN DEVELOPMENT AUTHORITY

విద్యుదాఘాతంతో ముగ్గురు దుర్మరణం

- మరో ముగ్గురికి గాయాలు, ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి- కంచిలి (శ్రీకాకుళం జిల్లా)

విద్యుదాఘాతంతో ఇద్దరు చిన్నారులు, యువకుడు మృతిచెందిన ఘటన శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలంలోని తలతంపర పంచాయతీ సామంతపుట్టుగ (చిల్లో పుట్టుగ)లో సోమవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మరో ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిలో ఓ బాలుడి పరిస్థితి విషమంగా ఉంది. కంచిలి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... సామంతపుట్టుగలో ఇటీవల గ్రామ జాతర నిర్వహించారు. ముగింపు అనంతరం విద్యుత్ దీపాల అలంకరణలు తొలగిస్తున్న సమయంలో అక్కడే ఆడుకుంటున్న పురుషోత్తపురం గ్రామానికి చెందిన నందిని (12), నారాయణపురానికి చెందిన నోలియా కృష్ణ (3), సామంతపుట్టుగ గ్రామానికి చెందిన మనోజ్, కుమారి, తరిణిలు అనుకోకుండా విద్యుత్ వైర్‌ను ముట్టుకున్నారు. అయితే ఆ తీగకు విద్యుత్ సరఫరా కావడంతో ఒక్కసారిగా చిన్నారులు షాక్‌కు గురయ్యారు. వారినే కాపాడే క్రమంలో సామంతపుట్టుగ గ్రామానికి చిల్లో ఈశ్వరరావు (28) ప్రయత్నించారు. ఈ ప్రమాదంలో నందిని, కృష్ణ, ఈశ్వరరావు అక్కడికక్కడే మరణించారు. గాయపడిన మనోజ్, కుమారి, తరిణిలను సోంపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మనోజ్ పరిస్థితి విషమంగా ఉండడంతో బరంపురం తరలించారు. పోలీసులు గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు.

మంత్రులు దిగ్భ్రాంతి

విద్యుదాఘాతానికి గురై ముగ్గురు మృతి చెందడంపై కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అచ్చెన్నాయుడు కడప నుంచి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కంచిలి వైద్యులకు ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆయుష్ బలోపేతానికి ప్రణాళికలు సిద్ధం

- మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆయుష్‌ను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకుల్ని ఆకర్షించడంతోపాటు వారికి మెరుగైన ఆరోగ్యాన్ని అందించేందుకు కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ సహకారంతో రాష్ట్రంలో కొత్త పర్యాటక విధానానికి రూపకల్పన చేసినట్టు చెప్పారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ చెన్నైలో దక్షిణాది రాష్ట్రాల మంత్రులు, అధికారులతో సదస్సును సోమవారం నిర్వహించింది. ఈ సదస్సులో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో పలు పర్యాటక కేంద్రాలతో పాటు సుదీర్ఘమైన తీర ప్రాంతం ఉందన్నారు. కొత్త పర్యాటక విధానంలో ఆయుష్, వెల్‌నెస్ వంటి అంశాలు సమ్మిళితం చేశామన్నారు. రాష్ట్రంలో యాత్రా స్థలాలతోపాటు పర్యాటక కేంద్రాలను కూడా విస్తరించి అక్కడ పర్యాటకుల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన కేంద్రాలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అంతర్జాతీయ పర్యాటకుల్ని ఆకర్షించేందుకు గ్లోబల్ మెడిసిటిని పిపిపి విధానంలో నెలకొల్పనున్నట్లు తెలిపారు. ఇందుకోసం రాజధాని అమరావతిలో 400 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు చెప్పారు.

బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహిస్తున్న గిరిజనులు

షెడ్యూల్డ్ ఏరియా ఉద్యోగ నియామకాల చట్టం కోసం ర్యాలీ

ప్రజాశక్తి - సీతంపేట (పార్వతీపురం మన్యం జిల్లా)
షెడ్యూల్ ఏరియా ఉద్యోగ నియమాకాల చట్టం కోసం ఆదివాసీ జెఎసి ఆధ్వర్యంలో సోమవారం గిరిజనులు శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. తొలుత సీతంపేట సంత మార్కెట్ వద్ద భారీ ర్యాలీ నిర్వహించారు. మెగా డిఎస్‌సి నుంచి ఐటిడిఎ టీచర్ పోస్టులు మినహాయించాలని, 1/ 70 చట్టం పటిష్టంగా అమలు చేయాలని నినాదాలతో హోరెత్తించారు. స్థానిక బస్టాండ్ వద్ద మానవహారం చేపట్టారు. అనంతరం ఐటిడిఎ ప్రాంగణంలో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జెఎసి చైర్మన్ బిడ్డిక శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జిఒ 3 స్థానంలో కొత్త చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలోని అన్ని శాఖల ఉద్యోగ నియమాకాలు వంద శాతం గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్ ప్రాంతానికి ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఐటిడిఎ పరిధిలో గల అన్ని శాఖల ఉద్యోగ ఖాళీలను గుర్తించి వాటిని గిరిజనులచే భర్తీ చేయాలని కోరారు. నిరసన వద్దకు కలెక్టర్ శ్యాం ప్రసాద్ వచ్చి సమస్యను అడిగి తెలుసుకున్నారు. జెఎసి నాయకుల నుంచి వినతి పత్రం స్వీకరించారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు బి.ఉమామహేశ్వరరావు, పాలక పురుషోత్తం, రామ్మోహన్‌రావు, ఎపి గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతిరావు, అప్పారావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

డిఎస్సీ ప్రత్యేకం-ఎస్ఎ/ఎస్‌జిటి

జాతీయ విద్యా ప్రణాళిక చట్టం - 2005 (NCF)

- దాసరి ఆంజనేయులు
మెథడాలజీ సబ్జెక్టు నిపుణులు, సెల్ : 9490082528



జాతీయ విద్యా ప్రణాళిక చట్టం - 2005 (NCF - 2005)

NCF National Curriculum Fram Work.
1984లో జాతీయ పాఠ్య ప్రణాళిక చట్రాన్ని ఎన్‌సిఇఆర్‌టి రూపొందించింది.

- 1968 మొదట జాతీయ విద్యా విధానం ఆధారంగా 1975లో మొదట జాతీయ విద్యా ప్రణాళిక చట్టాన్ని నిర్మించారు. దీనిని ఎన్‌సిఇఆర్‌టి 10 సం॥ పాఠశాల విద్యా ప్రణాళిక ప్రవేశపెట్టారు.
- 1976 వరకు భారత రాజ్యాంగం ప్రకారం విద్యా రాష్ట్ర జాబితాలో ఉన్నందున రాష్ట్రాలన్నీ తమకు నచ్చిన విద్యా విధానాన్ని పాటించేవి. కేంద్ర ప్రభుత్వం కేవలం సలహాలు, సూచనలు మాత్రం ఇవ్వగలిగేది.
- 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా విద్య ఉమ్మడి జాబితాలో చేర్చబడింది. దీని ఫలితంగా 1986 జాతీయ విద్యా విధానాన్ని (ఎన్‌పిఇ-1986) రూపొందించారు.
- రాష్ట్రాల భౌగోళిక, సాంస్కృతిక వైవిధ్యాన్ని, వాటి విలువలకు భంగం కలుగకుండా, విద్యార్థులకు అవసరం సంబద్ధత సరళమై విద్యార్థి కేంద్రీకృతమైన విద్యా ప్రణాళిక ఎన్‌పిఇ- -1986 ప్రాధాన్యత ఇచ్చారు.
- విద్యా ప్రణాళికకు సంబంధించిన మౌలిక అంశాలు భారత దేశమంతటా పాఠశాల స్థాయిలో ఉండాలని 1986 -ఎన్‌ఇపి విద్యావిధానం సూచించింది. దీని ఆధారంగా ఎన్‌సిఇఆర్‌టి 1988 సం॥
- రెండో జాతీయ పాఠ్యప్రణాళిక చట్రాన్ని రూపొందించింది.
- 1986 - జాతీయ విద్యా ప్రణాళికను పునః పరిశీలిస్తూ, పాఠశాల విద్యకు సంబంధించిన నూతన కరికులమును రూపొందించటం జరిగింది. చటం జరిగింది. ఇది మూడో జాతీయ విద్యా ప్రణాళిక చట్రం.

National Curriculum Frame Work for School Education-2000 ను రూపొందించటం జరిగింది.

- ఎన్‌సిఇఆర్‌టి కార్యనిర్వాహక వర్గం కార్యనిర్వాహక వర్గం జులై 14-19, 2004 న సమావేశమై దీన్ని సమీక్షించాలని నిర్ణయించింది.

5 ఎన్‌సిఇఆర్‌టి ప్రాంతీయ విద్యాసంస్థల్లో 5 పెద్ద సెమినార్లు దీని కోసం జరిగాయి. ఫలితంగా ప్రొఫెసర్ యశ్‌పాల్ అధ్యక్షులుగా 35 మంది సభ్యులుగా జాతీయ సారథ్య సంఘం ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ప్రొ॥శాంతాసిన్హా సభ్యులుగా ఉన్నారు.

- దీనితో ఎన్‌సిఎఫ్ - 2005 అనే నాల్గో జాతీయ పాఠ్య ప్రణాళిక చట్రం ఆవిర్భవించింది.

(ఎన్‌సిఎఫ్-1975, ఎన్‌సిఎఫ్-88, ఎన్‌సిఎఫ్--2000 , ఎన్‌సిఎఫ్-2005)

ఎన్‌సిఎఫ్-2000. భారంలేని అభ్యసనం - 1993, 21 ఫోకస్ గ్రూప్‌లు ఆధారంగా ఎన్‌సిఎఫ్-2005 ను రూపొందించారు.

(ఎన్‌సిఎఫ్-1975, 1988, ఎన్‌సిఎఫ్-2000, ఎన్‌సిఎఫ్ 2005)

ఎన్‌సిఎఫ్ 2005 నిర్మాణాత్మక వాదానికి సంబంధించింది.

ఎన్‌సిఎఫ్ 2005ను జాతీయ సలహాసంఘం (సిఎబిఇ) 7 సెప్టెంబర్, 2005న ఆమోదించింది.

ఎన్‌సిఎఫ్-2005 ప్రారంభంలో రవీంద్రనాథ్ ఠాగూర్‌కు చెందిన 'Civilization and Progress' అనే వ్యాసానికి సంబంధించిన విషయంతో ప్రారంభమవుతుంది.

- సృజనాత్మకత శక్తి, సహజమైన ఆనందం బాల్యానికి కీలకమైనవి అని రవీంద్రనాథ్ ఠాగూర్ ఆ వ్యాసంలో పేర్కొన్నారు.
- దీనిలో 21 జాతీయ ఫోకస్ గ్రూప్స్ ప్రాతినిధ్యం వహించాయి.
- రాజ్యాంగం 8వ షెడ్యూల్‌లో గుర్తించిన 22 భాషల్లోకి దీనిని అనువదించారు. ఒకొక్క రాష్ట్రానికి రూ.10 లక్షలు గ్రాంట్ కూడా ఇచ్చారు.

ఎన్‌సిఎఫ్ - లక్ష్యాలు:-

1. దేశవ్యాప్తంగా పాఠ్య ప్రణాళికలో నాణ్యతపరంగా సమాన స్థాయి ఉండేలా చూడటం దీని ముఖ్య ఉద్దేశం..
2. భారతదేశపు బహుళతత్వాన్ని ఏ మాత్రం నష్టపర్చకుండా జాతీయ సమైక్యతను పటిష్టం చేయటం దీని ముఖ్య ఉద్దేశం.
3. పాఠశాల విద్య ప్రణాళిక ఏమి బోధించాలి. ఎలా బోధించాలి, ఎలా ఉండాలి, ఏ విధానాలను అనుసరించాలి అనే విషయాలను తెలియజేస్తుంది.
4. వివిధ సబ్జెక్టులకు సంబంధించి వివిధ తరగతులకు సంబంధించిన పాఠ్యప్రణాళిక, పాఠ్యపుస్తకాలను తయారు చేయటానికి సూచనలు, మార్గదర్శకాలను ఇస్తుంది.

ఎన్‌సిఎఫ్ - అధ్యాయాలు
దీనిలో 5 అధ్యాయాలు ఉన్నాయి

అధ్యాయం -1	విద్య దృక్పథం
అధ్యాయం -2	అభ్యసనం-జ్ఞానం
అధ్యాయం 3.	పాఠ్యాంశాలు-పాఠశాలస్థాయిలు -మూల్యాంకనం
అధ్యాయం 4	పాఠశాల తరగతి వాతావరణం
అధ్యాయం 5	సంస్థాగత సంస్కరణలు

అధ్యాయం-1: విద్యాదృక్పథం
దీనియందు ఈ క్రింది విషయాలను పొందుపర్చారు .
1. మార్గదర్శక సూత్రాలు
2. నాణ్యత పార్శ్వాలు
3. విద్యా సామాజిక సందర్భం
4. విద్యా లక్ష్యాలు

అధ్యాయం-2 :- అభ్యసనం -జ్ఞానం
దీనియందు ఈ క్రింది విషయాలను పొందుపర్చారు
1. అభ్యాసకుల ప్రాధాన్యత
2. అభ్యసనా నైపుణ్యాలు, అభ్యసనా వైకల్యాలు
3. కౌమరదశ
4. కరికులమ్, ఆచరణలో ఇమిడివున్న అంశాలు
5. విమర్శనాత్మక బోధనా వ్యూహం, సమ్మిళిత విద్య
6. ప్రణాళిక పట్ల వైఖరి
7. పిల్లల జ్ఞానం, స్థానిక జ్ఞానం, జ్ఞానపునః సృజన
8. పాఠశాల విద్య, సమాజం

అధ్యాయం-3 : పాఠ్యాంశాలు, పాఠశాల స్థాయిలు, మూల్యాంకనం
1. భాష
2. గణితం
3. ప్రకృతిశాస్త్రాలు
4. సామాజిక శాస్త్రాలు
5. కళా విద్య
6. ఆరోగ్య విద్య, వ్యాయామవిద్య
7. పనివిద్య
8. శాంతికోసం విద్య
9. ప్రాథమిక విద్య, మాధ్యమిక విద్య, ఉన్నత విద్య
10. ఒపెన్ స్కూళ్ళు, బ్రిడ్జిస్కూల్

అధ్యాయం-4 : పాఠశాల, తరగతి వాతావరణం
1. భౌతిక వాతావరణం
2. పాఠ్య పుస్తకాలు, పుస్తకాలు
3. గ్రంథాలయాలు
4. విద్యా సాంకేతిక పరిజ్ఞానం (ఐసిటి)
5. పరికరాలు, ప్రయోగశాలలు
6. బహుళ పాఠ్య గ్రంథాలు, ప్రత్యామ్నాయ సామగ్రి
7. వనరుల సమీకరణ, నిర్వహణ

అధ్యాయం-5 : సంస్థాగత సంస్కరణలు
1.నాణ్యత పట్ల శ్రధ
2.ఉపాధ్యాయ విద్య
3. పరీక్షల సంస్కరణలు
4. వినూత్నాలోచనలు, ప్రయోగాలు
5.నూతన భాగస్వామ్యం

ఎన్‌సిఎఫ్-2005 :

- జాతీయ విద్యావిధానాన్ని బలోపేతం చేయటం
- విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని పెంపొందిచటం
- పాఠశాలలో మౌళిక వసతులను కల్పించటం.

సాంఘిక అభ్యసనానికి, క్రియాత్మక అభ్యసనానికి ప్రాధాన్యత ఇవ్వటం,

- సమానత్వం, పరిమాణాత్మకత, గుణాత్మకత అనేవి ఎన్‌సిఎఫ్ **- 2005 త్రికోణాలు.**
- పాఠ్యపుస్తకాల బరువును తగ్గించటం.
- కరికులమ్ భారాన్ని తగ్గించటం,
- పాఠశాలకు వెళ్ళే విద్యార్థులకు దూరం తగ్గించటం.

ఎన్‌సిఎఫ్ **- 2005 ముఖ్య మార్గదర్శకాలు :**
విద్యా ప్రణాళిక నిర్మాణం కోసం ఎన్‌సిఎఫ్ - 2005 ఈ క్రింది మార్గ దర్శకాలను అందజేస్తుంది. ఇవి ముఖ్యంగా ఐదు (5)

1. జ్ఞానాన్ని పాఠశాల వెలుపల జీవితంతో అనుసంధానం చేయటం.
2. బట్టీ విధానాలను స్వస్తిపలికి అభ్యసన అర్థవంతంగా జరిగేటట్లు చూడటం.
3. అభ్యసన కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం చేయకుండా పిల్లల సమగ్ర అభివృద్ధి కోసం విద్యా ప్రణాళికలో అవకాశం కల్పించటం.
4.పరీక్ష విధానాన్ని సరళవంతం చేసి తరగతి అనుభవాలతో అనుసంధానం చేయాలి.
5.భారత రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్య విలువలను పెంపొందిచటం.

ఎన్‌సిఎఫ్ - 2005 సిఫార్సు చేసిన సబ్జెక్టులు:
1.భాషలు (తెలుగు, ఇంగ్లీష్)
2 గణితం
8. విజ్ఞాన శాస్త్రం
4. సాంఘిక శాస్త్రం
3. కళలు- సంగీతం
6 ఆరోగ్య విద్య వ్యాయామ విద్య
7. పని అనుభవం
8.శాంతి కొరకు విద్య

1. బాష :
1. త్రిభాషా సూత్రాన్ని అనుసరించాలి.
2. మాతృభాషలోనే బోధన జరగాలి.
3.బహుభాషా విధానంలో బోధన.

2.గణిత
- గణిత జ్ఞానం, గణితీకరణ, గణితబోధన ముఖ్యం లక్షణం
- గణిత సూత్రాలు, యాంత్రిక పద్ధతులను ఉపయోగించి గణిత సమస్యలను సాధించటం (గణిత జ్ఞానం)
- తార్కికంగా ఆలోచించటం, అమూర్తలను అర్థం చేసుకోవటం (గణితీకరణ)

3.విజ్ఞాన శాస్త్రాలు :
సైన్సుకు సంబంధించిన అంశాలు పిల్లల వయస్సుకు, జ్ఞాన సామర్థ్యానికి తగినట్లు ఉండాలి.
- పిల్లల కుతూహలాన్ని, సృజనాత్మకతను వికసింపచేసేలా ఉండాలి.
- శ్రమ ప్రపంచంలోకి ప్రవేశించడానికి తగిన జ్ఞానాన్ని నైపుణ్యాన్ని అందించ విధంగా సైన్సు శిక్షణ ఉండాలి.
- పాఠ్య ప్రణాళికలో పర్యావరణ చైతన్యం అంతర్భాగం కావాలి.

4. సాంఘిక శాస్త్రం :-
స్వతంత్రంగా ఆలోచించటానికి, సామాజిక అంశాల్లో విమర్శనాత్మకంగా ప్రతిస్పందించటానికి తగిన నైతిక మానసిక పెంపొందించే విధంగా సామాజిక శాస్త్రాల బోధన ఉండాలి.
- స్త్రీ, పురుష సమానత్వం, మానవ హక్కులు, అట్టడుగు వర్గాల పట్ల మైనార్టీల పట్ల స్పృహ కలిగి ఉండటం లాంటి అంశాలను దృష్టిలో ఉంచుకోవాలి.
- గతం పట్ల పిల్లల దృక్పథాన్ని ప్రభావితం చేసేదిగా చరిత్ర ఉండాలి.
- పౌరశాస్త్రాన్ని రాజకీయ శాస్త్రరూపంలో చూడాలి.

5. కళావిద్యా :
-సంగీతం, నృత్యం, చిత్రకళ, నాటకం, థియేటర్ ఆర్ట్స్ వంటి కళలు ప్రతిస్థాయిలోను మన పాఠ్యాంశాలుగా ఉండా

లక్ష్యాలు :-
1. సౌందర్యాన్వేషణ
2. స్వీయాభివృద్ధి
3. భిన్నరూపాల్లో వ్యక్తీకరణ సామర్థ్యం

- కళా విద్య బోధనా రూపంలో ఉండదు. పరస్పర చర్యల రూపంలో ఉంటుంది.

ఆరోగ్య - వ్యాయామ విద్య :
- ఆరోగ్యం ఒక బహుముఖమైన భావన, ఇది జీవ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ కారణాలచే ప్రభావితమవుతుంది.
- పిల్లవాడి సంపూర్ణాభివృద్ధిలో ఆరోగ్యానిదే ప్రధాన పాత్ర.
- బాలికల ఆరోగ్యం పట్ల మనం శ్రద్ధ వహించాలి.
- విద్యా ప్రణాళికలో భాగంగా మధ్యాహ్న భోజన పథకాన్ని వైద్య పరీక్షల్ని అమలుపర్చాలి
- 1940లో ప్రవేశపెట్టిన పాఠశాల ఆరోగ్యకార్యక్రమం ఆరు ప్రధాన అంశాలను చర్చించింది. దీనిలో ఆరోగ్య విద్య ఒకటి.
- ఈ మధ్యకాలంలో నూతనంగా విద్యా ప్రణాళికలో చేర్చాల్సిన అంశంగా యోగా గుర్తింపబడింది.
- విద్యా ప్రణాళికలో ఆటలు, యోగా సాధనకు కేటాయించిన సమయాన్ని ఎట్టి పరిస్థితుల్లోను తగ్గించకూడదు.
- యోగా హయర్ సెకండరీ స్థాయిలో దీన్ని ఒక ఐచ్ఛిక అంశంగా చదివే అవకాశం కల్పించాలి.
- యోగా కార్యక్రమాన్ని ప్రాథమిక స్థాయిలోనే అనియతంగా ప్రవేశ పెట్టాలి.
- ఆసనాలు, ధ్యానం 6వ తరగతి నుండి నియతరూపంగా ఉంచొచ్చు.

రేపు : ఎన్‌సిఎఫ్-2005 (2)

సంపాదకీయం

నోటితో నవ్వి...

టీం ఇండియా తరహాలో ఒకే జట్టులా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేస్తే అసాధ్యమైన లక్ష్యమేదీ ఉండదని శనివారం నాటి నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ చెప్పిన మాటలు 'నోటితో నవ్వి నొసటితో వెక్కిరించడం' అన్న సామెతను గుర్తు చేస్తున్నాయి. విపక్ష పాలిత రాష్ట్ర ప్రభుత్వాల పాలనను గవర్నర్ల ద్వారా స్తంభింజేయడం మొదలు ఇటీవలి పహల్గాం ఉగ్ర దాడి, అనంతర భారత్ పాక్ సాయుధ ఘర్షణ గురించి పాలక కూటమి ముఖ్యమంత్రులకు, నాయకులకు మాత్రమే ఆదివారంనాడు వివరించుకున్న ప్రధానమంత్రి నీతి ఆయోగ్ సమావేశంలో మాత్రం గంభీర ఉపన్యాసం చేయడం ఆయనకే చెల్లింది. ప్రజలెన్నుకున్న చట్టసభలు ఆమోదించిన బిల్లులను రాష్ట్రపతి, గవర్నర్లు నిర్దిష్ట కాలపరిమితిలోగా తమ సమ్మతి తెలపాల్సిందేనని దేశ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పునే రాష్ట్రపతి ద్వారా ప్రశ్నించిన కేంద్ర ప్రభుత్వానికి అధినేత ఆయన! ఇలా చెబుతూపోతే రాష్ట్రాల హక్కుల ఉల్లంఘనకు సంబంధించి కొండవీటి చేంతాడంత జాబితా అవుతుంది. ఇదే 'సహకార ఫెడరలిజం' అని లోకమంతా అనుకోవాలా? పహల్గాం ఉగ్రదాడి, తదనంతర ఆపరేషన్ సిందూర్‌తోపాటు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌ను, ఉగ్రవాదాన్ని ఒంటరిపాటు చేయడానికి వివిధ పార్టీల నేతలను దేశదేశాల్లో తిప్పుతున్న మోడీ సర్కారు ఈ దేశ ప్రజలకు వివరించడానికి అత్యున్నత ప్రజాస్వామిక వేదికయైన పార్లమెంటును మాత్రం సమావేశపర్చడం లేదు. ఇదీ పాలకుల పారదర్శకత!

నీతి ఆయోగ్ సమావేశం మరుసటి రోజునే పాలక కూటమి ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రుల సమావేశం ఆపరేషన్ సిందూర్‌లో భారత సాయుధ దళాల అసమాన ధైర్య సాహసాలను కొనియాడుతూ తీర్మానించింది. పనిలో పనిగా ప్రధాని నరేంద్ర మోడీకి స్తోత్రపాఠాలతో సమావేశం వెల్లువెత్తింది. ఈ సమావేశంలో బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్, 19 రాష్ట్రాల నుండి ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. కేంద్రంలో ఎన్‌డిఎ వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈ సమావేశం జరిగినట్టు చెబుతున్నా ఆపరేషన్ సిందూర్, దేశ భద్రత సహా పలు అంశాలపైనే ప్రధాన చర్చ నడిచిందన్నది వాస్తవం. ఆపరేషన్ సిందూర్ విజయంలో సాయుధ బలగాలు ప్రదర్శించిన అసమాన ధైర్యసాహసాలను, ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వాన్ని అభినందిస్తూ ఈ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఉగ్రవాదులకు, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న వారికి ఆపరేషన్ సిందూర్ గట్టి సమాధానం ఇచ్చిందని పేర్కొనడం బాగానే ఉంది. కానీ ఇంత ప్రతిష్టాత్మక ఆపరేషన్ నిర్వహించిన తరువాత కాల్పుల విరమణను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారనీ, భారత్ పాక్ ద్వైపాక్షిక వివాదంలో మూడోవారు ఎందుకు జోక్యం చేసుకున్నారన్నది మాత్రం వెల్లడించలేదు. నరేంద్ర మోడీని లేదా అమిత్‌షాను ప్రశ్నించే సాహసం ఎన్‌డిఎ భాగస్వాములెవరూ చేయలేకపోవచ్చు కానీ వాస్తవాలు తెలియజెప్పాల్సిన బాధ్యత కూటమి నాయకత్వానిదే కదా! మిత్ర ధర్మాన్ని సైతం బిజెపి విస్మరించినట్టే భావించవలసి వస్తుంది. లేదు.. అని ఎవరైనా అంటే ట్రంప్ జోక్యంపై ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలి.

టీం ఇండియా స్ఫూర్తితో పని చేయాలన్న ఆకాంక్ష వాస్తవమైతే కేంద్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంటు సమావేశం జరిపి అన్ని విషయాలను వెల్లడించాలి. పారదర్శకంగా ప్రజలకు అన్నీ తెలియజేస్తేనే ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతీయులందరినీ ఐక్యంగా నిలపడం సాధ్యమవుతుంది. నిజానికి పహల్గాం ఉగ్రదాడి జరిగిన వెనువెంటనే బాధిత కుటుంబాలను ఆదుకోవడంలో కాశ్మీర్ ప్రజలు- వారిలో అత్యధికులు ముస్లింలు- చూపిన స్ఫూర్తి ఆదర్శవంతమైనది. కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు యావద్భారతావని ఏకతాటిపై ఉగ్రవాదానికి, వారిని ప్రోత్సహించేవారికీ వ్యతిరేకంగా నిలిచింది. ఆ స్ఫూర్తికి తూట్లు పొడిచేలా మధ్యప్రదేశ్ మంత్రి, ఉప ముఖ్యమంత్రి, తాజాగా బిజెపి ఎంపి రామచంద్ర జాంగ్రా వ్యాఖ్యలు వెలువడుతున్నాయి. సాక్షాత్తూ సుప్రీం కోర్టు తలంటినా బిజెపి అధిష్టానం కానీ కేంద్ర ప్రభుత్వం కానీ ఎలాంటి చర్యలూ చేపట్టకపోవడం ఏ సంకేతాలనిస్తుంది? పాలకులు తగు దిద్దుబాటు చర్యలు తీసుకోవడం అవశ్యం!

మహనీయుల మాట

వంద మాటలు చెప్పేకంటే ఒక్క మంచి పని చేసి చూపడమే మేలు.

కందుకూరి వీరేశలింగం
జననం : 16.4.1848
మరణం : 27.5.1919

సే సూత్రంతో జరిగిన విధ్వంసం

> ఒక్క ముక్కలో చెప్పాలంటే ఇప్పుడు అనుసరిస్తున్న "ఎగుమతుల ఆధారిత వృద్ధి" వ్యూహాన్ని, దాని వెనుక దాగివున్న పనికిమాలిన సే సూత్రాన్ని విసర్జించాలి. ఇప్పటికే అది చాలా ఎక్కువ విధ్వంసాన్ని కలిగించింది.

ప్రభాత్ పట్నాయక్

జీన్ బాప్టిస్ట్ సే అనే ఫ్రెంచి ఆర్థికవేత్త 18వ శతాబ్దానికి చెందినవాడు. అతను ఒక సూత్రాన్ని ప్రతిపాదించాడు. "సరుకుల సరఫరాయే దానికి సరిపడా డిమాండ్‌ను సృష్టిస్తుంది" అన్నదే ఆ సూత్రం. దాని ప్రకారం ఏ ఆర్థిక వ్యవస్థలోనైనా, మొత్తంగా ఉత్పత్తి అయ్యే సరుకులకు సరిపడా డిమాండ్ ఉండి తీరుతుంది. డిమాండ్ కొరత ఉండే ప్రసక్తే రాదు. ఈ సూత్రాన్ని సమర్థిస్తూ అతడి వాదన ఇలా సాగింది: ఏ సరుకు ఎంత ఉత్పత్తి అవుతుందో దాని విలువకు సమానంగా దాని ఉత్పత్తితో సంబంధం కలిగివున్నవారి ఆదాయాలు కూడా సమకూరుతాయి. ఈ ఆదాయాన్ని వారు ఖర్చు చేయనూవచ్చు లేదా దాచుకోవచ్చు (పొదుపు చేయవచ్చు). ఏ మేరకు ఖర్చు అవుతుందో ఆ మేరకు ఆ సరుకులకు మళ్ళీ డిమాండ్ ఏర్పడుతుంది. ఏ మేరకు దాచుకుంటారో, ఆ మేరకు దాచుకున్న సొమ్ముతో పెట్టుబడికి అవసరమయ్యే సరుకులనైనా కొంటారు లేదా పెట్టుబడి పెట్టేవారికి రుణాల రూపంలోనైనా ఇస్తారు. అంటే ఎంత మొత్తాన్ని దాచుకుంటారో దానికి సరిసమానంగా ధనం పెట్టుబడి రూపంలో మార్కెట్‌లోకి ప్రవేశిస్తుంది. ఆ రుణాల మీద వడ్డీ కూడా మార్కెట్ లోకి ఖర్చు రూపంలోనో, పెట్టుబడి రూపంలోనో తిరిగి ప్రవేశిస్తుంది. అందుచేత పెట్టుబడిదారీ వ్యవస్థలో పూర్తి స్థాయిలో అందరికీ ఉపాధి కల్పించి తీరాల్సిన ఆగత్యం ఏమీ లేదు. ఉత్పత్తి అయిన సరుకుల విలువకు సమానంగా ఆదాయాలు కూడా సమకూరుతాయి కనుక సరుకుల డిమాండ్ అనేది తప్పకుండా ఉంటుంది. కొన్ని సరుకుల విషయంలో సప్లైకి డిమాండ్ సరిపోకపోవచ్చు కాని మొత్తంగా ఆర్థిక వ్యవస్థను చూసినప్పుడు ఆ విధంగా ఉండదు. సప్లై ఎంత ఉంటుందో, డిమాండ్ కూడా అంతే ఉంటుంది."-ఇదీ సే చేసిన వాదన.

సే సూత్రంతో ఒక సమస్య ఉంది. ప్రస్తుత కాలంలో ఎంత ఆదాయం సమకూరిందో ఆ ఆదాయమంతా ప్రస్తుత కాలంలో ఉత్పత్తి అయిన సరుకుల వినిమయం కోసమే ఖర్చు చేయబడుతుందని ఆ సూత్రం భావిస్తుంది. లేదా ఆ ఆదాయంలో కొంత భాగం దాచుకుంటే అలా దాచుకున్న మొత్తం కూడా ప్రస్తుత కాలంలోనే పెట్టుబడిగా తిరిగి మార్కెట్ లోకి వస్తుందని భావిస్తుంది. ఐతే ఆదాయాన్ని పొందినవారు దానిని డబ్బు రూపంలోనే దాచుకున్నప్పుడు ఏం జరుగుతుందన్నది సే సూత్రం వివరించలేదు. అలా కొంత ధనాన్ని దాచుకున్నప్పుడు మార్కెట్‌లోకి ప్రవేశించిన సరుకుల విలువకు సమానంగా డబ్బు మార్కెట్‌లోకి రాదు. అప్పుడు సప్లైకి సరిపడా డిమాండ్ ఉండదు. అటువంటప్పుడు తగ్గిన డిమాండ్‌కు అనుగుణంగా సరుకుల ధరలను గనుక తగ్గిస్తే అప్పుడు డబ్బు విలువ పెరుగుతుంది. దానిని మరింత ఎక్కువగా దాచుకోవాలన్న ట్రెండ్ పెరుగుతుంది.

పెట్టుబడిదారీ ఆర్థిక సిద్ధాంతాన్ని సమర్థించే ఆర్థికవేత్తలు సే సూత్రాన్ని ఆమోదిస్తారు. దానిని సమర్థిస్తూ వారిలా వాదిస్తారు: పెట్టుబడిదారులు ఎప్పుడూ తమ సంపదను డబ్బు రూపంలో దాచుకోడానికి సిద్ధపడరు. డబ్బును వారు ఒక మారకపు సాధనంగానే పరిగణిస్తారు. అందుచేత సప్లై-డిమాండ్ సమతూకానికి ఎటువంటి ఇబ్బందీ తలెత్తదు". ఇది పూర్తిగా అర్థం లేని వాదన. అంతే కాకుండా, అనుభవాన్ని చూసినా ఇది చెల్లదు. అసలు సే సూత్రమే పెట్టుబడిదారీ వ్యవస్థకు అతకని సూత్రం. కార్ల్ మార్క్స్ అందుకే సే సూత్రాన్ని తూర్పారబట్టాడు. పెట్టుబడిదారీ సమాజం అధికోత్పత్తి దిశగా సాగుతుందని రుజువు చేశాడు.

ఇంతకీ ఎప్పుడో పాత రోజుల్లోనే సే సూత్రం చెల్లుబాటు కాదని తేలిపోయిన తర్వాత ఇప్పుడు ఈ చర్చ దేనికి అన్న ప్రశ్న తలెత్తవచ్చు. సే సూత్రం చెల్లదని చెప్పినది మార్క్స్ ఒక్కడే కాదు. పెట్టుబడిదారీ ఆర్థికవేత్త అయిన కీన్స్ కూడా 1930 దశకంలో తలెత్తిన మహా మాంద్యం సందర్భంగా సే సూత్రం చెల్లదని తేల్చాడు. అప్పటికి పశ్చిమ దేశాలలోని ఆర్థిక వ్యవస్థలలో బోల్షివిక్-తరహా విప్లవాలు తలెత్తే ప్రమాదం ఉందని గ్రహించి, దాని నుండి పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడడానికి పూనుకున్నాడు. ఆ క్రమంలో ముందు పెట్టుబడిదారీ వ్యవస్థలో తలెత్తిన లోపాలను, బలహీనతలను నిజాయితీగా గుర్తించి ఆ తర్వాత ఆ వ్యవస్థను రిపేరు చేయడానికి పూనుకోవాలని భావించాడు. అప్పుడే విప్లవాలు తలెత్తకుండా జాగ్రత్త పడగలుగుతామని అనుకున్నాడు. అందుకే పెట్టుబడిదారీ వ్యవస్థలో సప్లైకి సరిపడా డిమాండ్ ఎప్పుడూ ఉంటుంది అన్న సే సూత్రం బొత్తిగా పనికిమాలినదని ప్రకటించాడు.

ఇప్పుడు అదే సే సూత్రం మళ్ళీ ఆర్థిక చర్చల్లో చోటు సంపాదించింది కనుకనే దానిని మనం ఇక్కడ చర్చిస్తున్నాం. నిజానికి నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థను సమర్థించుకోడానికి సే సూత్రమే ప్రాతిపదికగా ఉంది.

> ఇక్కడి శ్రామిక ప్రజానీకాన్ని మరింత ఎక్కువగా దోపిడీ చేయడం ద్వారానే ఈ 'ఎగుమతుల మార్కెట్'లో మన వాటా పెంచుకోగలుగుతాం. వేతనాలను తక్కువగా చెల్లించడం, ఎక్కువ గంటలపాటు పని చేయించడం, న్యాయంగా కార్మికులకు చెల్లించవలసిన సొమ్మును ఎగవేయడం వంటి తప్పుడు విధానాలను ఎంత ఎక్కువగా అమలు చేస్తే అంత ఎక్కువగా మన ఎగుమతులు పెరుగుతాయి. అంటే ఈ 'ఎగుమతుల ఆధారిత వృద్ధి' అనేది దేశంలో ఆర్థిక అసమానతలను పెంచే వృద్ధిగా ఉంటుంది. మరోవిధంగా చెప్పాలంటే పేదరికాన్ని ఎక్కువగా సృష్టించే వృద్ధి ఇది.

నెహ్రూ-మహల్‌నోబిస్ వ్యూహంగా ఆర్థికవేత్తలు పిలిచే ప్రభుత్వ నియంత్రణలోని ఆర్థిక వ్యవస్థను తోసిపుచ్చడానికి, దాని స్థానంలో నయా ఉదారవాద విధానాన్ని ప్రవేశపెట్టడానికి కావలసిన మేథోపరమైన ప్రయత్నాలు నిజానికి 1970 దశకం చివర్లోనే మొదలయ్యాయి. నాలుగు దేశాలు - దక్షిణ కొరియా, తైవాన్, హాంగ్‌కాంగ్, సింగపూర్-'ఆసియా పులులు' గా ఎదిగి భారతదేశం కన్నా చాలా ఎక్కువ వృద్ధిరేటును నమోదు చేయగలిగాయంటే దానికి కారణం ఆ దేశాలలో ప్రభుత్వ నియంత్రణ నుండి ఆర్థిక వ్యవస్థలు బైటపడడమే అని ఆ మేథావులు వాదించారు. అదే మార్గంలో తక్కిన దేశాలు కూడా ప్రభుత్వ నియంత్రణ లేని ఆర్థిక వ్యవస్థలను అనుసరించడం ప్రారంభిస్తే ఆ దేశాలు కూడా అధిక వృద్ధిరేటు సాధించగలుగుతాయని వారు ప్రచారం చేశారు. "ముడుచుకుపోయే" దృష్టితో ఉండే 'నెహ్రూ నమూనా'ను విడిచిపెట్టి ఎగుమతుల మార్కెట్‌ను అందుకునే విధంగా వృద్ధి సాధించేందుకు నయా ఉదారవాద విధానాన్ని చేపట్టాలని బోధించడం మొదలుపెట్టారు. అప్పుడే భారతదేశం కూడా 'ఆసియా పులి' గా ఎదుగుతుందని వారు చెప్పారు.

ఐతే వీళ్ళు ముందుకు తెచ్చిన ఈ వాదన బొత్తిగా పనికిమాలినది. ప్రపంచ మార్కెట్ మొత్తంగా ఒక వేగంతో విస్తరిస్తూ వుంటే, అప్పుడు అన్ని దేశాల మొత్తం ఉత్పత్తిని కలిపి చూసినప్పుడు ఆ ఉత్పత్తి కూడా అదే వేగంతో విస్తరించగలుగుతుంది తప్ప అంతకన్నా ఎక్కువ వేగంతో కాదు (మార్కెట్ విస్తరణ వేగం ఎంత ఉంటే ఉత్పత్తి పెరుగుదల వేగం కూడా అంతే ఉంటుంది). కొన్ని దేశాలు మార్కెట్ విస్తరణ వేగం కన్నా ఎక్కువ వేగంతో తమ ఉత్పత్తిని పెంచుకుని పోగలుగుతున్నాయంటే దానికి కారణం తక్కిన దేశాలు తమ తమ ఉత్పత్తులను మార్కెట్ వేగం కన్నా తక్కువ వేగంతో చేపట్టడమే. ఇప్పటివరకూ ఉత్పత్తి వేగంలో వెనుకబడ్డ దేశాలు గనుక ఇప్పుడు ఉత్పత్తి వేగాన్ని పెంచడం జరిగితే అప్పుడు ఇంతవరకూ వేగంగా పెరుగుతున్న దేశాలు దెబ్బ తింటాయి. అందుచేత అన్ని దేశాలూ తమ తమ ఉత్పత్తులను వేగంగా పెంచుకుని ఆసియా పులుల మాదిరిగా తయారౌదామని, ఎగుమతుల మార్కెట్ లోకి పెద్ద ఎత్తున ప్రవేశిద్దామని అనుకుంటే అది వాస్తవాన్ని విస్మరించడమే ఔతుంది. ప్రపంచం మొత్తం మీద ఉన్న స్థూల డిమాండ్ పరిమితం అన్నదే ఆ వాస్తవం. ఇలా విస్మరించడానికి కారణం నయా ఉదారవాద సమర్థకులు సే సూత్రం చెల్లుబాటు ఔతుందనే పొరపాటు అవగాహనతో ఉండడమే. నెహ్రూ వ్యూహాన్ని వదిలించుకోవాలన్న పిలుపు వెనుక ఉన్నది అర్థరహితమైన సే సూత్రానికి పెద్దపీట వేయడమే.

ఐతే సే సూత్రాన్ని యథాతథంగా వారు ముందుకు తేలేదు. చాటుమాటు వ్యూహాన్ని అనుసరించినందువల్లే వారు జయప్రదం కాగలిగారు. ఒక చిన్న దేశాన్ని ఉదాహరణగా చూపించి వారు తమ వ్యూహాన్ని ముందుకు నెట్టారు. ఏదైనా ఒక చిన్న దేశం, అది బాగా చిన్నది అయినందువల్ల, ఎగుమతులను బాగా పెంచుకుని అంతర్జాతీయ మార్కెట్‌లో చొరబడగలుగుతుంది. ఎందుకంటే అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రధానంగా డామినేట్ చేసే పెద్ద దేశాలకు ఈ చిన్న దేశపు కొద్దిపాటి ఉత్పత్తులు పెద్ద పోటీగా నిలవలేవు. అందువల్ల ఆ పెద్ద దేశాలు ఈ చిన్న దేశాల పోటీని పట్టించుకోవు. నయా ఉదారవాద సమర్థకులు ప్రతీ దేశాన్నీ తానొక చిన్న దేశంగానే అనుకునేలా ప్రభావితం చేయగలిగారు. అందుచేత ప్రపంచ స్థూల డిమాండ్‌కి ఉన్న పరిమితిని విస్మరించేట్టు చేయగలిగారు. తద్వారా దొడ్డిదారిన సే సూత్రాన్ని ప్రవేశపెట్టగలిగారు.

విజయాలు సాధించినది కేవలం ఆ నాలుగు ఆసియా పులులే కాదు. చైనా, ఆగ్నేయ ఆసియా దేశాలు ఆ తర్వాత మరింత పెద్ద విజయాలు సాధించాయి. ఐతే అవేవీ నయా ఉదారవాద విధాన వ్యూహాన్నిగాని, 'ఎగుమతుల మార్కెట్ కోసం ఆర్థిక వృద్ధి' వ్యూహాన్నిగాని అనుసరించిన ఉదాహరణలుగా పరిగణించలేము. ఆ దేశాలు ఎగుమతుల్లో కూడా వృద్ధి సాధించాయంటే దానికి కారణం అటు పశ్చిమ సామ్రాజ్యవాద దేశాలు కూడా తమ దేశాలలోని పరిశ్రమలను చౌకగా శ్రమశక్తి అభించే ప్రాంతాలకు తరలించే వ్యూహాన్ని అనుసరించడమే. మరో విధంగా చెప్పాలంటే సంపన్న పెట్టుబడిదారీ దేశాలు తమ దేశాలో ఆర్థిక వృద్ధి వేగాన్ని తగ్గించుకోవడం వల్లనే చైనా తదితర దేశాలకు అవకాశాలు లభించాయి (సంపన్న పెట్టుబడిదారీ దేశాల పెట్టుబడులు మాత్రం ఈ మార్పు వలన వేగంగా పెరిగాయన్నది కూడా గమనించాలి). ఈ క్రమంలో తక్కిన మూడవ ప్రపంచ దేశాలు పోటీలో వెనుకబడిపోయాయి.

సే సూత్రం చెల్లుతుందంటూ తప్పుడు పద్ధతిలో వాదించడం ద్వారా ఈ 'ఎగుమతుల మార్కెట్ కోసం వృద్ధిరేటు పెంచడం' అనే వ్యూహాన్ని ముందుకు తెచ్చి వాస్తవానికి మూడవ ప్రపంచ దేశాలను ఒకదానిపై మరొకదానిని పోటీకి ఉసిగొల్పింది నయా ఉదారవాదం.

ఉదాహరణకు: భారతదేశం దుస్తుల మార్కెట్‌లో తన వాటాను పెంచుకోగలిగింది బంగ్లాదేశ్‌ను దెబ్బ తీయడం ద్వారానే. ఇదే పరిస్థితి ఇతర దేశాలకు కూడా వర్తిస్తుంది. బంగ్లాదేశ్ కన్నా చౌకగా మనం దుస్తులను ఎగుమతి చేయగలిగితేనే ఎగుమతుల మార్కెట్‌ను పెంచుకోగలుగుతాం. అంటే అందుకోసం ఇక్కడి శ్రామిక ప్రజానీకాన్ని మరింత ఎక్కువగా దోపిడీ చేయడం ద్వారానే ఈ 'ఎగుమతుల మార్కెట్‌లో మన వాటా పెంచుకోగలుగుతాం. వేతనాలను తక్కువగా చెల్లించడం, ఎక్కువ గంటలపాటు పని చేయించడం, న్యాయంగా కార్మికులకు చెల్లించవలసిన సొమ్మును ఎగవేయడం వంటి తప్పుడు విధానాలను ఎంత ఎక్కువగా అమలు చేస్తే అంత ఎక్కువగా మన ఎగుమతులు పెరుగుతాయి. అంటే ఈ 'ఎగుమతుల ఆధారిత వృద్ధి' అనేది దేశంలో ఆర్థిక అసమానతలను పెంచే వృద్ధిగా ఉంటుంది. మరోవిధంగా చెప్పాలంటే పేదరికాన్ని ఎక్కువగా సృష్టించే వృద్ధి ఇది.

చివరికి ఈ 'ఎగుమతుల ఆధారిత వృద్ధి' ప్రపంచ ఆర్థి వ్యవస్థ మొత్తం మీద డిమాండ్ మందగించడానికి దారి తీస్తుంది. దాని ఫలితంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సంక్షోభం తలెత్తుతుంది. నయా ఉదారవాదులు అనుసరించిన 'ఎగుమతుల ఆధారిత వృద్ధి' వ్యూహం కూడా పనికిరాకుండా పోతుంది. కరోనా మహమ్మారి విరుచుకుపడక ముందు దశాబ్దం వృద్ధి రేటు ప్రపంచం మొత్తంగా చూస్తే అది రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత కాలంలో తక్కిన అన్ని దశాబ్దాల కన్నా అతి తక్కువ వృద్ధిరేటుగా ఉంది. కరోనా అనంతరం అది మరింత దిగజారింది.

ఈ వ్యూహం అనైతికమైనది. అణగారిన ప్రజల మధ్య ఇది పీకలు తెగ్గోసుకునే పోటీని కల్పిస్తుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఇది చిక్కుల వలలో పడవేసింది. ఈ చిక్కుల వల నుండి బైట పడడానికి మూడవ ప్రపంచ దేశాల ముందు ఉన్నది ఒక్కటే దారి. ప్రభుత్వం జోక్యాన్ని మళ్ళీ పెంచి దేశీయ మార్కెట్ విస్తరించేలా భారీ స్థాయిలో ఖర్చు చేపట్టాలి. దేశీయ మార్కెట్ విస్తరించాలంటే దేశంలో వ్యవసాయం వృద్ధిని వేగవంతం చేయాలి. అప్పుడు వ్యవసాయ కూలీల, రైతుల చేతుల్లో మరింత ఎక్కువ డబ్బు ఆడుతుంది. ఇంకోవైపు ప్రభుత్వం సంక్షేమ పథకాలపై ఖర్చు పెంచాలి. అప్పుడు మొత్తం శ్రామిక ప్రజానీకపు జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. ఈ ఖర్చుకు అవసరమైన సొమ్మును సంపద పన్ను, వారసత్వ పన్ను విధించడం ద్వారా సేకరించాలి. అప్పుడు పెట్టుబడులు ఈ దేశాన్ని వదిలిపెట్టి బైటకు పోతాయి గనుక ముందే పెట్టుబడుల రాకపోకల మీద నియంత్రణను అమలు చేయాలి. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఇప్పుడు అనుసరిస్తున్న "ఎగుమతుల ఆధారిత వృద్ధి" వ్యూహాన్ని, దాని వెనుక దాగివున్న పనికిమాలిన సే సూత్రాన్ని విసర్జించాలి. ఇప్పటికే అది చాలా ఎక్కువ విధ్వంసాన్ని కలిగించింది. (స్వేచ్ఛానుసరణ)

కల్పిత ఏకాభిప్రాయ ప్రహసనం

వ్యాఖ్య

కారణం ఆయనకే బాగా తెలియాలి కానీ ప్రధాని నరేంద్ర మోడీ పహల్గాంలోని బైసరన్ లోయలో సాగిన అమానుష హత్యాకాండపై పార్లమెంట్‌లో జరిగిన రెండు అఖిలపక్ష సమావేశాలకూ హాజరు కావద్దని నిర్ణయించుకున్నారు. దీనిపై భారతదేశం స్పందన ఎలా వుండాలో చర్చించేందుకు జరిగిన ఆ సమావేశాలకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఐక్యరాజ్యసమితి టెర్రరిస్టు సంస్థగా నిర్ధారించిన లష్కరే తోయిబాతో ముడిపడిన టెర్రరిస్టులు సాగించిన హత్యలను వారు నిష్కర్షగా ఖండించారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం తీసుకునే సరైన ప్రతిచర్యలకు తమ మద్దతు ప్రకటించారు. కాల్పుల విరమణ ప్రకటన దాకా ఈ ఏకాభిప్రాయం చెక్కు చెదరకుండా వుంది. మిలిటరీ చర్య ముగిసే వరకూ ఎలాంటి ప్రశ్నలు లేవనెత్తకుండా సంయమనం పాటించాయి.

ఏకపక్ష ప్రకటన

అయితే తాను, తమ ప్రభుత్వం కాల్పుల విరమణకు దోహదం చేశామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏకపక్షంగా ప్రకటించారు. వాణిజ్యపరమైన పర్యవసానాలు వుంటాయిని తాను హెచ్చరించాకనే భారత్-పాక్ దేశాలు ఒత్తిడికి దిగివచ్చాయని చెప్పారు. ఇది ఆశ్చర్యకరమేగాక సిమ్లా ఒప్పంద స్ఫూర్తిని ఉల్లంఘించేది కూడా. సంప్రదింపులతో పరిష్కారం కోసం ప్రయత్నాలు సాగిన ఫలితంగా కుదిరిన ఒప్పందం అది. రెండు దేశాలు ద్వైపాక్షిక చర్చల ద్వారానే అన్ని వివాదాలు పరిష్కరించుకోవడానికి కట్టుబడేలా చేసింది. అయినాసరే కాశ్మీర్ సమస్యను అంతర్జాతీయ సమస్యగా మార్చేందుకు పాకిస్తాన్ నిరంతరం ప్రయత్నాలు చేస్తూనే వచ్చింది. అధ్యక్షుడు ట్రంప్ చెప్పింది పూర్తిగా యథాతథంగా తీసుకునేట్టయితే దాని ప్రకారం అది అంతర్జాతీయాకరించబడింది. దీనివల్ల వ్యూహాత్మకంగానూ దౌత్యపరంగానూ తీవ్ర పర్యవసానాలు తప్పవు.

భారతీయ అధికారులు, ప్రభుత్వం కూడా ద్వైపాక్షిక చర్చల ఫలితంగానే కాల్పుల విరమణ జరిగిందని ప్రకటిస్తున్నా చెప్పుకోదగిన గందరగోళం ఏర్పడింది. ఈ ప్రకటనల విశ్వసనీయతపై నిజంగానే అనుమానాలు నెలకొన్నాయి.

అధికారిక వివరణ అవసరం

ఈ ప్రధాన సమస్యతోపాటు అధికారిక వివరణ రావాల్సిన ఇతర విషయాలు కూడా వున్నాయి. ఇవి ముఖ్యంగా సైనిక చర్య చుట్టూ అల్లుకుని వున్నాయి. ప్రధాన మీడియా విద్దూరమైన నిరాధార కథనాలు ప్రచారం చేసిన ఫలితంగా ఇది మరింత అవసరంగా మారింది. వీటిలో కొన్ని వార్తా కథనాలు, మరీ ముఖ్యంగా మే 8 రాత్రి ప్రసారమైనవి ఎంత దారుణంగా నడిచాయంటే భారతీయ మీడియాను అంతర్జాతీయ సమాజం దోషిగా ఈసడించే పరిస్థితి. ఈ అవాస్తవ చిత్రీకరణలు అంతిమంగా దేశ ప్రయోజనాలకే చేటుగా పరిణమించాయి. అందువల్లనే కాల్పుల విరమణ తరువాత పార్లమెంటులో ప్రభుత్వ సాధికార ప్రకటన తప్పనిసరి అవసరంగా తయారైంది.

ఐ.ఎం.ఎఫ్ యాజమాన్యం ఏ అభ్యంతరాలు లేకుండా పాకిస్తాన్‌కు లక్ష కోట్ల డాలర్ల రుణం మంజూరు చేసినప్పుడు...స్పష్టంగా మన దౌత్యపర వైఫల్యం కనిపిస్తుంది.



> ప్రభుత్వం సాధికారికంగా చేసే ప్రకటన, దానిపై సభలో క్రమబద్ధమైన చర్చను అనుమతించడం ద్వారా దేశంలో నిజమైన ఒక ఏకాభిప్రాయం రూపొందేది. అలాంటి ప్రక్రియ వల్ల పారదర్శకత వచ్చేది. రాజకీయ క్షేత్రంలో వివిధ రకాలుగా అల్లుకునిపోయిన భిన్న, బహుళ దృక్పథాలను సమ్మిళితం చేయడం సాధ్యమయ్యేది. జాతీయ ఏకాభిప్రాయం అనేది బలవంతంగా రుద్దిందో లేక కృత్రిమంగా వండిందో కాక నిజమైన రూపంలో ముందుకొచ్చేది. ఈ రూపకల్పనలో భిన్న దృక్పథాలు వ్యక్తం చేసే అవకాశముండటం ఒక కీలకమైన అంశం.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ప్రత్యేక సమావేశాలకు నిరాకరణ

ఈ నేపథ్యంలోనే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వం సాధికారికంగా చేసే ప్రకటన, దానిపై సభలో క్రమబద్ధమైన చర్చను అనుమతించడం ద్వారా దేశంలో నిజమైన ఒక ఏకాభిప్రాయం రూపొందేది. అలాంటి ప్రక్రియ వల్ల పారదర్శకత వచ్చేది. రాజకీయ క్షేత్రంలో వివిధ రకాలుగా అల్లుకునిపోయిన భిన్న, బహుళ దృక్పథాలను సమ్మిళితం చేయడం సాధ్యమయ్యేది. జాతీయ ఏకాభిప్రాయం అనేది బలవంతంగా రుద్దిందో లేక కృత్రిమంగా వండిందో కాక నిజమైన రూపంలో ముందుకొచ్చేది. ఈ రూపకల్పనలో భిన్న దృక్పథాలు వ్యక్తం చేసే అవకాశముండటం ఒక కీలకమైన అంశం.

అయినా సరే ప్రభుత్వం ప్రత్యేక సమావేశం జరపాలన్న కోర్కెకు సానుకూలంగా స్పందించడానికి నిరాకరించింది. కారణాలు వారికే బాగా తెలియాలి. అందుకు బదులుగా టెర్రరిజంను, దాని వెనక వున్న వారిని ఖండించడంలో రాజకీయ పార్టీలు చూపిన ఏకాభిప్రాయం విశాల జాతీయ ఏకాభిప్రాయంగా ప్రచారం చేసుకోవచ్చని భావించింది.

సైనిక చర్య సందర్భంలో భారతీయులు తమ ప్రభుత్వాన్ని తామే విమర్శించారని ఒక పాకిస్తాన్ విలేకరి అడిగితే విదేశాంగ శాఖ కార్యదర్శి సరిగ్గానే స్పందించారు. భారత దేశంలో సజీవమైన ప్రజాస్వామ్యం వుంది గనక ప్రభుత్వం ప్రజలకు జవాబుదారుగా వుంటుందన్నారు. నిజంగానే భారత రాజ్యాంగం దాని లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర లక్షణాలు దేశ విదేశీ సవాళ్ళను ఎదుర్కోవడంలో మన ప్రధాన శక్తిగా వున్నాయి.

ప్రజాస్వామిక చర్చతోనే....

ఇది దేశం తనను తాను సందర్శించుకునే సమయం. సముచితమైన పారదర్శకమైన ప్రజాస్వామిక చర్చతో ఒక నిజమైన జాతీయ ఏకాభిప్రాయం రూపొందించుకోవడంలో నిమగ్నం కావలసిన మరో సందర్భం. దాన్ని కృత్రిమంగా తయారు చేయడం కుదరదు.

ఈ పూర్వ రంగంలో ప్రభుత్వం రాజకీయ ఐక్యతను దౌత్యపరమైన చొరవకు పెంచుకునే సాధనంగా చూపించుకోవడానికి ప్రయత్నాలు చేసింది. అయితే సరైన జాతీయ ఏకాభిప్రాయం పునాదిగా లేకపోతే ఈ దౌత్యపరమైన అనుకూలత స్థిరంగా నిలబడజాలదు. అయినా భారత దేశపు నికరమైన, నిలకడైన బలం దాని రాజ్యాంగ మౌలిక విలువలలో వుంది. సీమాంతర ఉగ్రవాద సవాలును ఎదుర్కోవడానికి ఈ విలువలనే ద్విగుణీకత శక్తితో ముందుకు తీసుకుపోవాలి.

అస్తిత్వ ఆధారిత పాక్షిక రాజకీయాలన్నిటినీ ఢీకొనడానికి ప్రజాస్వామ్యం కోసం పోరాటం కొనసాగించడం తప్పనిసరి అవసరం. అలాంటి ప్రాతిపదికన సమీకరణలను రెచ్చగొడుతున్న నేపథ్యంలో అది మరింత అవసరమవుతుంది. అలాంటి ఆందోళన ఏమి వున్నా టెర్రరిజం వ్యతిరేక ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడంలోనూ భారత్, పాకిస్తాన్ మధ్య తేడా ఏంటో చూపించే ప్రయత్నం మనల్ని ఏ మాత్రం దారి తప్పించకూడదు. ఈ సంక్లిష్ట సందర్భంలో ఆ రెండింటిని మేళవించి నడపడమే మన లక్ష్యంగా వుండాలి.

(మే 21 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం).

కవిత్వం

బోడి మల్లయ్యలు

ముక్కున వేలేసుకుంది లోకం.
పక్కున నవ్వేసుకుంది
ప్రజాస్వామ్య భారతం.
ఏలినవారు మా దొడ్డ ధర్మ ప్రభువులు
రాబందుల్ని మేపడంలో... !
పులుల కడుపు నింపడంలో...!
మరెవ్వరూ లేరు పోటీ...
వారికి వారే సాటి...
విశాఖ మణి మకుటం రుషికొండ
చక్కదనాల శిలా తోరణం
పచ్చదనాల ప్రకృతి వరం
రాజకీయ భూ కబ్జాలకు
నేడు అదొక పెద్ద అడ్డా...!
ఏ రాయి అయితేనేం
పళ్ళూడగొట్టడానికి,
ఏ ప్రభువు అయితేనేం
అనకొండల ఆశ తీర్చడానికి
అధికారం మారినా....!
ఆగడాలు అలానే వున్నాయి.
తొంబై తొమ్మిది పైసలేనట, ఎకరా...
కారు చౌకని ఎగేసుకు పోయేరు సుమీ ...!
ఆ అవకాశం కార్పొరేట్లకు మాత్రమే...!
నిజమే...! ఓట్లేసి అందలం ఎక్కించింది
జనమే...! కాదనేదేముంది...?
కానీ ...! వారు ఏరు దాటేశారు కదా...!
ఇక తెప్పతో పనేముంది గనక ...
ప్రజలిప్పుడు ఓడ మల్లయ్యలు
కాదు... బోడి మల్లయ్యలు.

- వి.రాజగోపాల్,
విజయనగరం

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps @gmail.com

హక్కుల కోసం సంఘటితంగా పోరాటాలు

అండమాన్ నికోబార్ దీవుల ఎస్‌ఎఫ్‌ఐ సదస్సులో మయూఖ్ బిశ్వాస్ పిలుపు

పోర్ట్‌బ్లెయిర్ : దేశవ్యాప్తంగా విద్యా సంస్థల్లో మతం ప్రాతిపదికన విద్యార్థులను చీలుస్తున్నారని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్‌ఎఫ్‌ఐ) ప్రధాన కార్యదర్శి మయూఖ్ బిశ్వాస్ విమర్శించారు. ఎస్‌ఎఫ్‌ఐ అండమాన్ నికోబార్ దీవుల ప్రథమ సదస్సు ఆదివారం ఇక్కడి షహీద్ భవన్‌లో జరిగింది. సదస్సును ప్రారంభిస్తూ మయూఖ్ ప్రసంగించారు. అండమాన్, నికోబార్ దీవులకు కాలేజీలు ఇప్పటివరకు పుదుచ్చేరి యూనివర్సిటీకి అనుబంధంగా వున్నాయని, ఇప్పుడు దాన్ని రద్దు చేసి కొత్తగా ఏర్పాటు చేసిన డీమ్డ్ యూనివర్సిటీకి అఫిలియేట్ చేశారని విమర్శించారు. అండమాన్ దీవుల్లోని విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికై విద్యార్థుల చట్టబద్ధమైన హక్కుల కోసం ఆందోళనలు, పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం విద్యార్థులందరినీ సంఘటితం చేయాల్సిందిగా అండమాన్, నికోబార్ దీవుల ఎస్‌ఎఫ్‌ఐ కమిటీని బిశ్వాస్ కోరారు. అందరికి విద్య, అందరికి ఉపాధి అన్నదే ఎస్‌ఎఫ్‌ఐ నినాదమంటూ సంస్థ లక్ష్యాలు, ఉద్దేశ్యాలను వివరించారు. రాష్ట్ర నిర్మాణ కమిటీ కన్వీనర్ అబ్దుల్ వారిష్ ప్రసంగిస్తూ దీవుల్లోని విద్యార్థుల డిమాండ్లను వివరించారు. రాబోయే రోజుల్లో ఎస్‌ఎఫ్‌ఐ ఒక శక్తిగా అవతరిస్తుందని తెలిపారు. జెఎన్‌యు పూర్వ విద్యార్థుల సమాఖ్య చైర్మన్ డి.అయ్యప్పన్, దీవుల డివైఎఫ్‌ఐ కార్యదర్శి డిజోలు కూడా సదస్సులో విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. దీవుల్లోని వివిధ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో సదస్సుకు హాజరయ్యారు. విద్యార్థులకు సంబంధించిన పలు అంశాలపై సదస్సు అనేక తీర్మానాలను ఆమోదించింది.

అమెరికా బెదిరిస్తే మా హక్కులు వదులుకోం

● తేల్చి చెప్పిన ఇరాన్

టెహరాన్ : అణు కార్యక్రమాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లడంపై అమెరికాతో చర్చలు కొనసాగిస్తామని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ తెలిపారు. అమెరికా బెదిరింపుల కారణంగా తమ హక్కులను వదులుకోవడానికి సిద్ధంగా లేమన్నారు. "మేం చర్చలు జరుపుతున్నాం.. అవి కొనసాగిస్తాం. యుద్ధాన్ని మేం కోరుకోవడం లేదు, ఎలాంటి బెదిరింపు లకు భయపడేది లేదు." అని ఆయన స్పష్టం చేశారు. నావికాదళ అధికారులనుద్దేశించి చేసిన ప్రసంగంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వారు బెదిరిస్తే మేం మా హక్కులను వదులుకుంటామనుకున్నారేమో, అలాంటిదేమీ లేదని పెజెష్కియన్ తేల్చి చెప్పారు. ఇరు పక్షాల మధ్య నిపుణుల స్థాయిలో చర్చలు జరుగుతున్నాయి, అయితే యురేనియం శుద్ధి అన్న అంశమే ప్రధాన అడ్డంకిగా వుంది. దాన్ని ఆపాలన్నది అమెరికా డిమాండ్ కాగా, కొనసాగిస్తామన్నది ఇరాన్ వైఖరిగా వుంది.

పొగాకు కొనుగోళ్ల కోసం ఆందోళన చేస్తాం

● **28న పొదిలికి వైఎస్ జగన్ : మేరుగ నాగార్జున**

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పొగాకు కొనుగోలులో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని మాజీ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. సోమవారం ఉదయం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పొగాకు కొనుగోలు చేయించేందుకు వైసిపి ఆందోళన చేస్తుందని తెలిపారు. దీనిలో భాగంగా 28న పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పొదిలిలో పర్యటించనున్నారని చెప్పారు.

రాష్ట్రంలో కక్ష పూరిత రాజకీయాలు పరాకాష్టకు చేరాయని, గుండ్లపాడు జంటహత్యలపై దుర్మార్గమైన రాజకీయం చేస్తున్నారని అన్నారు. స్వాక్షాత్తూ జిల్లా ఎస్‌పి ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను నవ్వులపాలు చేశారని అన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం ఎల్లకాలం అధికారంలో ఉండదని పేర్కొన్నారు.

అన్ని కేసుల్లోనూ అసత్య వాంగ్మూలాలు : మనోహర్ రెడ్డి

రాజకీయ కక్షతో వైసిపి నాయకులపై అక్రమ కేసులు కడుతున్న ప్రభుత్వం అన్ని కేసుల్లోనూ అసత్య వాంగ్మూలాలనే ఆధారంగా తీసుకుందని వైసిపి లీగల్ సెల్ అధ్యక్షులు ఎం.మనోహర్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపు తప్పాయని, పోలీసులే యథేచ్ఛగా చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని తెలిపారు. తెనాలిలో నడిరోడ్డుపై దళిత యువకులను చావగొట్టారని పేర్కొన్నారు. ఈ ఘటనపై మానవ హక్కుల కమిషన్లో ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

మైనింగ్ ఎఫ్ఐఆర్‌లో కాకాని గోవర్ధన్‌రెడ్డి పేరు లేకపోయినా ఉద్దేశ పూర్వకంగా చేర్చారని మండిపడ్డారు. పల్నాడు జంట హత్యల కేసులోనూ తెలుగుదేశం నాయకులే నిందితులుగా ఉంటే ఎమ్మెల్యే చెప్పాడని పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరులపై కేసు నమోదు చేశారని అన్నారు. నాటుసారా కేసులనూ లిక్కర్ మరణాలకు ఆపాదిస్తున్నారని పేర్కొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం : నాగార్జున యాదవ్

నిరుద్యోగుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని, వైసిపి అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ అన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన 21 ఉద్యోగ నోటిఫికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయని, ఒక్క నియమాకాన్ని కూడా చంద్రబాబు చేపట్టలేదని అన్నారు. ఇచ్చిన ఉద్యోగాలనూ పీకేస్తున్నారని ఆయన విమర్శించారు.

జూన్ 19న 8 రాజ్యసభ స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలు

న్యూఢిల్లీ : ఎనిమిది రాజ్యసభ స్థానాలకు జూన్ 19న ద్వైవార్షిక ఎన్నికలు నిర్వహించనున్నట్లు భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) సోమవారం ప్రకటించింది. అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపింది. ఈ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ జూన్ 2న విడుదల చేయనున్నట్లు పేర్కొంది. అస్సాం నుండి ఇద్దరు, తమిళనాడు నుండి ఆరుగురు మొత్తం ఎనిమిదిమంది సభ్యుల రాజ్యసభ పదవీకాలం జూన్, జులైలలో ముగియనుంది. అస్సాం నుండి బీరేంద్ర ప్రసాద్ బైశ్యా (బిజెపి), మిషన్ రంజన్ దాస్ (బిజెపి)ల పదవీకాలం జూన్ 14న ముగియనుంది. తమిళనాడు అధికార పార్టీ డిఎంకెకి చెందిన ఎం.షణ్ముగం, పి.విల్సన్, ఎం.మొహమ్మద్ అబ్దుల్లాలతోపాటు (డిఎంకె), అన్బుమణి రామదాస్ (పట్టాలి మక్కల్ కచ్చి-పిఎంకె), ఎన్.చంద్రశేఖరన్ (అన్నాడిఎంకె), వైకో (మరుమలార్చి ద్రవిడ మున్నేట్ర కజగం-ఎండిఎంకె)ల పదవీకాలం జులై 24న ముగియనుంది.

చండీగఢ్‌లో సిఆర్‌డిఎ అధికారుల పర్యటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతిలో మెరుగైన నిర్మాణ ప్రణాళికలో భాగంగా సిఆర్‌డిఎ అధికారులు సోమవారం చండీగఢ్‌లో పర్యటించారు. దీనిలో భాగంగా జ్యుడీషియల్ అకాడమీ, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, సెక్రటేరియట్, హెచ్ఒడి, రోజ్‌గార్డెన్, సైకిల్ నెట్‌వర్కును సందర్శించారు. ఈ సందర్భంగా సిఆర్‌డిఎ కమిషనర్ కన్నబాబు మాట్లాడుతూ.. చండీగఢ్‌లో అత్యాధునిక సదుపాయాలున్నాయని, వీటిని అమరావతిలో అమలు చేయడంపై దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రధాన రోడ్లు, బైక్, సైకిల్ మార్గాలు ప్రత్యేకంగా ఉన్నాయని, నగరం పూర్తి ప్రణాళికను పరిశీలించి అమరావతిలో అమలు చేస్తామని తెలిపారు. జ్యుడీషియల్ అకాడమీలో ఆధునిక మౌలిక సదుపాయాలు, గెస్ట్‌హౌస్‌లో సదుపాయాలు చూశారు. చండీగఢ్‌లో మున్సిపల్ కమిషనర్ హిమాన్షు గుప్తా కార్పొరేషన్ పనితీరు, పాలనా విధివిధానాలను వివరించారు. అవెన్యూ ప్లాంటేషన్, హార్టికల్చర్ అభివృద్ధి అంశాలనూ బృందం పరిశీలించింది.

కోటాలో మరో విద్యార్థిని ఆత్మహత్య

కోటా : రాజస్థాన్‌లోని కోటాలో మరో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఏడాది ఇది 15వ ఘటన కాగా, ఈ నెలలోనే ఇది రెండవది. జమ్ముకాశ్మీర్‌కి చెందిన 18 ఏళ్ల జీషాన్ కోటాలోని ప్రతాప్ చౌరాహా ప్రాంతంలో పేయింగ్ గెస్ట్‌గా ఉంటూ నీట్‌కు సిద్ధమవుతోంది. జీషాన్ ఆదివారం సాయంత్రం బంధువు బుర్హాన్‌తో ఫోన్‌లో మాట్లాడి, ఆత్మహత్య చేసుకుంటానని చెప్పిందని మహావీర్ నగర్ సిఐ రమేష్ కవియా తెలిపారు. వెంటనే ఆయన అదే భవనం పై అంతస్తులో ఉంటున్న మరో విద్యార్థిని మమతకు ఫోన్ చేసి జీషన్ గురించి తెలుసుకోవలిసిందిగా కోరారని చెప్పారు. మమత వెళ్లే సరికి జీషన్ గది తలుపులు మూసి వున్నాయని, పగలగొట్టి చూసేసరికి ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించిందని చెప్పారు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. జీషాన్ గతంలో కోటాలో ఒక కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరిందని, నెల రోజుల క్రితం జమ్ముకాశ్మీర్‌కు వెళ్లివచ్చిన తర్వాత స్వయంగా ప్రిపేర్ అవుతోందని పోలీసులు తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన అభ్యర్థి నీట్ పరీక్షకు ఒక్కరోజు ముందు మే 3న ఆత్మహత్య చేసుకున్నట్లు కున్హాడి పోలీసులు తెలిపారు.

ADITYA BIRLA CAPITAL
ప్రొటెక్టింగ్ ఇన్వెస్టింగ్ ఫైనాన్స్ ఆడ్వైసింగ్

ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: ఇండియన్ రేయాన్ కాంపౌండ్, వెరావల్, గుజరాత్ 362266.
బ్రాంచ్ ఆఫీస్: 3 రోడ్ ఫ్లోర్, 40-1-52సి, కెబిసిఎల్ బిల్డింగ్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఎదురుగా, బెంజ్ సర్కిల్ ఎంజి రోడ్ దగ్గర విజయవాడ, ఆంధ్రప్రదేశ్: 520010.

అమ్మకపు ప్రకటన

(సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 9(1))

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ("సర్ఫేసి యాక్ట్") కింద ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు ఛార్జ్ చేయబడిన స్థిరాస్తుల ప్రైవేట్ ట్రిటీ ద్వారా అమ్మకం.

దిగువ సంతకందారులు ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇకపై "**ABHFL**" అని పిలుస్తారు) యొక్క అధీకృత అధికారి ఇక్కడగల స్థిరాస్తిని భౌతికంగా స్వాధీనం చేసుకున్నారు. **ఐటెం నెం.1:** గుంటూరు జిల్లా, దుగ్గిరాల ఎస్ఆర్ఓ, పెరుకలపూడి గ్రామ పంచాయతీ ప్రాంతం, పెరుకలపూడి గ్రామం, డోర్ నెం.103/3, డోర్ నెం.1-64 దగ్గర, ఇంటి పన్ను రసీదు ప్రకారం డోర్ నెం.1-92 ప్రకారం, అసెస్‌మెంట్ నెం.92 దీనిలో 182 చ.గ.ల ఆస్తి విస్తీర్ణంలో అన్ని సౌలభ్య హక్కులతో కూడిన ఆస్తి మొత్తం భాగం. సరిహద్దులు: తూర్పు: మాకినేని పున్నయ్య గోడ-48-0 అ.లు, పడమర: పంచాయతీ రోడ్డు &కడియాల బసవపున్నయ్య స్థలం-48-0 అ.లు, ఉత్తరం: మొక్కపాటి వెంకయ్య స్థలం & 2వ ఐటం-33-6 అ.లు, దక్షిణం: నూతలపాటి శ్రీనివాసరావు ఉమ్మడి గోడ స్థలం-34-6 అ.లు.
ఐటెం నెం.2: గుంటూరు జిల్లా, దుగ్గిరాల ఎస్ఆర్ఓ, పెరుకలపూడి గ్రామ పంచాయతీ ప్రాంతం, పెరుకలపూడి గ్రామం, డోర్ నెం.103/3, డోర్ నెం.1-64 దగ్గర, ఇంటి పన్ను రసీదు ప్రకారం డోర్ నెం.1-92 ప్రకారం, అసెస్‌మెంట్ నెం.92 దీనిలో 57 చ.గ.ల ఆస్తి విస్తీర్ణంలో అన్ని సౌలభ్య హక్కులతో కూడిన ఆస్తి మొత్తం భాగం. సరిహద్దులు: తూర్పు: మొక్కపాటి వెంకయ్య & ఇతరుల స్థలం-43-0 అ.లు, పడమర: మొక్కపాటి వెంకయ్య స్థలం-43-0 అ.లు, ఉత్తరం: ఉమ్మడి గల్లి-12-0 అ.లు, దక్షిణం: 1వ ఐటం-12-0 అ.లు.
పైన పేర్కొన్న రెండు ఐటంలు 1& 2లకు సంబంధించి 239 చ.గ.ల విస్తీర్ణపు ఆస్తి (ఇకపై "సెక్యూర్డ్ ఆస్తి"గా సూచిస్తారు) సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (ఇకపై **"సర్ఫేసి చట్టం, 2002"**గా సూచిస్తారు)లోని సెక్షన్ 13(4) కింద, రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు **షబ్బర్ షేక్, జరీనా షేక్ & శ్రీ లక్ష్మీ మెడికల్ అండ్ ఫ్యాన్సీ స్టోర్స్ (ఇకపై "రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు"గా సూచిస్తారు)** నుండి బకాయిలు రూ. **06.09.2023** నాటికి **రూ.27,66,259.16/- (రూపాయలు ఇరవై ఏడులక్షల అరవైఆరు వేల రెండువందలయాభై తొమ్మిది మరియు పదహారు పైసలు మాత్రమే)** మరియు రియలైజేషన్ తేదీ వరకు దానిపై తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో ఆర్థిక సౌకర్యం కోసం ఎబిహెచ్ఎఫ్ఎల్‌కు అనుకూలంగా హామీగా ఉంచబడినది.
సెక్యూర్డ్ ఆస్తి యొక్క బహిరంగ వేలం/వేలం విఫలమైనప్పుడు, సర్ఫేసి చట్టం, 2002 మరియు దాని క్రింద రూపొందించబడిన నియమాల ప్రకారం ప్రైవేట్ ట్రిటీద్వారా అమ్మకం ద్వారా పేర్కొన్న సెక్యూర్డ్ ఆస్తిపై దానిపై సెక్యూర్డు ఇంట్రెస్ట్‌ను దిగువ సంతకందారు అమలు చేస్తారు. పైన పేర్కొన్న సెక్యూర్డ్ ఆస్తి కొనుగోలుకు సంబంధించి అధీకృత అధికారికి భావి కొనుగోలుదారు నుండి ఆసక్తి వ్యక్తీకరణ అందింది. ఇప్పుడు, అధీకృత అధికారి సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8 మరియు 9 ప్రకారం ప్రైవేట్ ట్రిటీ ద్వారా పైన పేర్కొన్న సెక్యూర్డ్ ఆస్తిని విక్రయించడానికి నోటీసు ఇస్తున్నారు. రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతల నుండి ABHFLకు బకాయిలు **06.09.2023** నాటికి **రూ.27,66,259.16/-(రూపాయలు ఇరవై ఏడులక్షల అరవైఆరు వేల రెండువందలయాభై తొమ్మిది మరియు పదహారు పైసలు మాత్రమే)**రికవరీ కోసం **18-06-2025న** లేదా ఆ తర్వాత **"ఎక్కడ ఎలా ఉన్నది మరియు అక్కడ అలాగే ప్రాతిపదికన"** అమ్మకం జరుగును. సెక్యూర్డ్ ఆస్తి యొక్క రిజర్వ్ ధర : **రూ. 17,00,000/- (రూపాయలు పదిహేడు లక్షలు మాత్రమే)**గా నిర్ణయించబడింది.
సర్ఫేసి చట్టం, 2002 మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 కింద ఉన్న అన్ని అభ్యర్థనలను పాటించామని రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలకు ఇందుమూలంగా తెలియజేయబడుతున్నది, మరియు ABHFL ఇప్పుడు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 (5)లోని నిబంధనల ప్రకారం సూచించిన ప్రైవేట్ ట్రిటీ ద్వారా ఇక్కడ పేర్కొన్న విధంగా సెక్యూర్డ్ ఆస్తిని విక్రయించడం ద్వారా దాని సెక్యూర్డు ఇంట్రెస్ట్ అమలు చేసే ప్రక్రియలో ఉంది.
ఇంకా, రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలను సర్ఫేసి చట్టం,2002లోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలకు అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, పేర్కొన్న సెక్యూర్డ్ ఆస్తిని రీడీమ్ చేసుకోవడానికి శ్రద్ధ వహించాలి.

తేది: 27-05-2025 — **అధీకృత అధికారి**
ప్రదేశం: విజయవాడ — **ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్**

డిసిబి బ్యాంక్ లిమిటెడ్
పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో రుతుపవనాలు సోమవారం మరికొన్ని ప్రాంతాలకు విస్తరించాయి. మధ్య అరేబియా సముద్రం, ముంబయి సహా మహారాష్ట్రలోని మరికొన్ని ప్రాంతాలు, బెంగళూరు సహా కర్నాటక, తమిళనాడులోని మిగిలిన ప్రాంతాలు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలు, మధ్య పశ్చిమ - ఉత్తర బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలు, మిజోరంలోని మిగిలిన ప్రాంతాలు, త్రిపుర, మణిపూర్, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్‌తోపాటు అస్సాం, మేఘాలయలోని కొన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించాయని వాతావరణ విభాగం తెలిపింది.

పెన్షన్ ప్రయోజనాల్లో కాంట్రాక్టు సర్వీసునూ లెక్కించాల్సిందే

- తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు

ప్రజాశక్తి-హైదరాబాద్

ఉద్యోగ విరమణ ప్రయోజనాలు కల్పించే సమయంలో ఉద్యోగి కాంట్రాక్టు సర్వీసునూ లెక్కించాల్సిందేనని తెలంగాణ హైకోర్టు తీర్పు చెప్పింది. ఉద్యోగ విరమణానంతర ప్రయోజనాలైన గ్రాట్యూటీ, పెన్షన్ తదితరాల లెక్కింపులో తాత్కాలిక సర్వీసును పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్ సి నిర్మలతోపాటు మరో 51 మంది హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ సూరేపల్లి నంద విచారణ పూర్తి చేసి తీర్పు వెలువరించారు. పిటిషనర్ తరపున న్యాయవాది సిహెచ్ గణేష్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లు 2002 నుంచి 2006 వరకు కాంట్రాక్టు కింద విధుల్లో చేరారన్నారు. రెగ్యులర్ సర్వీసు డాక్టర్లతో సమానంగా సేవలందించారన్నారు. అయితే పెన్షన్, గ్రాట్యూటీ, ఉద్యోగ విరమణ ప్రయోజనాలను రెగ్యులర్ మెడికల్ ఆఫీసర్లతో సమానంగా లెక్కించడం లేదన్నారు. ఇదే రకమైన కాంట్రాక్టు ఉద్యోగుల పిటిషన్‌లపై విచారించిన హైకోర్టు దేవరకొండ లక్ష్మి వర్సెస్ ఎపి కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా పెన్షన్ ప్రయోజనాలు కల్పించాలని తీర్పు వెలువరించిందని, దాన్నే వర్తింపజేయాలని కోరుతున్నామన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి 1980 సవరించిన పెన్షన్ నిబంధనలు 13, 14 ప్రకారం కాంట్రాక్టు బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి పెన్షన్ సర్వీసు ప్రారంభమవుతుందని, అందువల్ల పెన్షన్ ప్రయోజనాల లెక్కింపులో కాంట్రాక్టు సర్వీసును లెక్కించాల్సిందేనంటూ తీర్పు వెలువరించారు. సుప్రీంకోర్టు, తెలంగాణ, ఎపి హైకోర్టు వెలువరించిన పలు తీర్పులను ప్రస్తావిస్తూ సవరించిన పెన్షన్ నిబంధనల ప్రకారం తాత్కాలిక సర్వీసునూ పెన్షన్ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. పిటిషనర్ల వినతిని పరిగణనలోకి తీసుకుని పెన్షన్ ప్రతిపాదనలు పంపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పిటిషన్లపై విచారణ ముగిసినట్టుగా వెల్లడించారు.

యశ్వంత్‌వర్మ కేసులో నివేదిక బహిర్గతం చేయం : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : జస్టిస్ యశ్వంత్‌వర్మ నోట్ల కట్టల వివాదం కేసులో సుప్రీంకోర్టు అంతర్గత కమిటీ నివేదికను సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) కింద కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. సుప్రీంకోర్టు యంత్రాంగ సమాచార గోప్యతతోపాటు పార్లమెంటరీ ప్రత్యేకాధికారాలను కూడా ఉల్లంఘించే అవకాశం ఉందంటూ సుప్రీంకోర్టు ఈ పిటిషన్‌ను తిరస్కరించింది. ఈ అంశంలో అప్పటి సిజెఐ సంజీవ్ ఖన్నా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి, ప్రధాని మోడీకి ఇచ్చిన సమాచారాన్ని కూడా అందించాలని అర్‌టిఐ దరఖాస్తు కోరింది. మార్చి 14న రాత్రి 11.35 గంటలకు అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలోని స్టోర్‌రూమ్‌లో పెద్ద మొత్తంలో నగదు కట్టలు బయటపడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై పంజాబ్-హర్యానా హైకోర్టు, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ షీల్ నాగు, జి.ఎస్.సంధావాలియా, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అను శివరామన్‌లతో కూడిన త్రిసభ్య కమిటీ విచారణ జరిపి, జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలు వాస్తవాలేనని కమిటీ నివేదిక ఇచ్చింది.

సిఆర్‌పిఎఫ్ సిబ్బంది అరెస్ట్ .. విధుల నుండి తొలగింపు

న్యూఢిల్లీ : సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్)లో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ మోతీరామ్ జాట్‌ను అరెస్ట్ చేసినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) సోమవారం ప్రకటించింది. ఢిల్లీలో అతనిని అదుపులోకి తీసుకున్నామని, పాటియాలా హౌస్‌లోని ప్రత్యేక కోర్టు అతనిని జూన్ 6 వరకు కస్టడీకి అప్పగించిందని ఎన్ఐఎ తెలిపింది. జాట్‌కు పాకిస్తాన్‌తో సంబంధాలు ఉన్నాయని నిర్ధారణైన తర్వాత సిఆర్‌పిఎఫ్ సోమవారం అతనిని విధుల నుండి తొలగించింది.

పుట్టిన రోజు వేడుకలకు వెళ్తుండగా విషాదం

- రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి

ప్రజాశక్తి - రాజానగరం, కొవ్వూరు

తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువులోని గామన్‌బ్రిడ్జి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... విశాఖ నుంచి కొవ్వూరు వైపు వెళ్తున్న లారీ గామన్‌బ్రిడ్జిపై కొంతమూరు వద్దకు వచ్చేసరికి టైరు పేలి అదుపుతప్పింది. డివైడర్‌ను దాటుకుని కుడివైపు రహదారిపైకి దూసుకువెళ్లింది. అదే సమయంలో కొవ్వూరు వైపు నుంచి వస్తున్న కారు వేగంగా వచ్చి ఈ లారీని ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న కొవ్వూరుకు చెందిన దంపతులు ఉప్పులూరి ప్రసాద్(60), ఉప్పులూరి శివలీలావతి(56), చాగల్లు మండలం దారవరం గ్రామానికి చెందిన లంకంసాని బిందు (34) అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా గాయపడిన ఇమ్మాని వీరవెంకటసత్యవతి, లంకంసాని సురేష్‌లను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఇమ్మాని వీరవెంకటసత్యవతి(75) ఆసుపత్రిలో మరణించారు. వీరవెంకటసత్యవతి, శివలీలావతి తల్లీకూతుళ్లు. బిందు, సురేష్ భార్యాభర్తలు. ఈ రెండు కుటుంబాలు కొవ్వూరులో పక్కపక్కనే నివాసం ఉంటున్నాయి. ప్రసాద్, శివలీలావతిల కుమార్తె కాకినాడలో చదువుకుంటున్నారు. సోమవారం ఆమె పుట్టినరోజు కావడంతో వీరంతా కలిసి కాకినాడ కారులో వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దేశ సార్వభౌమాన్ని తాకట్టు పెట్టేలా కేంద్రం పోకడలు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ, విశాఖపట్నం

పహల్గాం ఉగ్ర దాడి అనంతరం కేంద్ర ప్రభుత్వ వైఖరి, విధానాలు దేశ సార్వభౌమ సామర్థ్యాన్ని అమెరికాకు తాకట్టు పెట్టేలా ఉన్నాయని, వాస్తవాలను పక్కన పెట్టి ప్రజలను పక్కదారి పట్టించేవిధంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ అన్నారు. 'పహల్గాం ఉగ్రదాడి తదనంతర పరిణామాలు' అనే అంశంపై విశాఖ డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో గురజాడ అధ్యయన వేదిక ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. గతంలో ఉగ్రవాద దాడులన్నీ హింసను ప్రేరేపించడమే లక్ష్యంగా నిర్వహిస్తే, ఈ ఉగ్రదాడి మతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉందని తెలిపారు. మత విభజన చేయాలనే ఉద్దేశంతో జరిగిన దాడిని నివారించేందుకు మత ఐక్యతను తీసుకురావాల్సిన కేంద్రప్రభుత్వం ఆ పని చేయడంలో తీవ్రంగా విఫలమైందన్నారు. దాడికి పాల్పడిన నలుగురిని పట్టుకోలేకపోయారని తెలిపారు. ఉగ్రవాదులపై ప్రతి దాడుల అనంతరం భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధం వస్తుందని అందరూ భావించే విధంగా ప్రజలను పక్కదారి పట్టించి, చివరకు కాల్పుల విరమణ ప్రకటించారని, ఈ కాల్పుల విరమణ కూడా మొదట అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన సోషల్ మీడియాలో ప్రకటించారని తెలిపారు. మహిళా సైనిక అధికారి ఖురేషిపై బిజెపి ఎంపిలు విద్వేషకరమైన వ్యాఖ్యలు చేసినప్పటికీ ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకోకుండా, రక్షిస్తూ వచ్చిందని, సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంటే తప్ప వారు కనీసం క్షమాపణ చెప్పే పరిస్థితి రాలేదన్నారు. పహల్గాం దాడి అనంతరం మన రాష్ట్రానికి వచ్చిన ప్రధాని మోడీ... ఉగ్రదాడిపైనా, ఉగ్రవాదంపైనా ఎటువంటి వ్యాఖ్యలూ చేయకుండా, దాడిలో మరణించిన రాష్ట్రానికి చెందిన చంద్రమౌళి, మధుసూదన్ కుటుంబాలను కనీసం పరామర్శించకుండా వెళ్లిపోయారని విమర్శించారు. పహల్గాం దాడి అనంతరం 487 మత ఘర్షణలు జరిగాయని, అందులో 129 సంఘటనలు ముస్లిముల పైనే జరిగాయని, ఈ సంఘటనలన్నీ బిజెపి పాలిత ఏడు రాష్ట్రాల్లోనే జరిగాయని వివరించారు. ఉగ్రవాదులు ముస్లిములైనప్పటికీ తమను కాపాడి స్వస్థలాలకు పంపించిందీ ముస్లిములేనని బాధిత కుటుంబ సభ్యులందరూ ప్రకటించి దేశంలో మతసామరస్యాన్ని కాపాడారని తెలిపారు. దేశంలో మతవిద్వేషాలు రెచ్చగొట్టేందుకే ఈ దాడి జరిగిందని, కానీ దేశ ప్రజల ఐక్యత ముందు ఉగ్రవాదుల పన్నాగం నిలబడలేదన్నారు. మోడీ సారథ్యంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటినుంచి సరిహద్దు దేశాలతో ఏదోవిధంగా విభేదిస్తూ ఆ దేశాలతో ఉన్న స్నేహభావాన్ని నాశనంచేస్తోందని, ఇది భవిష్యత్తులో తీవ్ర నష్టాలు చేకూర్చే అవకాశం ఉందన్నారు. అధ్యయన వేదిక కన్వీనర్ సిహెచ్.సత్యనారాయణ అధ్యక్షత వహించారు.

ఒకే దేశం - ఒకే ఎన్నిక అవసరం

పవన్ కల్యాణ్

చెన్నై : జమిలి ఎన్నికలు దేశానికి కొత్తేమీ కాదని, అవి అవసరమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. 1952 నుంచి 1967 వరకూ దేశంలో జమిలి ఎన్నికలు జరిగాయని గుర్తు చేశారు. 1967 తరువాత జమిలి ఎన్నికల లింక్ తెగిపోయిన తరువాత వీటి కోసం తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డిఎంకె అధినేత ఎం కరుణానిధి డిమాండ్ చేశారని కూడా పవన్ కళ్యాణ్ తెలిపారు.

ప్రస్తుతం తమిళనాడులో ఉన్న డిఎంకె ప్రభుత్వం జమిలి ఎన్నికలను వ్యతిరేకిస్తుందని విమర్శించారు. చెన్నైలో సోమవారం 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన ప్రసంగించారు. జమిలి ఎన్నికలు కొత్త భావనేం కాదని, మన దేశం నిర్మాణాత్మక సంవత్సరాల్లో వాటిని విజయవంతంగా అమలు చేసిందని చెప్పారు. ఈ విధానం కేవలం రాజకీయ సంస్కరణ మాత్రమే కాదని, ఆర్థిక- పరిపాలనా - పాలనా సంస్కరణ కూడా అని పవన్ కళ్యాణ్ తెలిపారు. జమిలి ఎన్నికలపై కొన్ని రాజకీయ పార్టీలు నిరంతరం విమర్శలు గుప్పిస్తున్నాయని అన్నారు.

దేశంలో అభివృద్ధి ఇంకా వెనుకబడే ఉందని, అయినా సరే దేశంలో అనేక రాజకీయపార్టీలు ఎన్నికల కోసం నిరంతరం వ్యూహరచన, ప్రజాకర్షక చర్యలను రూపొందించడం, ప్రచారాల కోసం నాయకులను మోహరించడం వంటి చర్యలతో మునిగి ఉంటున్నాయని తెలిపారు. నటుడు విజయ్ రాజకీయాల్లోకి రావడాన్ని తక్కువ అంచనా వేయకూడదని చెప్పారు.

సిఎపిఎఫ్‌ల్లో ఐపిఎస్ పోస్టింగ్‌లను తగ్గించండి

- సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ : పోలీసు అధికారుల్లో మనోధైర్యాన్ని పెంపొందించేందుకు గానూ కేంద్ర సాయుధ పోలీసు బలగాల్లో (సిఎపిఎఫ్) ఐపిఎస్ పోస్టింగ్‌లను తగ్గించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. సిఎపిఎఫ్‌ల్లో ఇన్‌స్పెక్టర్ జనరల్ ర్యాంక్ వరకు ఐపిఎస్ అధికారుల డిప్యుటేషన్‌ను రాబోయే రెండేళ్లలో గణనీయంగా తగ్గించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తద్వారా కేడర్ అధికారులకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని పేర్కొంది. ఈమేరకు ఈ నెల 23న జస్టిస్ అభయ్ ఎస్.ఓఖా, జస్టిస్ ఉజ్జల్ భయాన్‌లతో కూడిన బెంచ్ ఉత్తర్వులను వెలువరించింది. సిఎపిఎఫ్‌ల్లో కేడర్ అధికారుల ప్రమోషన్లలో జాప్యం జరగడంతో అది వారి మానసిక, నైతిక పరిస్థితులపై ప్రతికూల ప్రభావాన్ని చూపగలదని హెచ్చరించింది. సిఎపిఎఫ్‌ల్లో కేడర్ రివ్యూ ఆరుమాసాలకోసారి జరగాల్సి ఉన్నా, 2020లో సుప్రీం కోర్టు స్టే విధించింది. ఐదు కేంద్ర పోలీసు బలగాలు - సిఆర్‌పిఎఫ్, బిఎస్ఎఫ్, సిఐఎస్ఎఫ్, ఐటిబిపి, ఎస్ఎస్‌బిలు కేంద్ర హోం శాఖ అధీనంలో పనిచేస్తాయి. వివిధ రకాల శాంతిభద్రతల విధులను నిర్వహిస్తాయి. అంతర్గత భద్రతా విధులు కూడా చేపడతాయి. సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ (ఐజి ర్యాంక్) వరకు పోస్టులను ఐపిఎస్ అధికారులే చేపడుతున్నందున తమ ప్రమోషన్ అవకాశాలకు అవరోధం కలుగుతోందని పిటిషనర్లు కోర్టును ఆశ్రయించారు. దీనివల్ల సర్వీసు వ్యవస్థలో ప్రతిష్టంభనకు దారితీస్తోందని కోర్టు ఉత్తర్వులు పేర్కొన్నాయి. ఫలితంగా కేడర్ అధికారులు కమాండెంట్ (కమాండింగ్ ఆఫీసర్) ర్యాంక్‌ను చేరుకోవడానికి ఏడు నుంచి పదేళ్ల జాప్యం జరుగుతోందని వారు పేర్కొన్నారు.

మావోయిస్టుల మృతదేహాలు ఇవ్వలేదు

- నారాయణపూర్‌లో మృతుల బంధువుల పడిగాపులు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై నిరసన

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతోపాటు ఇతరుల మృత దేహాలను బంధువులకు అప్పగించే విషయమై ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. ప్రాణాలు పోయి రోజులు గడుస్తున్నా రోజుకో మాట చెబుతూ అమానవీయంగా వ్యవహరిస్తున్నారని బంధువులు అంటున్నారు. మృతదేహాల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఈ వైఖరికి నిరసనగా సోమవారం మృతుల బంధువులు నారాయణపూర్‌లో నిరసన తెలిపారు. మృతదేహాలను వెంటనే ఇవ్వాలంటూ నినాదాలు చేస్తూ నారాయణపూర్ నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్‌పి కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. రాత్రి ఏడు గంటల సమయంలో అక్కడి కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

నారాయణపూర్ ఎస్‌పి కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మావోయిస్టుల కుటుంబ సభ్యులు

అనంతరం నంబాల కేశవరావు సోదరుడు రాంప్రసాద్ మాట్లాడుతూ మృతదేహాల కోసం ఐదు రోజులుగా తాము ప్రయత్నిస్తున్నా ఇవ్వడానికి పోలీసులు అంగీకరించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఒత్తిళ్లతో పోలీసులు మృతదేహాలను అప్పగించడానికి నిరాకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనలో సజ్జా నాగేశ్వరరావు, విజయలక్ష్మి, సంగీత, రాకేష్ బంధువులు పాల్గొన్నారు.

తక్షణమే అప్పగించండి

- ప్రజాసంఘాల నేతలు డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ /అమరావతి బ్యూరో

నారాయణ్‌పూర్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించాలని డిమాండ్‌చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యాన ప్రకాశం భవనం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ కన్వీనర్ వీరాంజనేయులు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఈ నెల 21న నారాయణ్‌పూర్ జిల్లాలో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌ను ఖండిస్తున్నట్లు తెలిపారు. మరణించిన మావోయిస్టు జాతీయ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, మిలిటరీ పత్రిక ఎడిటర్ సజ్జు నాగేశ్వరరావు, తెలంగాణకు చెందిన విజయలక్ష్మి, సంగీత, రాజేష్, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 22 మంది మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించకుండా 4 రోజులుగా బీజాపూర్ జిల్లా ఆసుపత్రి మార్చురీలోనే ఉంచడం దారుణమన్నారు. కోర్టులు ఆదేశించినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. మావోయిస్టులు శాంతి చర్చలకు సంసిద్ధత వ్యక్తం చేసినప్పటికీ ప్రభుత్వం ఎన్‌కౌంటర్ల పేరుతో అమాయకులైన ఆదివాసీల ప్రాణాలను బలి తీసుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.వీరారెడ్డి మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన తరువాత పౌర హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జివి. కొండారెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను భయభ్రాంతులకు గురిచేసి అటవీ ప్రాంతాల నుంచి ఖాళీ చేయించేందుకు కుట్ర పన్నాయని విమర్శించారు. అనంతరం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘ జిల్లా అధ్యక్షులు క్రాంతి, ఒపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్, పిఒడబ్ల్యు ప్రధాన కార్యదర్శి పద్మ, ఐఎల్‌పి రాష్ట్ర అధ్యక్షులు సుందరం, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.మోహన్, కెవిపిఎస్, సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మృతదేహాలను అప్పగించాలి : సిఎంకు సిపిఐ లేఖ

ఈ నెల 21న కేంద్ర బలగాల కాల్పుల్లో మరణించిన మావోయిస్టు పార్టీ అగ్రనేత నంబాల కేశవరావుతోపాటు మరికొందరి మృతదేహాలను వారి బంధువులకు అప్పగించాలని సిపిఐ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సిఎం చంద్రబాబు నాయుడుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ సోమవారం లేఖ రాశారు. తెలుగువారైన నంబాల కేశవరావు, సజ్జా నాగేశ్వరరావు, విజయలక్ష్మి, సంగీత, రాకేష్ మృతదేహాలను వారి బంధువులకు అప్పగించలేదని లేఖలో పేర్కొన్నారు.

కుతంత్రాలు ఆపి తక్షణమే మృతదేహాలు అప్పగించాలి

మావోయిస్టుల మృతదేహాలను చూపించకుండా, వారి కుటుంబ సభ్యులను బెదిరిస్తున్నారని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుతంత్రాలు ఆపి మృతదేహాలను వారి బంధువులకు అప్పగించాలని ఒక ప్రకటనలో కోరింది. మృతదేహాలను ఆయా రాష్ట్రాలకు తెప్పించి వారి కుటుంబాలకు అప్పగించే బాధ్యత తెలుగు రాష్ట్రాల సిఎంలైన చంద్రబాబు, రేవంత్‌రెడ్డిదేనని పేర్కొంది.

సుప్రీంకోర్టుకు ముగ్గురు కొత్త న్యాయమూర్తులు

- కొలిజియం సిఫార్సు

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టుకు ముగ్గురు కొత్త న్యాయమూర్తులను కొలిజియం సోమవారం సిఫార్సు చేసింది. కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి అంజరియా, గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విజయ్ బిష్ణోయి, బాంబే హైకోర్టు జడ్జి జస్టిస్ ఎ.ఎస్. చందూర్కర్‌లను భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయి నేతృత్వంలోని కొలిజియం సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా సిఫార్సు చేసింది. కొలీజియం అధ్యక్షుడైన తరువాత బిఆర్ గవాయి చేసిన తొలి సిఫార్సు ఇదే కావడం విశేషం. ఇటీవల జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎఎస్ ఓఖా పదవీ విరమణతో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 31కు తగ్గింది. ఈ ఏడాది జూన్ 9న జస్టిస్ బేలా త్రివేది పదవీ విరమణ చేయనున్నారు. దీంతో న్యాయమూర్తుల సంఖ్య 30కు తగ్గనుంది. సుప్రీంకోర్టుకు మంజూరైన మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 34. సుప్రీంకోర్టుకు ప్రస్తుతం అధికారంగా వేసవి సెలవులే అయినా, ఐదుగురు సీనియర్ మోస్ట్ న్యాయమూర్తులే వెకేషన్ ధర్మాసనాలకు కూడా అధ్యక్షత వహిస్తున్నారు.

న్యాయమూర్తుల వివరాలివి...

జస్టిస్ ఎన్‌వి అంజారియా : కొలిజియం సిఫార్సు చేసిన జస్టిస్ అంజరియా 1965, మార్చిలో అహ్మదాబాద్‌లో జన్మించారు. న్యాయవాదుల కుటుంబం నుంచి వచ్చిన ఆయన సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, బిఎస్ఎన్ఎల్, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్‌లకు సీనియర్ ప్యానెల్ కౌన్సిల్‌గా పనిచేశారు. అంజరియా 2011 నవంబర్‌లో గుజరాత్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. సెప్టెంబర్ 2013లో శాశ్వత న్యాయమూర్తి అయ్యారు. గత సంవత్సరం ఫిబ్రవరి 25న కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు.

జస్టిస్ విజయ్ బిష్ణోయ్ : 1964 మార్చిలో జోధ్‌పూర్‌లో బిష్ణోయ్ జన్మించారు. జూలై 1989లో న్యాయవాదిగా చేరారు. జనవరి 2013లో రాజస్థాన్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. జనవరి 2015లో హైకోర్టు శాశ్వత న్యాయమూర్తి అయ్యారు. ఫిబ్రవరి 5, 2024న గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు.

జస్టిస్ ఎఎస్ చందూర్కర్ : ఎఎస్ చందూర్కర్ 19 65, ఏప్రిల్‌లో జన్మించారు. జూలై 1988లో న్యాయవాద వృతిలో చేరారు. జూన్ 21, 2013న బాంబే హైకోర్టు బెంచ్‌కు పదోన్నతి పొందారు.

రెండు దఫాలుగా నీట్ పిజి పరీక్షపై విచారణకు సుప్రీంకోర్టు అంగీకారం

న్యూఢిల్లీ : నీట్-పిజి పరీక్షను రెండు దఫాలుగా నిర్వహించాలన్న నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ (ఎన్‌బిఇ) నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు సోమవారం అంగీకరించింది. న్యాయవాది వాదనలను పరిగణనలోకి తీసుకున్నామని, త్వరలో విచారణకు జాబితా చేస్తామని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది. రెండు షిఫ్టుల్లో నిర్వహించడంతో సమయాల్లో క్లిష్టత కారణంగా అభ్యర్థులకు అన్యాయం జరిగే అవకాశం ఉందని పిటిషనర్ పేర్కొన్నారు. అభ్యర్థులందరికీ "న్యాయమైన సహేతుకమైన, సమానమైన" పోటీ ఉండేలా పరీక్షను ఒకే దశలో నిర్వహించేలా ఎన్ఇబిని ఆదేశించాలని కోరారు. షెడ్యూల్ ప్రకారం.. నీట్-పిజి -2025 పరీక్షలు జూన్ 15న కంప్యూటర్ ఆధారిత ప్లాట్‌ఫామ్‌పై రెండు దఫాలుగా నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఫలితాలు జులై 15న వెలువడనున్నాయి.

ఇజ్రాయిల్ పాశవిక దాడుల్లో 52 మంది బలి

- మృతుల్లో 36 మంది పునరావాస శిబిరంలోని వారే

గాజాస్ట్రిప్ : పాలస్తీనా వాసులపై ఇజ్రాయిల్ పాశవిక దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. సోమవారం తెల్లవారుజామున ఇజ్రాయిల్ సైన్యం చేసిన దాడుల్లో 52 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 36 మంది పునరావాస శిబిరంలో తలదాచుకుంటున్నవారే. నిద్రలో ఉండగానే వీరంతా ఇజ్రాయిల్ దాడుల్లో కన్నుమూశారు. గాజా నగరం దరాజ్‌లోని పాఠశాలపై జరిగిన దాడిలో పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఈ ఏడాది మార్చి నుంచి ఇజ్రాయిల్ తన దాడులను మరింత ఉధృతం చేసిన సంగతి తెలిసిందే. దాదాపు మూడు నెలలుగా ఆహారం, మందులు, ఇంధనం తదితర నిత్యావసరాలు గాజాలోకి రాకుండా అడ్డుకున్న ఇజ్రాయిల్ ఇటీవలే వాటి రవాణాకు అనుమతించింది. అంతర్జాతీయ సంస్థలు, సహాయ బృందాలు గాజాలో కరువు గురించి పదేపదే హెచ్చరించడంతో ఇజ్రాయిల్ తప్పనిసరి పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకుంది. గాజాలోకి వస్తున్న సహాయం అక్కడి అవసరాలకు ఏమాత్రం సరిపోదని అంతర్జాతీయ సంస్థలు చెబుతున్నాయి. గాజాను పూర్తిగా స్వాధీనం చేసుకుని, అక్కడ ఉన్న 20 లక్షలకుపైగా ప్రజల్ని బలవంతంగా వలస వెళ్లేవిధంగా చేసే ఉద్దేశంతోనే ఇజ్రాయిల్ దాడులను కొనసాగిస్తోంది. ఇప్పటికే గాజాలోని అనేక ప్రాంతాలను ఇజ్రాయిల్ నాశనం చేసింది. దాదాపు 90 శాతం ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఇజ్రాయిల్ దాడుల్లో ఇప్పటి వరకూ 54 వేల మంది పాలస్తీనియన్లు మరణించారు.

సీతంపేటలో దళితుల ఇళ్ల తొలగింపునకు యత్నం

- అడ్డుకున్న నివాసితులు
- వెనుదిరిగిన రెవెన్యూ సిబ్బంది

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

సీతంపేట దళితవాడలో కొందరి ఇళ్ల తొలగింపునకు రెవెన్యూ అధికారులు యత్నించడం ఉద్రిక్తతకు దారితీసింది. దళితవాడలోని సుమారు 20 ఇళ్లు తొలగించడానికి రెవెన్యూ అధికారులు, సిబ్బంది జెసిబిలతో సోమవారం ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అయితే తమకు ఎటువంటి నోటీసులూ ఇవ్వకుండా ఇళ్ల తొలగించడానికి రావడం సరికాదని దళితులు ఆందోళన చేపట్టి జెసిబిలను అడ్డుకున్నారు. సర్వే నెంబర్ 205లో దశాబ్దాల కాలం నుంచి నివాసం ఉంటున్నామని, అది ప్రభుత్వ పుంత పోరంబోకు భూమి అని అధికారులు తమ ఇళ్లు తొలగించడానికి సిద్ధం కావడం దారుణమన్నారు. ఇలాగైతే గ్రామంలోని పుంత పోరంబోకు భూమిలో ఆక్రమణలన్నింటినీ ఖాళీ చేయించాలని, కేవలం దళితుల ఇళ్ల తొలగింపు యత్నాల వెనుక ఆంతర్యం ఏమిటని నిలదీశారు. దీంతో రెవెన్యూ అధికారులు వెనుదిరిగారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
A.P.SOCIAL WELFARE RESIDENTIAL EDUCATIONAL INSTITUTIONS SOCIETY
D.No 12-467-9. Moksha Sai Plaza, Service Road, Tadepalli Guntur District-522 501
e-Procurement TENDER NOTICE.NIT No.1/2025-26/APSWREIS-T Dated: 26.05.2025

The APSWREI Society invites tenders from registered companies / firms for providing of services under the following category:
Supply of study material, Online test series for the students, provision of a customized learning management system (LMS), In-person training to faculties etc., for (10) IIT and NEET coaching centers with ECV of Rs.50.00 lakhs.
Tender details - Start Date: 27.05.2025.
Closing date: Available on https://tender.apeprocurement.gov.in/.
For further details, please contact: Phone: 0863-2347445
Note: Any amendments/ changes will be communicated exclusively through the e- Procurement platform.
Sd- **SECRETARY, APSWREIS**

రైతులకు శుభవార్త

భారత ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య ఎస్ ఓ 2900 (ఇ), తేదీ 24-10-2015 వ్యవసాయ సహకార మరియు రైతు సంక్షేమ శాఖ ప్రకారం మేము ఈ క్రింద తెలిపిన 100% నీటిలో కరిగిపోయే మిశ్రమ ఎరువులను ద్రవ / గుళికల రూపంలో దిగుమతి / తయారు చేసి, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అన్నీ జిల్లాలకు సరఫరా చేయగలమని తెలియజేస్తున్నాము.

S. No.	Type of Fertilizers	Nutrient Percent
1	N : P : K : S	15 : 3 : 5 : 18
2	N : P : K : S	15 : 5 : 21 : 14
3	N : P : K : S	15 : 5 : 10 : 12
4	N : P : K : S	13 : 13 : 13 : 12
5	N : P : K : S	15 : 0 : 15 : 12
6	N : P : K	19 : 19 : 19
7	N : P : K	15 : 8 : 35
8	N : P : K	23 : 19 : 18
9	N : P : K	15 : 35 : 15
10	N : P : K	17 : 17 : 17
11	N : P : K	20 : 20 : 20

పై ఎరువులు పంటల అభివృద్ధికి మరియు అధిక దిగుబడుల కొరకు సహకరించును.
Address :
M/s. SENSATIONAL AGRI INPUTS PVT LTD,
Shop No. 10, Door No. 235/3B, Block No.10, Etukuru Bypass, Etukuru (V), Guntur (U) (M), Guntur (Div) Guntur Dist. Andhra Pradesh-522017
Contact: 9100950564 Email ID : sensationalagripvtltd@gmail.com

వేసవి విడిది

మంచి పనులు

ఒక ఊరిలో ప్రణతి అనే బాలిక ఉంది. వాళ్ళ అమ్మ పేరు కళావతి. వాళ్ల నాన్న పేరు తిరుపతి. ఒకరోజు ప్రణతి బడికి వెళ్తుండగా ఒక దొంగ ఒకరి బ్యాగ్ ఎత్తుకొని పారిపోతున్నాడు. ప్రణతి అది చూసింది. వెంటనే అటుగా వచ్చిన పోలీసులకు దొంగ అటువైపు వెళ్లిన విషయం చెప్పింది. పోలీసులు ఆ దొంగను వెంబడించి పట్టుకున్నారు. పోలీసులు ప్రణతిని చాలా మెచ్చుకున్నారు. ఆ రోజు ప్రణతి బడికి ఆలస్యంగా వెళ్ళింది. జరిగిన విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు ప్రణతిని చాలా మెచ్చుకున్నారు. ప్రణతి బడిలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు చాలా చక్కగా వింటుంది.

వేసవి కాలం వచ్చింది. స్కూళ్లకి సెలవులు ఇచ్చారు. ఒకరోజు ప్రణతి బయటికి వెళుతుండగా ఒక చెట్టు వాడిపోవడం చూసింది. ఆ చెట్టుకు ప్రతిరోజూ నీళ్లు పోసింది. నీళ్ళు త్రాగి ఆ చెట్టు మళ్లీ చిగురించింది. ఆ తర్వాత కొద్ది రోజులకు ప్రణతి బడికి వెళ్తుండగా ఆ చెట్టు కాయలు ఇచ్చింది. ప్రణతి చేసిన సాయానికి ధన్యవాదాలు తెలిపింది. ఇలా ప్రణతి ఎన్నో మంచి మంచి పనులు చేసింది. ప్రణతిని చూసి వాళ్ళ తల్లిదండ్రులు ఎంతో మురిసిపోయారు.

- ఎం. వెంకట ప్రవీణ్,
5వ తరగతి
బుచ్చయ్య పల్లి,
పెద్దపల్లి.

నాన్న..

ఒక ఊరిలో రాము, కృష్ణ అనే ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. రాము రోజూ టౌన్‌కి వెళ్లి ఏదో ఒక పని చేస్తాడు. కృష్ణ మాత్రం బద్ధకస్తుడు. ఏ పనీ చేసేవాడు కాదు. వాళ్ల నాన్న మాత్రం చాలా కష్టపడి పని చేస్తాడు. ఒక రోజు కృష్ణ వాళ్ల నాన్న కృష్ణని తీసుకుని టౌన్ పనికి వెళ్లాడు. వాళ్ళిద్దరూ అక్కడే ఉండి ఆ పనిని చేసుకుంటున్నారు. కొన్ని రోజులకు కృష్ణ ఊరికి వచ్చేశాడు. అదే పనిలో రాము చేరాడు.

తన కొడుకు ఈడు పిల్లాడు రాము కష్టపడి పని చేయడం చూసి కృష్ణ వాళ్ల నాన్న చాలా సంతోషపడ్డాడు. కృష్ణకి కూడా రాములా మంచి బుద్ధి వస్తే బాగుండు అనుకున్నాడు. కొన్ని రోజుల తరువాత కృష్ణ వాళ్ళ నాన్న ఆనారోగ్యం బాగా పాడైంది. రామునే దగ్గరుండి ఆస్పత్రిలో చూపించాడు. ఖర్చుకు అవసరమైన డబ్బులు కూడా సర్దాడు.

నాన్నకి ఆరోగ్యం బాగోలేదన్న వార్త తెలిసి కృష్ణ పరుగుపరుగున ఆస్పత్రికి వచ్చాడు. కొడుకు స్థానంలో ఉండి రాము చేసిన సాయం తెలిసి పశ్చాత్తాపంతో ఎంతో బాధపడ్డాడు. ఇక నుండి నాన్నని కష్టపెట్టకుండా పనిచేయాలనుకుని నిశ్చయించుకున్నాడు. ఆ మాటే తండ్రికి చెప్పాడు. కొడుకులో వచ్చిన మార్పుకి నాన్న ఎంతో సంతోషించాడు.

- ఏ. రిత్విక్,
9వ తరగతి,
కొండపాక.

బొమ్మల కొలువు

కె. త్రివేణి,
9వ తరగతి,
ఎం.తిమ్మాపురం
ఆదర్శ పాఠశాల,
మహానంది (మం),
నంద్యాల జిల్లా.

దాసరి క్రాంతి
3వ తరగతి,
విజయవాడ.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com 83329 25496

జీవన the family

జీవన సారథం

గెలవడంలో ఓడిపోవచ్చు
కానీ.. ప్రయత్నంలో
ఓడిపోకూడదు..

ఆహారంలో ఇవి చేర్చుకోండి.. మంచి నిద్రపోండి..



కొంతమందికి రాత్రుళ్ల సరిగ్గా నిద్ర పట్టదు. అనారోగ్య సమస్యలున్న వారు డాక్టరు చెప్పిన పద్ధతులు పాటిస్తారు. అయితే ఆరోగ్యంగా ఉన్న వాళ్లు కూడా ఈ సమస్యతో బాధపడుతుంటారు. అటువంటి వారు ఆహారంలో కొన్ని మార్పులు చేసుకుంటే మంచి నిద్రని పొందవచ్చు. ఆర్థికంగా భారమైనా వీటిని చేర్చుకుంటే ఫలితం ఉంటుంది.

పాలకూరలో మెగ్నీషియంతో పాటు ఐరన్, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు ఒత్తిడిని తగ్గించి మనసును ప్రశాంతం చేయడంలో సహాయపడతాయి. అందుకే రోజూ పాలకూర తినడం మంచి నిద్రకు దారి తీస్తుంది. పాలకూర వల్ల రక్త ప్రసరణ మెరుగుపడి శరీరం స్థిరంగా ఉంటుంది.

బాదం గింజల్లో పోషకాలు చాలా ఉంటాయి. వీటిలో మెగ్నీషియం ఎక్కువగా ఉండటం వల్ల శరీరానికి కావాల్సిన మినరల్స్ అందుతాయి. రోజూ కొద్దిగా బాదం గింజలు తినడం వల్ల మెదడు కూడా చురుగ్గా మారుతుంది. అంతేకాకుండా ఇందులో ఉన్న ఆరోగ్యకరమైన కొవ్వులు మంచి నిద్రకు సహాయపడతాయి. అందుకే నిద్ర సమస్యలు ఉన్నవారు బాదం తినడం అలవాటు చేసుకోవాలి.

అవకాడో పండులో కూడా మెగ్నీషియం ఎక్కువగా ఉంటుంది. ఇది ఆరోగ్యకరమైన కొవ్వులు, పొటాషియంతో నిండి ఉంటుంది. అవకాడో తినడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి శరీరంలోని రసాయనాలు సరిగ్గా పనిచేస్తాయి. ఫలితంగా మంచి నిద్ర వచ్చే అవకాశం ఉంటుంది.

గుమ్మడి గింజలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిలో మెగ్నీషియం, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. వీటిని రోజూ ఆహారంలో చేర్చుకోవడం వల్ల కండరాలు రిలాక్స్ అవుతాయి. మానసిక ఒత్తిడి తగ్గి నిద్ర మెరుగుపడుతుంది. గుమ్మడి గింజలు నిద్ర సమస్యలకు ఒక సహజమైన పరిష్కారం.

క్వినోవా మెగ్నీషియం, ప్రోటీన్, ఫైబర్ అధికంగా కలిగిన ఆహారం. ఇవి తినడం వల్ల శరీరంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. మంచి నిద్రకు కూడా సహాయపడుతుంది. ఇది శరీర శక్తిని పెంచడంలో కూడా మేలు చేస్తుంది.

బ్లాక్ బీన్స్‌లో కూడా మెగ్నీషియం, ప్రోటీన్, ఫైబర్ మంచి మోతాదులో ఉంటాయి. ఈ బీన్స్‌ను సలాడ్, సూప్, కూరలలో వేసి తినడం వల్ల శరీరానికి కావాల్సిన పోషకాలు అందుతాయి. ఇవి ఒత్తిడిని తగ్గించి శరీరాన్ని ప్రశాంతంగా ఉంచి నిద్రకు సహాయపడతాయి.

అరటి పండులో కూడా మెగ్నీషియం ఉంటుంది. ఇందులో పొటాషియం అధికంగా ఉండటం వల్ల కండరాలను రిలాక్స్ చేసి శరీర ఒత్తిడిని తగ్గిస్తుంది. దాంతో మానసిక ప్రశాంతత కలుగుతుంది. నిద్ర మరింత హాయిగా వస్తుంది.

సాల్మన్ చేపల్లో మెగ్నీషియం, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి ఒత్తిడిని తగ్గించి నిద్ర నాణ్యతను పెంచడంలో సహాయపడతాయి. ఈ చేపలు తినడం వల్ల శరీరం, మనస్సు రెండూ బాగా విశ్రాంతి పొందుతాయి. ఈ విధంగా మెగ్నీషియం ఉన్న ఆహారాలు మంచి నిద్రను అందించి ఆరోగ్యానికి తోడ్పడతాయి.

దోమలను ఇలా తరిమేయండి..



ప్రస్తుతం వరుసగా కురుస్తున్న వర్షాలకు దోమల బెడద ఎక్కువవుతోంది. తరచూ దోమలు కుడితే అనేక ఆరోగ్య సమస్యలకు గురికావాల్సి వస్తుంది. దీంతో చాలా మంది దోమల నివారణ కోసం రకరకాల మస్కిటో రిపెల్లెంట్లు, కాయిల్స్ వంటివి వాడుతుంటారు. ఇలాంటి కెమికల్ ఆధారిత నివారణలతో లేనిపోని అనారోగ్య సమస్యలను కొనితెచ్చుకున్నట్లే. కొన్ని సింపుల్ టిప్స్ ఫాలో అయితే ఈ దోమల బెడద నుంచి సులభంగా తప్పించుకోవచ్చు. ఇలాంటి సహజ సిద్ధ చిట్కాలు పాటించటం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉండవని నిపుణులు చెబుతున్నారు.

దోమల నివారణ కోసం ఉపయోగించే మస్కిటో రిపెల్లెంట్‌లను శరీరానికి డైరెక్ట్‌గా అప్లై చేసుకోకూడదు. కొనే ముందు బాగా రీసెర్చ్ చేయాలి. ఉదయం- సాయంత్రం వేళ లాంగ్ స్లీవ్స్, షర్టులు, ప్యాంటులు, సాక్స్‌లు వేసుకోవటం ఉత్తమం. అలాగే, మస్కిటో నెట్‌లు కొనుక్కుని బెడ్ రూమ్‌లో పెట్టుకోవాలి.

సిట్రోనెల్ల, లావెండర్, మారిగోల్డ్ వంటి మస్కిటో రెపెల్లెంట్ మొక్కలను ఇంట్లో ఏర్పాటు చేసుకోవటం వల్ల కూడా ఫలితం వుంటుంది. దాంతో పాటుగా ఇంట్లో, ఇంటి పరిసరాల్లో నీటి మడుగు, నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలి. దోమల బెడద ఎక్కువగా ఉన్న చోట ఫ్యాన్లు పెట్టుకోవాలి.

దోమలు కొన్ని రకాల సువాసనలకు దూరంగా వెళ్లిపోతుంటాయి. అలాంటి వాటిల్లో తులసి, వెల్లుల్లి, వేప నూనె, లవంగాలు, నిమ్మకాయ, ఉల్లిపాయ, ఆపిల్ సిడార్ వెనిగర్, యూకలిప్టస్ ఆయిల్, లావెండర్, పుదీనా వంటి సువాసనలకు దూరంగా పారిపోతాయి. దోమలు, ఈగలు ఎక్కువగా ఉండే మూలల్లో తరిగిన ఉల్లిపాయలను ఉంచటం వల్ల ఆ ఘాటైన వాసనకు దోమలు, ఈగలు ఆ దరిదాపుల్లో కనిపించవు.

ఇండస్ట్రీలో ఎవరి దారి వారిదే : దిల్‌రాజు

ఏపీ ప్రభుత్వం, తెలుగు సినీ పరిశ్రమ మధ్య నెలకొన్న తాజా పరిస్థితుల నేపథ్యంలో సోమవారం దిల్‌రాజు ప్రెస్‌మీట్ నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితులపై ఆయన పలు విషయాలు మాట్లాడారు.

'కొన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సి ఉంది కాబట్టి, ఈ ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశా. పర్సంటేజీల విషయంలో ఎగ్జిబిటర్లకు కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. ఏప్రిల్‌లో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కొందరు ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు ఈ అంశాన్ని మా దృష్టికి తీసుకొచ్చారు. వాళ్ల కష్టాలు మాకు తెలుసు. గత ఆరు నెలలుగా వస్తున్న రెవెన్యూ గురించి ఈ సందర్భంగా వారిని అడిగాం. ప్రస్తుతం ఇండస్ట్రీలో రెంట్, పర్సంటేజీ విధానం నడుస్తోంది. మొదటి వారం బాగా రెవెన్యూ వస్తే.. రెంట్ ఇస్తున్నాం. సెకండ్ వీక్ కలెక్షన్లు తగ్గగానే పర్సంటేజీ ఇస్తున్నా. అది వాళ్లకు కష్టమైనదే. అది మా అందరికీ తెలుసు. దీనిపై చర్చిస్తున్నాం. కానీ, ఓ కొలిక్కి రాలేదు. ఇదే సమయంలో 'హరి హర వీరమల్లు' విడుదల తేదీని ప్రకటించారు. ఆ తర్వాత కొన్ని కారణాల వల్ల అది వాయిదా పడింది. తర్వాత డేట్‌ను వాళ్లు లాక్ చేయలేదు. పర్సంటేజీ సమస్య ఈస్ట్ గోదావరి నుంచి మొదలై నైజాంకు కూడా వచ్చింది. నైజాంలో 370 సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఉంటే, ఎస్వీసీఎస్ సహా మా వద్ద ఉన్న థియేటర్లు 30 మాత్రమే. ఏషియన్, సురేశ్ కంపెనీలో 90 ఉన్నాయి. 250 థియేటర్లు ఓనర్లు, వాళ్లకు సంబంధించిన వాళ్లు మాత్రమే నడుపుతున్నారు. 'ఆ నలుగురు' అంటూ మీడియాలో వార్తలు వస్తున్నాయి. వాళ్లల్లో నేను లేను. మే 18న ఏపీ, తెలంగాణ ఎగ్జిబిటర్ల సమావేశం జరిగింది. వాళ్ల సమస్యలు, డిమాండ్‌లను నిర్మాతలకు చెప్పమని నేను సూచించాను. అక్కడున్న వాళ్లలో కొందరు 'ఈ సమస్యకు పరిష్కారం దొరక్కపోతే, జూన్ 1 నుంచి థియేటర్లు బంద్ చేస్తా'మని అన్నారు. ఆ తర్వాత వాళ్లు పర్సంటేజీ విషయంలో ఛాంబర్‌కు లేఖ రాశారు. డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలతో మీటింగ్ పెట్టాలని, ఒకవేళ ఆ సమావేశంలో తమ డిమాండ్‌లు నెరవేరకుంటే థియేటర్లు బంద్ చేస్తామని మాత్రమే అన్నారు. అసలు మీటింగ్ జరగకుండా జూన్ 1 నుంచి థియేటర్లు బంద్ అంటూ మీడియాలో వార్తలు వచ్చాయి. ఈ వార్తలను అటు ఎగ్జిబిటర్లు, ఇటు ఛాంబర్ ఖండించలేదు. ఇండస్ట్రీలో ఎవరి దారి వారిదే. నిన్న అరవింద్‌గారు, నేడు నేను ప్రెస్‌మీట్ పెట్టాం. ఇండస్ట్రీలో ఉన్న అందరం కలిసి కదా మీడియాతో మాట్లాడాల్సింది. అంతా కలిసి మాట్లాడాలంటే మాకు భయం.

పవన్ సినిమాలను ఆపే దమ్ము ఎవరికీ లేదు

'ఇప్పటివరకూ కోవిడ్ సమయంలో తప్ప ఎప్పుడూ థియేటర్లు మూతపడలేదు. బంద్ ప్రస్తావన వచ్చినప్పుడు '56 రోజులు చిత్ర పరిశ్రమలో షూటింగ్ ఆపేసి ఏం సాధించలేకపోయా'మని ఎగ్జిబిటర్లతో చెప్పాను. ఇటీవల జరిగిన మీటింగ్‌లో నిర్మాతలందరం కలిసి ఎగ్జిబిటర్ల సమస్యలపై చర్చించాం. ఈ సమస్యకు ఒక పరిష్కారం చూడాలని అనుకున్నాం. ఈలోగా కళ్యాణ్ గారు నటించిన 'హరి హర వీరమల్లు' విషయంలో తప్పుగా వెళ్లింది. ఆయన సినిమాలను ఆపే దమ్ము, ధైర్యం ఎవరికీ లేదు. ప్రభుత్వానికి కూడా ఆ సమాచారాన్ని తప్పుగా చెప్పారు. జూన్, జులై నెలల్లో పెద్ద సినిమాలున్నాయి. ఈ సమయంలో సినీ పరిశ్రమను ఎలా కాపాడుకోవాలనేదే మా అందరి తపన. సినిమా వాళ్లకు రెండు ప్రభుత్వాలు చాలా ముఖ్యం. కళ్యాణ్‌గారి సహకారం మర్చిపోలేము. అందరం కలిసి ఐక్యంగా ఉండాలనే ఆలోచన మా ఇండస్ట్రీలో ఉండదు. ఎవరికి సినిమా వచ్చినప్పుడు వాళ్లు మేల్కొని, టికెట్ ధరలు పెంచుకునేందుకు పరిగెత్తుకుంటూ వెళ్తారు. ఇండస్ట్రీకి ఏ సమస్య వచ్చినా, ప్రభుత్వాలే పరిష్కరించాలి. ఈ ఎపిసోడ్‌తో ఇప్పటికైనా తెర దించుదాం" అని దిల్‌రాజు అన్నారు.

'నిలవే' సినిమా పోస్టర్ విడుదల

సౌమిత్‌రావు, శ్రేయాసి సేన్ జంటగా నటించిన చిత్రం 'నిలవే'... ఈ మూవీకి సౌమిత్‌రావు, సాయి వెన్నం సంయుక్తంగా దర్శకత్వం వహించారు. పిఏపి ఆర్ట్స్ వ్యూ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తాహెర్ సినీ టెక్ సౌజన్యంతో సాయి వెన్నం, గిరిధరరావు పోలాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ నుంచి పాత్రల్ని పరిచయం చేశారు. సంతోషం, నమ్మకం, అలక, పిలుపు అంటూ అన్ని రకాల ఎమోషన్లకు సంబంధించిన 'నిలవే' పోస్టర్‌లను రిలీజ్ చేశారు. అనంతరం కథానాయకుడు సౌమిత్‌రావు మాట్లాడుతూ 'నిలవే' ఓ మంచి మ్యూజికల్ లవ్ డ్రామాగా రాబోతోందన్నారు. అంతా కొత్త వాళ్లం కలిసి చేస్తున్నామన్నారు. ఈ చిత్రం అందరినీ సర్ ప్రైజ్ చేస్తుందన్నారు. దర్శకుడు సాయి వెన్నం మాట్లాడుతూ ఇదొక అందమైన ప్రేమ కథగా తెరకెక్కించామన్నారు. ఓ వ్యక్తి జీవితంలో జరిగే ప్రయాణమే 'నిలవే'. మ్యూజిక్‌ని లవ్‌తో చూపించాలని అనుకున్నామన్నారు.

కన్నప్పలో ప్రభాస్ పాత్ర 50 నిమిషాలు

మంచు విష్ణు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'కన్నప్ప'. విష్ణు డ్రీమ్ ప్రాజెక్టుగా ఈ సినిమా తెరకెక్కింది. ప్రీ ప్రొడక్షన్స్ కారణంగా ఈ సినిమా వాయిదా పడింది. ఇప్పటికే సినిమా షూటింగ్ పూర్తయి నిర్మాణాంతర పనులు కొనసాగుతున్నాయి. జూన్ 27న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ఇంకా నెలరోజులు సమయం ఉండటంతో చిత్ర యూనిట్ ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేసింది. మంచు విష్ణు తాజాగా ఓ ఇంటర్వ్యూలో ప్రభాస్ రోల్ గురించి ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్ 50 నిమిషాల పాటు కనిపిస్తారని తెలిపారు. కన్నప్ప 3 గంటల 10 నిమిషాల రన్‌టైమ్‌ను కలిగి ఉందన్నారు. కన్నప్ప పరివర్తనలో కీలక పాత్ర పోషించే దైవిక వ్యక్తిగా ప్రభాస్ నటించారని వెల్లడించారు. ఈ సినిమాను ఆధ్యాత్మిక మార్గంలో బయలుదేరే ఒక నాస్తికుడి గురించిన పౌరాణిక కథగా తెరకెక్కించినట్లు తెలిపారు. ప్రభాస్‌కు మోహన్ బాబుతో ముఖ్యమైన సన్నివేశాలు ఉన్నాయని వివరించారు. మోహన్ లాల్ పాత్ర 15 నిమిషాలకే పరిమితం అయినప్పటికీ.. బలమైన భావోద్వేగాన్ని కలిగి ఉంటుందని పేర్కొన్నారు. కాగా.. ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, కాజల్ అగర్వాల్ అతిథి పాత్రలలో కనిపించనున్నారు. ఈ చిత్రం నుంచి శ్రీ-కాళహస్తి అనే పాటను ఈనెల 28న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ పాటని విష్ణు కుమార్తెలు అరియానా, వివియానా పాడారు. ఈ పాటకు స్టీఫెన్ దేవస్సీ సంగీతం అందించారు. ఈ సినిమాకు ముఖేష్ కుమార్‌సింగ్ దర్శకత్వం వహించగా.. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై నిర్మించారు. ఈ సినిమాలో మోహన్ బాబు, శరత్‌కుమార్, అర్పిత్ రంకా, ప్రీతి ముఖుందన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ముంబయికి పంజాబ్ చెక్

టాప్‌లోకి కింగ్స్
4వ స్థానంలోనే ఇండియన్స్
నేడు లక్నోతో బెంగళూరు కీలక పోరు

పంజాబ్‌ను గెలిపించిన ప్రియాన్ష్, ఇంగ్లిస్

జైపూర్: అందరి అంచనాలను తలక్రిందులు చేస్తూ పంజాబ్ కింగ్స్ జట్టు ఈ సీజన్ ఐపిఎల్‌లో టాప్‌లోకి ఎగబాకింది. ముంబయిపై గెలిస్తే అగ్రస్థానం ఖాయం అనుకున్న దశలో ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ముంబయి నిర్దేశించిన 185పరుగుల లక్ష్యాన్ని పంజాబ్ జట్టు మరో తొమ్మిది బంతులు మిగిలి ఉండగానే సునాయాసంగా ఛేదించింది. ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్యా(62), ఇంగ్లిస్(73) అర్ధసెంచరీలతో రాణించి పంజాబ్ గెలుపులో కీలకపాత్ర పోషించారు. కెప్టెన్ శ్రేయస్(26నాటౌట్) స్ఫూర్తిదాయక ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. ఈ గెలుపుతో పంజాబ్ జట్టు 14 లీగ్ మ్యాచ్‌లు ముగిసేసరికి 9విజయాలతో సహ 19పాయింట్లతో టాప్‌లో నిలిచింది. ఇప్పటికే ప్లే-ఆఫ్ బెర్త్ ఖాయం చేసుకున్న ముంబయి జట్టు చివరి లీగ్ మ్యాచ్‌లో ఓడినా.. 16పాయింట్లతో 4వ స్థానంతో ముగించింది. ఇక లక్నో సూపర్ జెయింట్స్-బెంగళూరు జట్ల మధ్య నేడు కీలక పోరు జరగనుంది. ఈ మ్యాచ్‌లో నెగ్గితే బెంగళూరు జట్టు టాప్-2లో నిలవడం ఖాయం. అదే జరిగితే గుజరాత్ 3వ స్థానానికి పరిమితమై ముంబయితో నాకౌట్ మ్యాచ్‌లో తలపడాల్సి ఉంటుంది. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబయిను మిస్టర్ 360 డిగ్రీస్ అర్ధసెంచరీతో ఆదుకున్నాడు. కెప్టెన్ హార్దిక్ పాండ్యా(26)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన సూర్యకుమార్.. చివరి బంతి వరకు క్రీజ్‌లో నిలిచిన సూర్యకుమార్(57; 39బంతుల్లో 6ఫోర్లు, 2సిక్సర్లు) బ్యాటింగ్‌లో రాణించాడు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
పంజాబ్	14	9	4	1	19	+0.37
గుజరాత్	14	9	5	0	18	+0.25
బెంగళూరు	13	8	4	1	17	+0.25
ముంబయి	14	8	6	0	16	+1.14
ఢిల్లీ	14	7	6	1	15	+0.01
సన్‌రైజర్స్	14	6	7	1	13	-0.24
లక్నో	13	6	7	0	12	-0.33
కోల్‌కతా	14	5	7	2	12	-0.30
రాజస్తాన్	14	4	10	0	8	-0.54
చెన్నై	14	4	10	0	8	-0.64

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్ రన్‌రేట్

స్కోర్‌బోర్డు...

ముంబయి ఇండియన్స్ ఇన్నింగ్స్: రికెల్టన్ (సి)శ్రేయస్ (బి)జాన్సెన్ 27, రోహిత్ శర్మ (సి)వాధేరా (బి)హర్‌ప్రీత్ బ్రార్ 24, సూర్యకుమార్ (ఎల్‌బి)అర్ష్‌దీప్ 57, తిలక్ వర్మ (సి)అర్ష్‌దీప్ (బి)వ్యాషక్ 1, విల్ జాక్స్ (సి)జాన్సెన్ (బి)వ్యాషక్ 17, హార్దిక్ పాండ్యా (సి)ఇంగ్లిస్ (బి)జాన్సెన్ 26, నమన్ ధీర్ (సి)ప్రియాన్ష్ ఆర్యా (బి)అర్ష్‌దీప్ 20, సాంట్నర్ (నాటౌట్) 1, అదనం 11. (20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 184పరుగులు. **వికెట్ల పతనం:** 1/45, 2/81, 3/87, 4/106, 5/150, 6/181, 7/184 **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-28-2, జేమీసన్ 4-0-42-0, జాన్సెన్ 4-0-34-2, హర్‌ప్రీత్ బ్రార్ 4-0-36-1, వ్యాషక్ 4-0-44-2.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రియాన్ష్ ఆర్యా (సి)సూర్యకుమార్ (బి)సాంట్నర్ 62, ప్రభ్‌సిమ్రన్ (సి)అశ్వనీ కుమార్ (బి)బుమ్రా 13, ఇంగ్లిస్ (ఎల్‌బి)సాంట్నర్ 73, శ్రేయస్ (నాటౌట్) 26, వాధేరా (నాటౌట్) 2, అదనం 11. (18.3ఓవర్లలో 3వికెట్ల నష్టానికి) 187పరుగులు. **వికెట్ల పతనం:** 1/34, 2/143, 3/171 **బౌలింగ్:** బౌల్ట్ 3.3-0-36-0, దీపక్ చాహర్ 3-1-28-0, బుమ్రా 4-0-23-1, సాంట్నర్ 4-0-41-2, హార్దిక్ 2-0-29-0, అశ్వనీ కుమార్ 1-0-16-0, విల్ జాక్స్ 1-0-11-0.

ఐపిఎల్‌లో నేడు
లక్నో సూపర్‌జెయింట్స్ X రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు
వేదిక: లక్నో; రాత్రి 7.30గం॥లకు

అల్కరాజ్, రూడ్ అలవోకగా..

ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ ఛాంపియన్, 2వ సీడ్ కార్లోస్ అల్కరాజ్(స్పెయిన్), 7వ సీడ్, నార్వేకు చెందిన కాస్పర్ రూడ్ ప్రత్యర్థులపై అలవోకగా గెలిచి రెండోరౌండ్‌లోకి ప్రవేశించారు. సోమవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో అల్కరాజ్ 6-3, 6-4, 6-2తో ఇటలీ క్వాలిఫయర్ జూలియో జెప్పియేరిను వరుససెట్లలో ఓడించాడు. ఇక నార్వేకు చెందిన 7వ సీడ్ రూడ్ 6-3, 6-4, 6-2తో స్పెయిన్‌కు చెందిన అన్‌సీడెడ్ రామోస్‌ను ఓడించాడు. ఇతర పోటీల్లో 20వ సీడ్, గ్రీక్‌కు చెందిన 7-5, 6-3, 6-4తో ఎబ్చెవెర్రి(అర్జెంటీనా)ను, 26వ సీడ్ డావిడోవిర్చ్(స్పెయిన్) 6-3, 6-2, 6-7(4-7), 6-3తో సహచర ఆటగాడు లామన్‌ను ఓడించాడు. ఇక 10వ సీడ్ రూనే(హంగేరి) 6-7(4-7), 6-4, 6-3, 6-2తో స్పెయిన్‌కు చెందిన అన్‌సీడెడ్ బొటిస్టాను ఓడించి రెండోరౌండ్‌కు చేరాడు.

నవాత్రో ఔట్..

ఇక మహిళల సింగిల్స్‌లో 9వ సీడ్, అమెరికాకు చెందిన ఎలేనా నవ్రాత్రో అనూహ్యంగా తొలిరౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. సోమవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో నవాత్రో 0-6, 1-6తో స్పెయిన్‌కు చెందిన అన్‌సీడెడ్ బౌజాస్ చేతిలో ఓటమిపాలైంది. మరో పోటీలో 12వ సీడ్ రైబకినా(కజకిస్తాన్) 6-1, 4-6, 6-4తో అర్జెంటీనాకు చెందిన రిరాపై, రాడుకాను(బ్రిటన్) 7-5, 4-6, 6-3తో వాంగ్(చైనా)పై, 5వ సీడ్ ఇగా స్వైటెక్(పోలండ్) 6-3, 6-3తో సమకోవా(ఉక్రెయిన్)పై, 10వ సీడ్ బడోసా(స్పెయిన్) 6-7(1-7), 6-1, 6-4తో ఒసాకా(జపాన్)పై విజయం సాధించి రెండోరౌండ్‌లోకి ప్రవేశించారు.

క్రికెట్‌కు ప్రియాంక్ పాంచల్ గుడ్‌బై

అహ్మదాబాద్: గుజరాత్ మాజీ కెప్టెన్ ప్రియాంక్ పాంచల్ క్రికెట్ అన్ని ఫార్మాట్‌లకు గుడ్‌బై చెబుతున్నట్లు ప్రకటించాడు. భారత-ఎ జట్టుకు సారథిగా వ్యవహరించిన ప్రియాంక్.. అన్ని ఫార్మాట్ల నుంచి వైదొలుగుతున్నానని వెల్లడించాడు. ఈ విషయాన్ని గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ సోమవారం అధికారికంగా తెలిపింది. 35ఏళ్ల ప్రియాంక్ గుజరాత్ క్రికెట్‌కు విశేష సేవలు అందించాడు. 17 ఏళ్ల పాటు నిలకడగా రాణించాడని అతడిని కొనియాడింది. 'కుడిచేతి వాటం బ్యాటర్ అయిన ప్రియాంక్ ఇండియా ఏ కెప్టెన్‌గానూ రాణించాడు. అతడు ఒక రన్ మెషిన్. 17 ఏళ్లు అతడు దేశవళీలో గుజరాత్ క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. 2021లో స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌కు ఓపెనర్ రోహిత్ శర్మకు ప్రత్యామ్నాయంగా అతడిని జట్టులోకి తీసుకున్నారు సెలెక్టర్లు. సుదీర్ఘ కెరీర్‌లో 127 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడాడు. 2016-17 రంజీ సీజన్‌లో అజేయ ట్రిపుల్ సెంచరీ(314 నాటౌట్)తో సహా 1,310 పరుగులు చేశాడు. ఆ సీజన్ రంజీ ఛాంపియన్ గుజరాత్. 2012-13లో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, 2015-16లో విజయ్ హజారే ట్రోఫీ గెలుపొందిన గుజరాత్ జట్టులో ప్రియాంక్ సభ్యుడు. దేశవాళీ మ్యాచుల్లో 29 సెంచరీలు, 34 అర్ధ శతకాలతో సహా 97 లిస్ట్-ఎ మ్యాచుల్లో 8 సెంచరీలతో కలిపి 3,672 పరుగులు చేశాడు. 59 టి20ల్లో 28.71 సగటుతో 1,522 పరుగులు సాధించాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68